# తిరుమలలో తిరునాళ్ళు



చిట్రాజు గోవిందరాజు

# తిరుమలలో తిరునాళ్ళు

రచన

సి. గోవిందరాజు ఎం.ఏ.,ఎం.ఫిల్.

శ్రీనివాస ప్రచురణలు
రామసముద్రం

ప్రథమ ముద్రణ

క్రోధన 1985

సర్వస్వామ్యములు : రచయితవి

**ప్రతులు : 1000**

**వెల రూ. 12-00**


ప్రకాశకులు :

**సి. బాలకృష్ణమరాజు**

శ్రీనివాస ప్రచురణలు
రామసముద్రం (631206)
వయా మద్దూరు
పళ్లిపట్టు తాలూకా
చెంగల్‌పట్టు జిల్లా

ముద్రణ :

**శారద ప్రింటర్స్**
తిరుపతి



This book is
published with the
financial assistance of
Tirumala Tirupati Devasthanams
under their Scheme
" AID TO PUBLISH RELIGIOUS BOOKS "

# అంజలి

'కొండలలో నెలకొన్న కోనేటి రాయని' గురించి చదువు కొన్న ఎన్నో పుస్తకాలలోని విశేషాలను, విన్న విషయాల్ని లోకానికి అందించాలను కోవడమే ఈ పుస్తక ముద్రణకు ప్రధాన కారణం.

దేవాలయాలలో జరిగే ఉత్సవాలు అనేక రకాలు. వాటిలో కొన్ని కాల గర్భంలో కలసి పోయాయి. కొన్ని కొత్త రూపం తొడుగుకొని ఆచరింపబడు తున్నాయి. మరికొన్ని ఉత్సవాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ దృష్టితోనే తిరుమలలో జరిగే ఉత్సవాలలో కొన్నిటిని పరిశీలించడం జరిగింది.

ఈ పుస్తకంలో ఎనిమిది వ్యాసాలున్నాయి. వీటిలో "ధనుర్మాసోత్సవం" [30-12-84], "వసంతోత్సవం" [31-3-85] వ్యాసాలు ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలోను, "కోడై తిరునాళ్" వ్యాసం [ఏప్రిల్ 85] సప్తగిరి మాస పత్రికలోను, "డోలోత్సవం" అనే వ్యాసం [జూలై 85] సద్గురువాణి త్రైమాసిక పత్రికలో ప్రచురిత మయినాయి.

ఈ వ్యాసాలన్నీ పుస్తక రూపంలో ఉంటే బాగుంటుందని సూచించిన గురువులు, హితులు, మిత్రులు నన్ను, నా రచనల్ని ప్రోత్సహిస్తున్న వారు శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు గురువర్యులు ఆచార్య జి. యస్. రెడ్డిగారు

విషయ సేకరణలో, వివరణలో సలహాలు సూచించిన గురువర్యులు డా॥ కె. సర్వోత్తమరావుగారు, గురుతుల్యులు డా॥ యస్. పి. రఘునాథాచార్యుల వారు.

ఈ పుస్తక ప్రచురణకు కొంతవరకు ఆర్థిక సహాయం అందజేసిన వారు తి.తి. దేవస్థానం కార్య నిర్వహణాధికారులు శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ I.A.S. గారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వి. కె. డి. వి. సత్యనారాయణరాజు ఎం.ఎల్.ఎ. గారు..........

ధార్మిక గ్రంథాల ప్రచురణలను ప్రోత్సహించే డా॥ రావుల సూర్యనారాయణమూర్తిగారు, శ్రీకాట్రపాటి సుబ్బారావుగారు..........

నా పుస్తకానికి అందంగా ముఖచిత్రాన్ని చిత్రించి యిచ్చిన మిత్రుడు పేటశ్రీ గారు..........

అతి స్వల్ప కాలంలో అందంగా ముద్రించి యిచ్చిన శారద ప్రింటర్స్ అధినేత శ్రీమతి చేకూరు ప్రభావతమ్మగారు..........

నా ప్రయత్నంలో సహకరించిన శ్రేయోభిలాషులు శ్రీయుతులు చక్రపాణిరావుగారు, ఎస్. విజయకుమార్, శతావధాని మేడసాని మోహన్, చేకూరు కృష్ణారెడ్డిగారు, శ్రీరామచంద్రరాజు గారు, డా॥ వి.ఎస్. దీప్ కుమార్, డా॥ ఎల్. రామమూర్తి గార్లు .........

అందరికీ కృతజ్ఞతలు.

సి. గోవిందరాజు

తిరుపతి

విజయ దశమి

1985

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | వసంతోత్సవం | 1 |
| 2. | కోడై తిరునాళ్ | 10 |
| 3. | బ్రహ్మోత్సవం | 17 |
| 4. | రథోత్సవం | 42 |
| 5. | డోలోత్సవం | 58 |
| 6. | కల్యాణోత్సవం | 65 |
| 7. | ధనుర్మాసోత్సవం | 80 |
| 8. | పుష్పయాగోత్సవం | 92 |

# వసంతోత్సవం

— ✲✲ —

## వసంత ఋతు ప్రాధాన్యం:

"ఋతునాం కుసుమాకరః" ఋతువులలో మొదటిది వసంత ఋతువు. దీన్ని ఋతురాజం అంటారు. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు అర్జునునకు విభూతి యోగంలో తన విభూతులను తెలియజేస్తూ సర్వత్రా తానున్నానని చెప్తూ ఋతువులలో తాను వసంత ఋతువును అని స్పష్టం చేశాడు. ఆ కారణం చేతనే అన్ని ఋతువులకంటేగూడ వసంత ఋతువు అతి ఆహ్లాదకరంగా, సౌందర్యవంతంగా భగవంతుని ముగ్ధమనోహర రూపంగా ప్రకాశిస్తుంది.

కేవలం అధ్యాత్మిక దృష్టితో కాకుండా లౌకిక దృష్టితో పరిశీలించినప్పుడుకూడా వసంత ఋతువు శ్రేష్ఠమని చెప్పవచ్చు. జీవితంలో యౌవనంలా సంవత్సరకాలంలో వసంత ఋతువు మరపురానిది, మధురమైనది.

సామాన్యమానవాళి దృష్టితో చూచినప్పుడు ఈ ఋతువులో ఎండ ఎక్కువలేదు, చలి అంతకంటె ఉండదు. కనుక సమశీతోష్ణదృష్ట్యా ఇది మానవాళికి హర్షదాయిని. కృషీవలుని కోణంలో చూచినపుడు వ్యవసాయ పనులకు ఆటవిడుపు కాలం వసంత సమయం. ఈ వసంత ఋతువులో ఇంటా బయటా, ఆలయాల్లో అనువైన స్థలాలలో ఎన్నో సంబరాలు సాగుతుంటాయి.

ఆలయాలలో జరిగే ఉత్సవాలలో వసంతోత్సవం పేర్కొనదగింది.

## ఆగమ గ్రంథాలలో వసంతోత్సవం:

ఆగమ గ్రంథాలయిన ఈశ్వరసంహిత క్రియాధికారం, మొదలయిన వాటిల్లో వసంతోత్సవానికి సంబంధించిన వివరాలున్నాయి ఈ ఉత్సవం మధు

మాసంలో షష్ఠమిరోజు చేయాలని నిర్దేశం ఈ ఉత్సవం 1,3,5,7,9 రోజులకూడ చేయవచ్చు.

నారాయణ సంహిత [44-1-2] బ్రహ్మ సంహిత [30-1-2]లో సమరాధి దేవతను [వరుణుడు] ఈ ఋతుకాలంలో రంగుల నీళ్లతో అర్చిస్తారని నిర్దేశింపబడింది.

తిరుమలలో వసంతోత్సవం చాలాకాలం నుండి నిర్వహింపబడుతుండేది అనడానికి ప్రధానంగా రెండు ఆధారాలు కనిపిస్తాయి.

1. శాసనాధారాం;
2. అన్నమయ్య సంకీర్తనాధారం

శా స నా ధా రా లు:

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధిపత్యంలో ఉన్న దేవాలయాల గోడలపై ఎన్నో శాసనాలు చెక్కబడినాయి. వానిలో అధికంగా తమిళంలోను, కొన్ని కన్నడంలో, కొన్ని తెలుగు, సంస్కృతం, హిందీలలో కనిపిస్తున్నాయి. ఇందు వసంతోత్సవానికి సంబంధించి కొన్ని శాసనాలు వున్నాయి. వీటిని రెండు దశలుగా వర్గీకరించవచ్చును.

ప్రథమ దశ: [1424 కు పూర్వం]

ఈ దశలో వసంతోత్సవ ప్రశంసవున్న శాసనం ఒకటి కన్పిస్తుంది మొదటి సంపుటంలోని ఎరమంచి పెరియమ్మ నాయకర్ 112 నెం. శాసనం ఈ శాసనం తిరుమల ఆలయంలో పడికావలి గోపురానికి ముందటి భాగంలో ఎడమ చేతివైపున చెక్కబడివుంది. ఇది క్రీ.పూ. 1360 సంవత్సరం నాటిదని టి.కె.టి. వీరరాఘవాచార్యులవారు తిరుపతి చరిత్రలో పేర్కొన్నారు. ఎరమంచి పెరియమ్మ నాయకర్ వసంతోత్సవానికి హాజరై 32 ఆవులను 1 కోడెను, ఒక నందవిళక్కుకు బహూకరించాడు. వీటినుండి లభించే నెయ్యిని నిరంతరం దీపానికి ఉపయోగించాలని కూడా పేర్కొన్నాడు.

ద్వితీయ దశ: 1504—1561:

ఈ దశలో వసంతోత్సవ ప్రశంస పున్న శాసనాలు ఎనిదిమి కన్పిస్తాయి.

1511వ సంవత్సరం అప్పపిళ్లై శాసనం. ఇతడు 5 రోజులు వసంతోత్సవానికి 5 పడి వ్యవస్థ కల్పించాడు.

1530 సంవత్సరం తాళ్ళపాక తిరుమలయ్యంగార్, 1537 సంవత్సరం అదైప్ప విశ్వనాథ నాయకర్, 1537 సంవత్సరం అదైప్ప బైయప్ప నాయకర్ అయిదు రోజులు జరిగే వసంతోత్సవానికి 5 పడి వ్యవస్థ కల్పించారు.

1547 సంవత్సరం తిమ్మరాజు శాసనం సంవత్సరానికి మూడు గ్రామాల నుండి 200రేకై బంగారు నాణాలను వసూలు చేయాలి. ఈ ధనాన్ని మాశి నెలలో విశాఖ నక్షత్రంలో ప్రారంభమై శ్రావణ నక్షత్రంతో అంతమయ్యే ఏడు రోజుల వసంతోత్సవానికి నైవేద్య వ్యవస్థ కల్పించాలి, అని శాసించాడు.

1540 సంవత్సరం తిమ్మరాసయ్యర్, 1541 వీరప్పణ్ణగల్ అయిదు రోజుల దమనారోహన వసంతోత్సవానికి అయిదు పడి వ్యవస్థ చేశారు.

1561 సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర అరవీడు బుక్కరాజు శ్రీరంగ రాజు కుమారుడు తిరుమలయ్యరాజా శాసనం. ఇతడు అయిదు రోజుల వసంతోత్సవానికి అయిదు అతిరసపడి వ్యవస్థ చేశాడు. అయిదు రోజుల దమనారోహన వసంతోత్సవానికి అయిదు అతిరసపడి వ్యవస్థ కల్పించాడు.

పై శాసనాలవల్ల తెలిసే విషయాలు :

మొదటిది వసంతోత్సవం 1360 ప్రాంతం నుండి ప్రసిద్ధం. రెండవది ఈ ఉత్సవం అయిదు రోజులు, ఏడు రోజులు జరుపబడుతుండెడిది. మూడవది వసంతోత్సవం బ్రహ్మోత్సవంలో భాగంగాను, కోదై తిరునాళకు అనుసంధానంగా జరుపబడేదని ఈ ఉత్సవంలో చందనానికి ప్రత్యేకత వుందని తెలుస్తుంది. నాల్గవది వసంతోత్సవం దమనారోహనోత్సవమని పిలువబడేది. అయిదవది 1561 ప్రాంతం నుండి వసంతోత్సవం, దమనారోహనోత్సవం అవి రెండుగా విడిపోయినట్లు వ్యక్తమవుతుంది.

అన్నమయ్య సంకీర్తనలలో వసంతోత్సవ ప్రశంస :

ఆంధ్ర వాగ్గేయకారులలో తాళ్లపాక అన్నమయ్య ప్రసిద్ధుడు. ఇతడు

1424....1503 ప్రాంతం వాడు. కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో జన్మించాడు. ఇతడు రోజుకు ఒక కీర్తన వంతున 32వేల కీర్తనలు వ్రాసిన పదకవితా పితమహుడు. అన్నమయ్య కీర్తనలో ఆంధ్రదేశపు ఆచార వ్యవహారాలు, వేంకటేశ్వరస్వామివారి సర్వవిషయాలు సాక్షాత్కరిస్తాయి.

అన్నమయ్య సంకీర్తనలలో వసంతాలకు సంబంధించినవి చాలా వున్నాయి. మచ్చునకు కొన్ని

చలము చల్లి తేజాలు సరుగ బన్నీటను
చలువగా వసంతము చల్లవయ్య (29-512)
వసంతములాడవచ్చి వడిదానె తొప్పదోగే
వసివాడితానె తలవంచనేలే (17-462)

కేవలము వసంతోత్సవానికి సంబంధించినవి ఆరు కన్పిస్తాయి.

1. వరుసతో సాసముఖావసంత పూర్ణిమనేడు
సిరుల యీ విభవాలు సేవించవో [13-445]

2. వనితకు బతికిదెవసంతము
దినదినము నమరె తిరుపులమీద [26-49]

3. మేలే చెలియా మేలుగాలమిది
తాలిమిలేదిదె పతివోనాకు [26-228]

4. వేడుక వసంతము వేళ నిదే
వాడల వాడల వెంట వనితలాడేరు [25-349]

5. అల్ల దానే రమణి ఆయత్తమై వున్నది
పెల్లుగజాజరాడ బిలచీ బోవయ్యా [17-172]

6. ఆడవయ్య సరిగా నీవాపెతో వసంతము
వేడుక నవ్వులలోని వెన్నెల వసంతము [24-389]

పై కీర్తనలవల్ల అన్నమయ్య స్పష్టం చేయదలచుకున్న విషయాలు నాలుగు. వసంతోత్సవ ప్రదేశ నిర్ణయం, వసంతోత్సవ కాలావధి నిర్ణయం,

వసంతోత్సవంలో కోలాటాలు, వసంతోత్సవ రకాలు.

1. వసంతోత్సవ ప్రదేశ నిర్ణయం:

లలితపు గోవిందుడు లక్ష్మి మండపమందున్న
వలరాజదివో కొలువగ వచ్చెను [13-445]

అనే వాక్యాలను బట్టి ఈ ఉత్సవం లక్ష్మి మండపంలో నిర్వహింప బడేదని తెలుస్తుంది.

కుప్పెలు జల్లు లాడేరు కోనేటి కాడ
నవ్వుతా వేటు లాడేరు నడిమి చింతాడ
సందడి సమరతుల సంపెంగ కాడ [26-49]

అనే వాక్యాలను బట్టి వసంతోత్సవ ఊరేగింపులలో స్వామివారికి మజిలీలుండేవని అక్కడ రకరకాల నివేదనలు జరిగేవని తెలుస్తున్నాయి.

వసంతోత్సవ కాలావధి నిర్ణయం:

ఉత్సవ కాలమంటే ఋతు, మాస, పక్ష, తిథి, నక్షత్ర నిర్దేశాలలో జరుపబడ వలసిన రోజులను, సంఖ్యలను చెప్పడం కాలావధి.

వరుసతో సానముఖావసంత పూర్ణిమనేడు
సిరులు యీ విభవాలు సేవించరో [13-445]
వెన్నెలగాసీ వెలదినేడిపుడు
పున్నమచంద్రుడు పొడచెనదే [26-226]

అనే పంక్తులను బట్టి ఇది రాత్రి ఉత్సవంకూడ కావచ్చునని ఊహించ డానికి వీలుంది.

వసంతోత్సవంలో కోలాటాలు:

సాధారణంగా స్వామి ఊరేగింపులలో మంగళ వాద్యఘోషలు, ద్రావిడ ప్రబంధ పారాయణం, వేద పఠనం మొదలైనవి మామూలుగా

వుంటాయి. కాని వసంతోత్సవంలో వీటి ప్రస్తావన అన్నమయ్య స్పష్టంగా చెప్పలేదు. కాకపోతే ఊరేగింపు ముందు వాడవాడల వనితల కోలాటాన్ని అభినివేశంతో వర్ణించాడు.

వేడుక వసంతము వేళనిదే
వాడల వాడల వెంట వనితలాడేరు ॥ పల్లవి ॥

కేలుగేలు జట్టిపట్టి కెందామర మోములెత్తి
కోలగోల దాక జేసి గుంపు వాయక
చాలుకొని యిద్దరేసి జంటలై సతులుగూడి
వోలివేరొకతె కోలనొడ్డుతానాడేరు ॥వేడు॥

పాలిండ్లు గదలగ బరువైన తురుముల
చీలుచు సోలుచు, గొంతవెనుకకును
మేలిమి పిలుదులతో మెరయుచు మురియుచు
కోలల బెడమరలి కోలాటమాడేరు ॥ వేడు ॥

కదిశొందురు మోములు కన్నుల దేలించి చూచి
పదతాళగతులకు పడతులెల్లా
అదివో శ్రీవేంకటేశుడలమేలు మంగతో
ముదిమంది చూడగాను ముందటనాడేడు ॥ వేడు ॥ 25-349

పై చరణాలను బట్టి వూరేగింపు అనంతరం స్వామి మండపం చేరు కొన్న తర్వాత నృత్యగీత వినోద వాద్యాలతో ఈ ఉత్సవం సంబరంగా ముగిసేదని తెలుస్తుంది.

వసంతాలాటల రకాలు:

అన్నమయ్య తన వసంతోత్సవం సంకీర్తనలలో కలువ వసంతం. గంధము వసంతం, మంచినీళ్ల వసంతం, కప్పుర వసంతం, బంగారు వసంతం, కెందామర వసంతం, ముత్యాల వసంతం, [17-172] వలపుల వసంతం, కొమ్మల వసంతం, సిగ్గుల వసంతం, గుబ్బచన్నుల వసంతం,

రతుల వసంతం, నెయ్యాప వసంతం, [24-389], పుప్పొడి వసంతం, జవ్వాది వసంతం, పువ్వుల వసంతం, [26-49], మొదలైన రకాల వసంతాలను వర్ణించాడు.

వనితకు బతికిదె వసంతము
దినదినము నమరె తిరుమలమీద [26-49]

అను పంక్తుల్నిబట్టి శ్రీస్వామివారికి జరిగే ప్రతిపూజ వసంతోత్సవంగా అన్నమయ్య భావించాడు.

## సంగీత విశేషాలు:

అన్నమయ్య తన వసంతోత్సవ సంకీర్తనలకు హిందోళం, రామక్రియ, వరాళి, వసంతం, లలిత, రాగాల నిర్దేశముంది.

ఈ కీర్తనలన్నింటిలోను 'వసంతం' అనే మాట ఆవృత్తి అవుతుంది. అయితే ఆ ఆవృత్తి అనేకరాగాలుగా వున్నాయి.

వసంతం అనే మాట పల్లవి రెండుపాదాల అంతంలోనూ, చరణం రెండు, నాలుగు పాదాంతంలోనూ ఆవృత్తి అవుతుంది.

'ఆడవయ్య సరిగానీవావెతో వసంతం
వేడుక నవ్వులలోని వెన్నెల వసంతం' [24-389]
'యెడయక నీమది నింతికొనచూపుల
వడజల్లీ వలపుల వసంతం'
'వుడుకు జెమటలనేవూర్చికొనగోర జిమ్మ
కొడిసాగ బుట్టిట కొమ్ముల వసంతం' [24-389]

2. వసంతం అనే మాట [17-17 ] పల్లవిలో లేదు. మొదటి చరణంలో మూడు పాదాల అంతంలోను, మూడవ చరణంలో 1,2 పాదాంతంలోను ఆవృత్తి అవుతుంది.

వనితల చూపులు కలువల వసంతము
ఘనమైన మోహము గంధము వసంతము
మనసులో కోరికలు మంచినీళ్ల వసంతము
పెనగి జాజరలాడ బిలచీనయ్యా [17-172]
కేలువట్టి తీసినదె కెందామర వసంతము
చాలుబులకలు ముత్యాలు వసంతము
యీలాగుల శ్రీ వేంకటేశ అలు గూడితివి
పేలరియై జాజరలాడ బిలచీబోవయ్యా [17-172]

3. పల్లవి మొదటి పాదాంతంలో మిగిలిన మూడు చరణాలలో ఒకటి రెండు పాదాల మధ్యలో వసంతం ఆవృత్తి అవుతుంది.

వనితకు బతికిదె వసంతము
దినదినము నమరె తిరుమలమీద [26-49]
జవ్వాది వసంతము చతురుడుగై కొనె
పువ్వుల వసంతము పొలతికిచె
రవ్వగా బండ్లపై రాసులు వోసుక
నవ్వుతావేటులాడేరు నడిమిచింతాడ. [26-49]

## తిరుమలలో నేటి వసంతం:

వసంతోత్సవం చైత్ర మాసంలో శుద్ధ త్రయోదశి, చతుర్దశి పూర్ణిమ రోజుల్లో సంవత్సరానికి ఒక్కసారి జరుగుతుంది.

మొదటిరోజున స్వామికి ఉదయారాధన, మధ్యాహ్నారాధన, పూర్తి చేస్తారు. అటుపై శ్రీ మలయప్పస్వామివారు భూదేవులతో బంగారు తిరుచ్చిని అధిష్టిస్తారు. తిరువీధుల ఉత్సవంలో పూరేగుతూ ఆలయానికి పశ్చిమ భాగాన వున్న వసంత మండపం చేరతారు. అచ్చట ఆరాధన, అభిషేకం, అలంకారం జరుగుతాయి. సాయంత్రం ఆస్థానం జరిగి ఉత్సవంతో శ్రీవారు సన్నిధానానికి వేంచేస్తారు.

రెండవరోజు ఉదయాన మలయప్పస్వామికి, భూదేవికి ఆరాధన చేస్తారు. ఆపై వెండి రథోత్సవం పూర్తఅయి వసంత మండపం ప్రవేశిస్తారు. అచ్చట మొదటిరోజులాగే ఆరాధన అభిషేకం అలంకారం జరిగి ఉత్సవంతో సన్నిధానం చేరుతారు.

మూడవరోజు మలయప్పస్వామి భూదేవి, సీతారాములు, రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణ, ఆంజనేయస్వామివారు వేరువేరు తిరుచ్చులు అధిష్టిస్తారు. తిరువీధులవెంట ఉత్సవంతో వసంత మండపం ప్రవేశించి, అచ్చట మొదట రెండురోజులులాగే అన్నీ నిర్వహింపబడి సమస్త భక్తజన పరివారంతో శ్రీవారి సన్నిధానం ప్రవేశిస్తారు.

# కోడై తిరునాళ్

— ✳✳ —

భారతదేశంలో వెలసిన పుణ్యక్షేత్రాలలో తిరుపతి క్షేత్రానికి సాటిలేని ప్రసిద్ధిఉంది. ఆ ప్రసిద్ధికి ప్రధానంగా నాలుగు కారణాలు కన్పిస్తాయి. మొదటిది అన్నిమతాలవారు (శైవులు, వైష్ణవులు, కాపాలికులు, శాక్తేయులు, జైనులు, బౌద్ధులు మొదలైనవారు) తమ తమ ఆరాధ్యమూర్తిగా భావించడం, రెండవది ఇది కలియుగ వైకుంఠం కావడం. మూడవది స్వామివారికి పూజా నైవేద్యాలు ఆగమోక్తంగా జరపడం. నాల్గవది హిందూదేశంలో ఏ దేవాలయానికి లేని వ్యవస్థ ఈ దేవాలయ పాలనలో కనిపించడం.

హిందూ దేవాలయాలలో జరిగే ఉత్సవాలు అనేక రకాలుగాఉంటాయి. కొన్ని నిత్యోత్సవాలు అంటే ఉదయం మొదలు పవళింపుదాకా సాగేది. ఉదాహరణకు సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన, పవళింపు సేవ మొదలైనవి. కొన్ని వారోత్సవాలు, నిర్దిష్ట దినాలలో మాత్రం నిర్వర్తించబడే ఉత్సవాలు. బుధవారం సహస్ర కలశాభిషేకం, గురువారం రాత్రి పూలంగి, శుక్రవారం అభిషేకం (తిరుమంజనం). కొన్ని మాసోత్సవాలు, కొన్ని మాసాలలో మాత్రమే జరిగేవి. మార్గళి నెలలోని ధనుర్మాసపూజ, కొన్ని సంవత్సరోత్సవాలు. ఒక సంవత్సరానికి ఒక్కసారే జరిగే ఉత్సవాలు. వసంతోత్సవం, అణ్ణాడుంజల్ తిరునాళ్ మొదలైనవి. కొన్ని సకృత్తుగా జరిగేవి. జీర్ణ ఆలయ లేదా మంటప లేదా గోపుర నిర్మాణం చేయవలసి వచ్చినప్పుడు జరిపే ఉత్సవాలు. ఆనందనిలయ గోపుర పునర్నిర్మాణం, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ ఇటువంటి ఉత్సవాలన్నీ అన్ని హంగులున్న దేవాలయాలలోనే కన్పిస్తాయి. ఆచరింప బడతాయి. కాని సువ్యవస్థమైన దేవాలయాలలో కూడ కారణాంతరాలవల్ల కొన్ని ఉత్సవాలు మరుగున పడిపోవచ్చు. కొన్ని కాలక్రమేణ పునరుద్ధరింపబడవచ్చు. కొన్ని క్రొత్తవి

చేరనూవచ్చు. తిరుమలలో జరిగే ఉత్సవాలలో పుష్పయాగానికి ఒకప్పుడు ప్రచారం ఉండేది. కాని కొంతకాలం మరుగుపడింది. 1980 సంవత్సరంలో పునరుద్ధరింపబడింది. అలాగే కోడై తిరునాళ్.

" కోడై " అంటే తమిళంలో వేసవికాలం. "తిరునాళ్" అంటే పవిత్రమయిన మంగళకరమయిన దినం. వేసవి కాలంలో స్వామి వారికి జరిగే ఉత్సవమని అర్థం. ఈ ఉత్సవం ఒకప్పుడు ప్రసిద్ధమైనట్లు రెండు ఆధారాలవల్ల తెలుస్తున్నది.

మొదటిది శాసనాధారం

రెండవది అన్నమయ్య సంకీర్తనలు.

శాసనాధారాలు:

తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యంలో ఉన్న దేవాలయాలలో ఎన్నో శాసనాలు గోడలపై చెక్కబడివున్నాయి. వానిలో ఎక్కువ భాగం తమిళంలోను, కొన్ని కన్నడం, కొన్ని తెలుగులోను కన్పిస్తున్నాయి. కోడై తిరునాళ్ ప్రస్తావన ఉన్న శాసనాలను మూడు దశలుగా వర్గీకరింపవచ్చును.

ప్రథమ దశ [1424కు పూర్వం] :

కోడై తిరునాళ్ ప్రశంస ఉన్న మొదటి శాసనం ఒకటి 1240లో కన్పిస్తుంది. ఆ శాసనం తిరుమల దేవాలయంలో ముక్కోటి ప్రదక్షిణం చేసే పడమటి గోడపై ఉంది. పేరు తెలియని రాజు తన 17వ సంవత్సరపు పరిపాలనా కాలంలో 400 పణాల శాశ్వత నిధిని కోడై తిరునాళ్ ఉత్సవ నిర్వాహణానికిగాను శ్రీ స్వామి భాండారానికి సమర్పించినట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది. ఈ ఉత్సవం ఎప్పుడు ఎన్నిరోజులు జరుపబడేదో ఆ శాసనంలో సూచింప బడలేదు. అయితే ఈ శాసనం క్రీ. శ. 1240కి ముందు కాలం నాటిదని టి.కె.టి. వీరరాఘవా చార్యవారు భావించారు.

ద్వితీయ దశ [1424—1503] :

ఈ రెండవదశ కాలంలో కోడై తిరునాళ్ ప్రశంస నాల్గు శాసనాలలో కన్పిస్తాయి

మొదటిది సాళువ నరసింహరాజ వడయార్ 1468సంవత్సర శాసనం. ఇతడు మురుక్కమ్పట్టు గ్రామాన్ని ద్వాదశి పర్వదినంలో సమర్పించాడు. స్వామికి అక్కడే పుష్కరిణి మధ్యలో మంటపాన్ని నిర్మించాడు. శ్రీవారు మంటపానికి వేంచేసినప్పుడు తెప్పోత్సవానికి కోద్దై తిరునాళ్‌కు పై గ్రామాన్ని దానం చేసినట్లు ఈ శాసనం వల్ల స్పష్టమవుతుంది.

రెండవది సాళువ నరసింహరాజ వడయార్ 1473 సంవత్సర శాసనం. కోద్దై తిరునాళ్ పదవరోజు ఉత్సవంలో అన్నదానం కోసం ఒక నిధిని ఏర్పాటు చేసినట్లు ఈ శాసనంవల్ల విశద మవుతుంది.

మూడవది కుమార తాతయ్యంగారి 1493 సంవత్సర శాసనం. ఇతడు సొత్తై తిరుమల నంబి తిరువేంకటయ్యంగార్ కుమారుడు. శతమర్షణ గోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. తిరుపతి ఆచార్య పురుషులలో ప్రసిద్ధుడు. ఇతడు 20 రోజులు తిరుక్కొడై తిరునాళ్ కును, 64 అతిరసపడి నైవేద్య నిర్వహణకు కట్టడి చేశాడు.

నాల్గవది కందాడ రామానుజయ్యంగారి 1495 సంవత్సర శాసనం. తిరుమల తిరుపతులందు రామానుజ కూటానికి శ్రీవేంకటేశ్వరుని బంగారు ఖజానాగారానికి నిర్వాహకుడు. ఇతడు కోద్దై తిరునాళ్ కు 20 అప్పప్పడి నిధిని ఏర్పాటు చేశాడు.

తృతీయ దశ [1504—1562] :

ఈ దశలో కోద్దై తిరునాళ్ ప్రశంస కనిపించే శాసనాలలో సుప్రసిద్ధ మయినవి తొమ్మిది.

సాళువ నరసింహుని యొక్క సేనాధిపతి అద్దైప్పమ్ విశ్వనాథ నాయకర్ 1537 సంవత్సర శాసనంలో 20రోజుల కోద్దై తిరునాళ్‌కు 20అప్పప్పడి వ్యవస్థ కల్పించాడు.

లింగసాని, తిర్న వెంకట మాణిక్యం దేవాదాసీలు 1540 సంవత్సరం 20 పన్నీటి పాత్రలు, 20 బరువుగల శుద్ధి కర్పూరం, 20 రోజుల కోద్దై తిరునాళ్‌కు స్వామికి సమర్పించే వ్యవస్థ కల్పించారు.

1562 సంవత్సరం తిరుమలై నంబి కుమార తాతయ్యంగార్ కుమారుడు సొత్తై ఎట్టూరు తిరుమలై నంబి శ్రీనివాసయ్యంగార్ కోడై తిరునాళ్కు 20 అతిరసప్పడి నైవేద్య వ్యవస్థకు నియమనం చేశాడు.

బసవ నాయకుని కుమారులు పెరియ తిమ్మప్ప, చిన్నరామప్ప 1540 సం॥, అచ్యుత మహారాయ సేనాని దళవాయ్ తిమ్మరాసయ్యార్ 1540 సం॥, తిరుమలయ్య రాజా 1561 సం॥, లింగసాని మరియు తిరువేంకట మాణిక్యం 1545 సం॥ 20 రోజుల కోడై తిరునాళ్కు 20 అతిరసపడి నైవేద్య వ్యవస్థ కల్పించారు.

శాసన సంపుటి నాల్గు 179 శాసనంలో పేరు తెలియని భక్తుడు 1070 పణమ్ శాశ్వత నిధిని 20 రోజులకు 20 కుండల పానకానికి, 20 ఇడ్లి పడికి వ్యవస్థ కల్పించాడు.

శాసన సంపుటి నాల్గు 230 శాసనంలో మల్లప్పయ్యార్ తిరుమలలో మలయన్నిన్నాన్ అనే పూల తోటలో ఆసీనులైనప్పుడు 20 రోజుల కోడై తిరునాళ్కు 20 దోసపడి దానం చేశాడు.

ఇవేగాక అను సంధానం తిరువేంకటజియ్యార్ 1504 సం॥ (III-2) శాసనంలోను, కారైవెట్టి పులైయాళ్వారు కుమారుడు అప్పాపిళ్లై 1506 సం॥ (III-6) శాసనంలో కోడై తిరునాళ్ ప్రశంస స్పష్టమవుతుంది. అంధకాలం తీర్థర్ కుమారుడు ఎల్లప్పపిళ్లై 1543 సం॥ (V-8) శాసనంలోను, కరణీకం కామరాసప్పర్ 1558 సం॥ (V-161) శాసనంలో కూడ కోడై తిరునాళ్ ప్రశంస వెల్లడవుతుంది.

పై శాసనాలవల్ల మనకు తెలిసే విషయాలు:

మొదటిది. కోడై తిరునాళ్ తెప్పోత్సవంలో భాగంగా జరుపబడుతుండేది.

రెండవది. పుష్కరిణి మధ్యలో నున్న మంటపంలో కోడై తిరునాళ్ జరుప బడేది.

మూడవది :- మలైనిన్రాన్ తోటలోకూడ ఈ తిరునాళ్ నిర్వహింపబడుతుండేది.

నాల్గవది. కోడై తిరునాళ్ ఇరవై రోజుల కాలం జరుపబడే ఉత్సవం.

ఐదవది. స్వామివారు కోడై తిరునాళ్ జరిగే ప్రదేశానికి వేంచేసే మార్గంలో మజిలీలు ఉండేవని, ఆ మజిలీలలో స్వామివారికి ప్రత్యేక ఆరాధన లుండేవని తెలుస్తాయి.

## అన్నమయ్య సంకీర్తనలలో కోడై తిరునాళ్ ప్రశంస :-

ఆంధ్ర వాగ్గేయ కారులలో తాళ్ళపాక అన్నమయ్య ప్రసిద్ధుడు. ఇతడు 1424—1503 ప్రాంతంవాడు. కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో స్వామి నందకాంశంలో జన్మించినవాడు. రోజుకు ఒక సంకీర్తన వంతున 32 వేల కీర్తనలు వ్రాసిన పదకవితా పితామహుడు. ఆయన సంకీర్తనలు వేదాలు, పౌరాణిక వాదాలు, వరకవిత్వ వాణీ వీణా నాదాలు, సుజనాహ్లాదాలు, వీరశైవ సాహిత్యానికి దీటుగా వైష్ణవ సాహిత్యాన్ని సృష్టించిన ఘనత తాళ్ళపాక వారిదే. అన్నమయ్య సంకీర్తనలలో ఆంధ్ర దేశపు పరిస్థితి ఆచార వ్యవహారాలు స్వామి వారికి సంబంధించిన సర్వ విషయాలు సాక్షాత్కరిస్తాయి. అన్నమయ్య సంకీర్తనలలో కోడై తిరునాళ్‌కు సంబంధించిన కీర్తనలు రెండు కన్పిస్తాయి. మొదటది సంపుటం 20 కీర్తన 240 లోను. రెండవది సంపుటం 24 కీర్తన 281లోను ఉన్నాయి.

" శ్రీ వేంకటేశ్వరుడు శ్రీయలమేల్మంగ తోడ
కోవిదుడై విహరించీ కోడ తిరునాళ్ల" [20-240]

'' అప్పుడు వేంకటరాయ డలమేలుమంగ గూడి
కుప్పలుగా భోగించీ గోడ తిరునాళ్ల" [24-281]

అనే వాక్యాలు బట్టి ఈ కోడై తిరునాళ్లకు స్వామివారు దేవేరితో వేంచేయు వారని స్పష్టమవుతుంది.

'' వెల్లవిరిగా వీధుల వెన్నెలలు గాయగా
చల్లని పూవులవాన జడిమించగా'' [20- 40]

అనే వాక్యాలు బట్టి వేసవిలో వెన్నెల రాత్రులలో జరిగే ఉత్సవమని స్పష్టమవుతుంది.

" పూని విహరించి వచ్చి పొందుగా నుయ్యాలలూగి
కోనేటి దరి మెరసీ గోడ తిరణాళ్లు " [24-281]

అనే పాదాలు బట్టి కోనేటి సమీపంలో ఈ ఉత్సవం జరిగేదని తెలుస్తుంది. సాళువ నరసింహరాయలు కోనేటి మంటపానికి స్వామివారు వేంచేసినప్పుడు జరుపవలసిన పూజా విధానాలకు సంబంధించిన శాసనం ఇక్కడ స్మరించదగింది.

" వరుసతో విణ్ణాపణివారు తాళము లొత్తుచు
పొరిబొరి ద్రావిడాన బొగడగాను " [24-281]

అనే వాక్యాలుబట్టి కోడై తిరునాళ్ సందర్భంలో వైష్ణవ స్వాముల వారు నాలాయిర దివ్య ప్రబంధ పఠన పారాయణం చేసిరని స్పష్టమవుతున్నది.

" అడుగడుగుకు విడెలందు కొంటా సంకీర్తన
లెడయక భాగవతు లెచ్చి పాడగా " [24-281]

అనే వాక్యాలు బట్టి ఈ తిరునాళ్లప్పుడు భాగవతులు కూడా సంకీర్తనలు పాడేవారని తెలుస్తున్నది. బహుశ అన్నమయ్య తను వ్రాసిన కోడై తిరునాళ్ పాటలు పాడి స్వామిని మెప్పించే వాడేమో!

" ఆటల పాటల వాడు అందనే వినిపించగా
పాటించి యారగింపులు పై పై జేయగా
గాటముగ వీడెములు గంధములు నందుకొంటా
కోటి భోగాలు భోగించీ కోడ తిరునాళ్లు " [20-240]

అనే పాదాలు బట్టి నృత్త గీత వాద్యాలతో ఈ ఉత్సవం సంరంభంగా జరిగేదని స్పష్టమవుతుంది. లింగమసాని మొదలగు దేవదాసీలు కోడై తిరునాళ్కు ఒక దాన శాసనం చేయడం ఈ విధానానికి మరింత బలాన్ని సమకూర్తుంది.

" పాటించి యారగింపులు పై పై జేయగా " [20-240]

" పప్పులు నిడ్డెనలును పానకాన ఫలములు

అప్పటప్పటకి పై పై నారగింపుచు" [24-281]

అనే వాక్యాలు బట్టి స్వామివారికి జరిగే ఆరగింపు సేవ తెలుస్తున్నది. శాసనాలలో ఆయా రాజులు, లేదా సేనాధి పతులు, లేదా పరిచారిక వర్గం అతిరసప్పడి, అప్పప్పడి, పానకప్పడి మొదలయిన వాటికి వ్యవస్థలు కల్పించడం ఈ వాదానికి మరికొంత బలాన్ని ఇస్తున్నది. అదీగాక అన్నమయ్య ఎన్నో కీర్తనలలో [4-4, 6-22, 10-27, 12-14] కూడ స్వామికి సమర్పించే నైవేద్యాలను గూర్చి ఏకరువు పెట్టాడు. గొడుగులు బడగలతో, వింజామరలతో, పన్నీటి కప్రము శిరసుపై కులుకుతూవుంటే స్వామి వారు కోడై తిరునాళ్ సందర్భంలో కొలువు తీర్చేవారని అన్నమయ్య కీర్తనలను బట్టి స్పష్టమవుతున్నది.

సంగీత విశేషాలు:—

అన్నమయ్య కోడై తిరునాళ్ కీర్తనలు సామంతం, సాళంగనాట రాగాలలో వ్రాయబడ్డాయి. ఇంతవరకు వెలువడిన 30 సంపుటములలో 661 కీర్తనలు సామంతంలోనే పాడబడ్డాయి. 3 1 6 కీర్తనలు సాళంగనాటలో కీర్తింప బడ్డాయి.

అన్నమయ్య కోడై తిరునాళ్ సంకీర్తనలలో జానపద గేయ ధర్మాలు కన్పిస్తాయి. సాధారణంగా అన్నమయ్య సంకీర్తనలలో మూడు చరణాల పాటలు ఎక్కువగా ఉంటాయి. కాని "అప్పుడు వేంకటరాయ డలమేలు మంగ గూడి" [24-281] అనే కీర్తనలో మాత్రం ఆరు చరణాలున్నాయి.

ప్రతి చరణాంతంలో కోడ తిరునాళ్లు అనే మాట అవృత్తి అవుతుంది. సంగీత నృత్య విశేషాలను కీర్తనలలో ఉల్లేఖించడంవల్ల ఈ కీర్తన అన్నమయ్య కాలంనాడు నృత్యభంగిమతో ఆడేవారని, ప్రదర్శించేవారని ఊహించడానికి వీలుంది.

అన్నమయ్య కాలంలో సంబరంగా సాగిన ఉత్సవం " కోడై తిరునాళ్ " అని సారాంశం.

# బ్రహ్మోత్సవం

బ్రహ్మోత్సవం అనేపేరు ప్రచారం కావడానికి ప్రధానంగా నాల్గు కారణాలు కనిపిస్తున్నాయి.

1. బ్రహ్మదేవుడు మొట్టమొదటిసారిగా మహర్షి దేవగణంతో శ్రీనివాసునికి ఈ ఉత్సవాన్ని సంబరంగా నిర్వహించాడనడం.

2. నవబ్రహ్మలు నవాహ్నిక దీక్షతో తొమ్మిదిరోజులు జరుపబడే ఉత్సవం కావడం.

3. తిరుమలలో నెలకొన్న పరబ్రహ్మ స్వరూపుడయిన వేంకటేశ్వరునికి జరిగే ఉత్సవం కావడం.

4. తిరుమలలో జరిగే అనేక ఉత్సవాలలో గొప్పగా, వైభవంగా జరుపబడే ఉత్సవం కావడం.

తిరుమలలో బ్రహ్మోత్సవం చాలా కాలం నుండి వైభవంగా జరుగుతూ ఉందనడానికి మూడు ఆధారాలున్నాయి.

1. వాఙ్మయాధారం.

2. శాసనాధారం.

3. అన్నమయ్య సంకీర్తనలు.

## వాఙ్మయాధారం :

బ్రహ్మోత్సవ ప్రశంస సంస్కృత వాఙ్మయంలోని పారమాత్మకోపనిషత్తులోను; వరాహపురాణం, పద్మపురాణం, భవిష్యోత్తరపురాణంలోను; భారత భాగవతాలలోను; ఆగమిక ప్రకీర్ణాధికారంలోను ఉన్నది.

## శాసనాధారం :

తిరుమలలో వేంకటేశ్వర స్వామి, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ గోడలమీద బ్రహ్మోత్సవానికి సంబంధించిన శాసనాలున్నాయి. అయితే ఈ ఉత్సవాలకు సంబంధించిన శాసనాలన్నీ తమిళంలోనే ఉండడం గమనించదగ్గ అంశం.

గ్రంథాధారం బట్టి బ్రహ్మోత్సవ నిర్వహణ ఉపనిషత్తుకాలం నుండి ఉన్నప్పటికిని శాసనాలలో మాత్రం మనకు మొట్టమొదట క్రీ. శ. 966లో కనిపిస్తుంది. ఈ శాసన (1-8) దానకర్త సామవై. ఈవిడ శ్రీనివాసునికి వెండి ఉత్సవ విగ్రహం చేయించినట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది. ఈ నూతన ఉత్సవమూర్తిని ఊరేగించుటతోనే ఆ రోజులలో తిరుమల మీద ప్రధానోత్సవం జరిగేటట్లు ఆమె ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవమని పేరు పొందిన ఆ ప్రధానోత్సవం ఆ రోజులలో పురట్టాశి మాసంలో చిత్తానక్షత్రంతో ప్రారంభమై అంకురార్పణంతో కలిసి పది రోజులు పాటు జరుగుతుండినట్లు తెలుస్తుంది అప్పటినుండి బ్రహ్మోత్సవ ప్రశంస మనకు అక్కడి శాసనాలద్వారా వెల్లడౌతుంది. ఈ ఉత్సవ నిర్వహణలో క్రమంగా రాజపరివారం ఆలయ పరిచారకవర్గం. భక్తబృందం అభినివేశంతో భక్తి అనురక్తులతో భాగం పంచుకొని ఉత్సవ నిర్వహణకు సువ్యవస్థ చేసినట్లు స్పష్టమౌతుంది.

## రాజ పరివారం:

రాజులు, రాణులు, వారి అనుచర వర్గం మొదలైనవారు రాజపరివారంలో పరిగణింప దగినవారు. అయితే బ్రహ్మోత్సవ దానకర్తలు రాణులు రాజులు మాత్రమే.

క్రీ.శ 1464వ సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర మేదిని మిశ్రగండ కత్తారి సాళువ మల్లయదేవ మహారాజ శాసనం, ఇతడు దేవాలయ ప్రవేశ భాగంలో ఉన్న మంటపంలో తిరుక్కొడి తిరునాళ్‌లో ఉత్సవ విగ్రహానికి అప్పపడి వ్యవస్థ కల్పించాడు. మూడవరోజు ఉత్సవానికి ఒక అప్పపడి, నాల్గవరోజుకు ఒక అప్పపడి, ఏడవరోజుకు ఒక అప్పపడి వంతున ఏడు ఉత్సవాలకు ఇరవై ఎనిమిది, అప్పపడి నియమనం చేశాడు.

క్రీ శ. 1473వ సంవత్సరం శ్రీమాన్ మహా మండలేశ్వర మేదినీ మిశ్రగండ కత్తారి సాళువ నరసింహరాయ ఉడయార్ శాసనం. ఇతడు బ్రహ్మోత్సవాలకు సరఫరా చేయాల్సిన వస్తువులను నిర్దేశించాడు.

క్రీ. శ. 1476వ సంవత్సరం శ్రీశఠకోపదాసర్ నరసింహరాయ ముదలియార్ శాసనం. ఇతడు పంగుని, పురటాశి మాసాలలో జరిగే తిరుక్కొడి తిరునాళ్ ఉత్సవానికి రామానుజన్, రామచంద్రన్ పూలతోటలో మలైకునియన్నిన పెరుమాళ్‌కు రెండు అప్పపడి కట్టడిచేసాడు.

క్రీ.శ. 1490వ సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర కొమ్మరాజ ఉడయార్ కొడుకు సిరు తిమ్మరాజ ఉడయార్ శాసనం. ఇతడు ఏడు తిరుక్కొడి తిరునాళ్‌లో ప్రతి ఏడవ రోజు ఉత్సవానికి ఒక అప్పపడి చొప్పున వ్యవస్థ కల్పించాడు.

క్రీ.శ. 1493వ సంవత్సరం కొమ్మరాజ పెరియ తిమ్మరాజు ఉడయార్ భార్య పెరియ నరసమ్మన్ శాసనం. ఈమె తన సొంత ఖర్చులతో బాగుచేసిన ఆసందపిల్లై మంటపంలో తిరుక్కొడి తిరునాళ్ అన్ని ఆరవరోజు ఉత్సవాలకు ఒక సుగియన్ పడి, అన్ని ఏడవరోజు ఉత్సవాలకు ఒక అప్పపడి పంతున కట్టడిచేసింది.

క్రీ.శ. 1534వ సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర సాలకరాజ పెరియ తిరుమలయ్యదేవ మహారాణి పెరియ కొమ్మన్ శాసనం. ఈమె వరద నారాయణ పూలతోటలో నిర్మింపబడిన పూలతోట మంటపంలో మలైనిన్న పెరుమాళ్ ఆసీనులైయున్నపుడు తొమ్మిది బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజు ఉత్సవాలకు తొమ్మిది అతిరసప్పడి కట్టడి చేసింది.

క్రీ.శ. 1544వ సంవత్సరం పొట్టిరాజ కుమారుడు మట్ల వరదరాజ శాసనం. ఇతడు పది బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజు. ఉత్సవాలకు ఇరవై అప్పపడి నియమనం చేశాడు.

క్రీ.శ. 1546వ సంవత్సరం ఓబులయ్యన్ కుమార్తె నాగసాని శాసనం. ఈమె అచ్యుతరాయ మహారాయడు పంపగా వచ్చిన దేవాలయ నాట్యకత్తె. తిరుమలలో జరిగే పది బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజు పుత్సావాలకు పది అప్పపడి కట్టడి చేసింది.

క్రీ.శ. 1551వ సంవత్సరం వీరమరాజు తిమ్మయ్యన్ కుమారుడు రాయసం వేంకటాద్రి శాసనం. ఇతడు తిరుమల ప్రాంగణంలో వెలసిన అళగప్పిరనార్‌కు అంకురార్పణంతో ప్రారంభమై విడయాత్రితో ముగిసే ఆవణి బ్రహ్మోత్సవానికి పదకొండు అతిరసప్పడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1561వ సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర అరవీడు బుక్కరాజ రామరాజ శ్రీరంగరాజ కుమారుడు తిరుమలయ్యరాజా శాసనం. ఇతడు పద్నాలుగు రోజులు జరిగే పది బ్రహ్మోత్సవాలకు నూట నలభై అతి రసప్పడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1586వ సంత్సరం నరసయ్యర్ కుమారుడు అవసరం చెన్నపర్ శాసనం. ఇతడు ప్రతి సంవత్సరం వేంకటేశ్వరస్వామికి, దేవిరి అయిన అలర్‌మేల్‌మంగై నాచ్చియార్‌కు ఆడి బ్రహ్మోత్సవంలో ఉభయం ఏర్పాటు చెశాడు.

క్రీ.శ. 1606 వ సంవత్సరం బొక్కసం కృష్ణయ్యన్ తిరుమలరాజా శాసనం. ఇతడు పదకొండు బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజు ఉత్సవాలకు ఎనిమిది రేకై పొన్ కట్టడి చేశాడు.

క్రీ. శ. 1614వ సంవత్సరం నొట్టక్కార కుప్పయ్యన్ కుమారుడు. నొట్టక్కార వేంకటయ్యన్ శాసనం. ఇతడు తిరుమలలో జరిగే చిత్తిరై బ్రహ్మోత్సవ నైవేద్యానికి కట్టడి చేశాడు. నూటముప్పై రెండురోజులు కల్గిన పదకొండు బ్రహ్మోత్సవాలకు కట్టడి చేయాల్సిన వస్తువులను నిర్దే శించాడు.

## ఆలయ పరిచారిక వర్గం :

ఆలయ గణాధికార్లు, గురువులు, పూలతోట అధికార్లు. జియ్యర్లు మొద లైనవారు ఆలయ పరిచారిక వర్గం.

క్రీ. శ. 1491వ సంవత్సరం పపిండి వేంకటత్తురైవర్ అనే రామాను జయ్యర్ శాసనం. ఇతడు ఏడు తిరుక్కొడినాళ్‌లో ఏడవరోజు ఉభయానికి ఒక అప్పపడి చొప్పున ఏడు అప్పపడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1494 వ సంవత్సరం తిరుమల ఆలయ గణాధికారైన తిరు నిన్రఊర్ ఉడయాన్ అనంతప్పర్ నారాయణన్ శాసనం. ఇతడు తిరుమలలో జరిగే ఏడు తిరుక్కొడి తిరునాళ్లో ప్రతి ఏడవ రోజు ఉత్సవానికి ఒక అప్పడి చొప్పున ఏడు అప్పపడి మెట్టుపుడ తిరువీధిలో శ్రీకర్నన్ మంటపం ముందు మలైనిన్ర పెరుమాళ్‌కు నియమనం చేశాడు.

క్రీ.శ 1494వ సంవత్సరం తిరుమల ఆలయ గడాధికారైన తిరునిన్ర ఊర్ ఉడయాన్ మారు నయినార్ మరియు గోవిందన్ ఉమ్మడి శాసనం. వీరు ప్రతి తిరుక్కొడి తిరునాళ్ తొమ్మిదవ రోజు ఉత్సవంలో ఏడు అతి రసప్పడి కట్టడి చేశారు.

క్రీ.శ. 1497వ సంవత్సరం పిన్సెన్రవిల్లి పూలతోట అధికారి పెరియ పెరుమాళ్ శిష్యుడు పెరియ పెరుమాళ్ దాసర్ శాసనం. ఇతడు ఏడవరోజు ఉత్సవానికి ఒక అప్పపడి వంతున ఏడు తిరుక్కొడినాళ్లో అన్ని ఏడవ రోజు ఉత్సవాలకు నైవేద్య వ్యవస్థ కల్పించాడు.

క్రీ. శ. 1504వ సంవత్సరం తిరువేంకటనాథన్ తిరునందవనం అధికారి అనుసంధానం తిరువేంకట జియ్యర్ శాసనం. ఇతడు బ్రహ్మోత్సవంలో ఏడవరోజు ఉత్సవానికి ఒక అప్పపడి వంతున ఏడు బ్రహ్మోత్సవాలకు ఏడు అప్పపడి తిరువేంకటనాథన్ మంటపంలో నియమనం చేశాడు.

క్రీ.శ. 1530వ సంవత్సరం రామానుజ కూట వ్యవహర్త వేంక టేశుని బంగారు భాండాగారానికి అధికారైన కందాడ రామానుజయ్యంగారి శాసనం. ఇతడు తొమ్మిది అతిరసప్పడిని తొమ్మిది బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవరోజుకు వ్యవస్థ కల్పించాడు.

క్రీ.శ. 1539వ సంవత్సరం దేవాలయ ఆచార్యులలో ఒకరైన మలై నిన్రాం భట్టర్ కుమారుడు వేంకటత్తురైవర్ శాసనం. ఇతడు తిరుమలలో యాగశాల వద్ద కార్తె, తై, అని, బ్రహ్మోత్సవాలలో ఆరవరోజు ఉత్స వానికి మూడు దోసెప్పడి కట్టడి చేశాడు.

క్రీ శ. 1541వ సంవత్సరం పేరరుళాళన్ మఠం అధికారి అళగియ మనవాళ జియ్యర్ శిష్యుడు పెరియ కోయిల్ కెళ్వి జియ్యర్ శాసనం. ఇతడు ఆనిమాస బ్రహ్మోత్సవంలో ఆరవరోజు ఉత్సవానికి ఒక అప్పపడి, ఒక పలం చందనం, ఆయిదు వందలు వక్కలు, నూరు తమలపాకులు కట్టడి చేశాడు.

క్రీ శ. 1542వ సంవత్సరం వానమామలై జియ్యర్ శిష్యుడు కోయిల్ కెళ్వి జియ్యర్ శాసనం. ఇతడు ఒక సంవత్సర కాలంలో నిర్వహింపబడే పది బ్రహ్మోత్సవాలకు నలబై పణం నియమనం చేశాడు.

క్రీ.శ. 1583వ సంవత్సరం ఎట్టూరు తిరుమలై కుమార తాతాచార్యార్ అయ్యన్ శాసనం. ఇతడు తిరుమలలో నిర్వహింపబడే పన్నెండు రోజుల అర్పిశి బ్రహ్మోత్సవానికి నాల్గువందల పది రేకై పొన్ మరియు ఎనిమిదిన్నర పణం కట్టడి చేశాడు.

క్రీ. శ. 1594వ సంవత్సరం కోయిల్ కెళ్వి అణ్ణన్ రామానుజ జియ్యర్ శాసనం. ఇతడు సంవత్సరంలో నిర్వహింపబడే పది బ్రహ్మోత్సవాలకు కట్టడి చేయాల్సిన వస్తువులను నిర్దేశించాడు. బ్రహ్మోత్సవ కాల పరిమితి పదకొండు రోజులు.

## భక్త బృందం :

భక్తులు, వైష్ణవులు, నియోగులు, వ్యాపారస్థులు, వైశ్యులు, వాగ్గేయకారులు, పండితులు ఈ కోవలోకి వస్తారు.

క్రీ. శ. 1445 వ సంవత్సరం పెరియ పెరుమాళ్ దాసర్ అరుళాళనాదర్ దేవన్ శాసనం. ఇతడు తిరుమలలోని తిరువేంకటముడయాన్‌కు తీర్థవారి రోజుతో కలసి తొమ్మిది రోజుల తిరుక్కోడి తిరునాళ్‌కు ఒకఅప్పపడి, ఒక తిరుక్కణామదై కట్టడి చేశాడు.

క్రీ.శ. 1445వ సంవత్సరం రామానుజ దాసర్ కొడుకు అనంతశయనర్ శాసనం. ఇతడు ప్రతి అంకురార్పణానికి ఒక సుగియన్ పడి ప్రతి

తీర్థవారి రోజుకు ఒక తిరుక్కణామదై వంతున ఏడు తిరుక్కొడి తిరునాళ్‌కు కట్టడి చేశాడు.

క్రీ.శ. 1446వ సంవత్సరం వడమాలై దాసర్ అళగార్ అప్పిళ్లై అనే తిరువనందాళ్వార్ పెరియ పెరుమాళ్ శాసనం. ఇతడు మలైకునియ న్నిన పెరుమాళ్‌కు ఆడి ఉత్సవం మొదలు చిత్తిరై ఉత్సవం వరకు జరిగే ఏడు తిరుక్కొడినాల్‌కు ఒక తిరుప్పోనకం, ఒక తిరుక్కణామదై నైవేద్య వ్యవస్థ కల్పించాడు.

క్రీ.శ. 1488వ సంవత్సరం అన్నయార్య చక్రవర్తిగళ్ శ్రీరంగ రాజర్ అళగియ మనవాళ దాసర్ శాసనం. ఇతడు ఏడు తిరుక్కొడినాళ్ లో తిరువేంకట ముడయాన్‌కు అన్ని ఏడవరోజు ఉత్సవాలకు ఒక అప్పపడి చొప్పున నియమనం చేశాడు.

క్రీ.శ. 1491వ సంవత్సరం అరవణై ప్పెరుమాళదాసర్ ఇళయ పెరుమాళ్ అప్పయ్యన్ శాసనం. ఇతడు ఒక సంవత్సరంలో నిర్వహింపబడే ఏడు తిరుక్కొడినాళ్‌లో ప్రతి ఏడవరోజు ఉత్సవానికి మలై కునియన్నిన పెరుమాళ్ జండువాలి వీధిలో ఉన్న మంటపంలో ఆసీనులై యున్నప్పుడు ఒక అతిరసప్పడి వంతున ఏడు అతిరసప్పడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1494వ సంవత్సరం చంద్రగిరి నియోగులలో ఒకడైన కర ణిక్క అన్నదాత దేవగళ్ కుమారుడు తిమ్మణదణాయక్కర్ శాసనం. ఇతడు తిరువేంకట ముడయాన్‌కు ఏడవరోజు తిరుక్కొడి తిరునాళ్‌కు ఒక అప్పపడి వంతున ఏడు తిరుక్కొడినాళ్‌కు ఏడు అప్పపడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1504వ సంవత్సరం తిరువేంకటచ్చిరుక్కన్ తిరుప్పణి పిళ్లై ఎంబెరుమానార్ శాసనం. ఇతడు పన్నెండు రోజుల తిరుక్కొడి తిరునాళ్‌కు పన్నెండు అతిరసప్పడి ఏడవరోజు ఉత్సవానికి ఒక అతిరసప్పడి చొప్పున ఒక్క సంవత్సరంలో ఏడు తిరుక్కొడి తిరునాళ్‌కు తొంబైఒక్క అతిరస ప్పడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1506వ సంవత్సరం శ్రీవైష్ణవులలో ఒకడైన ఉద్దండ రాయర్ ఉలగప్పన్ శాసనం. ఇతడు దేవాలయ ప్రజాధికారి నుండి పూల

తోటలో ఉన్న మండపాన్ని తిరువేంకట ముదయాన్ కోసం కొన్నాడు. ఆ మంటపంలో నిర్వహింపబడే ప్రతి ఏడవరోజు ఉత్సవానికి ఒక అతిరస ప్పడి వంతున ఏడు తిరుక్కొడి తిరునాళ్‌కు ఏడు అతిరసప్పడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1507వ సంవత్సరం వ్యాపారస్థులలో ఒకడైన ఉడయార్ దేవుశెట్టి కుమారుడు తిప్పుశెట్టి శాసనం. ఇతడు ఏడు బ్రహ్మోత్సవాలలో ప్రతి ఏడవరోజు ఉత్సవానికి, పూలతోట మంటపంలో ఏడు అతిరసప్పడి. వసంత మంటపంలో ఏడు అతిరసప్పడి, వసంత మంటపంలో ఏడు అతి రసప్పడి నైవేద్య వ్యవస్థకు నియమనంచేశాడు.

క్రీ.శ. 1508వ సంవత్సరం తిరుపతి వైష్ణవులలో ఒకడైన ఉద్దండ రాయర్ ఉలగప్పన్ శాసనం. ఇతడు ఆనంతాళ్వార్ పేరుతో తీర్థవారి మంట పంలో ప్రతి తొమ్మిదివ రోజు ఉత్సవానికి ఏడు అతిరసప్పడి కట్టడి చేశాడు. ఈ విధంగా ఏడు బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేశాడు.

క్రీ.శ. 1508వ సంవత్సరం తిరుపతి వైష్ణవులైన నరసింహరాయ ముదలియర్ రామయ్యాన్ మరియు తమ్మయ్యాన్ శాసనం. వీరు తిరుమణి మంటపంలో జరిగే ఏడు తిరుక్కొడినాళ్‌లో అన్ని తొమ్మిదవరోజు ఉత్సవా లకు ఏడు అతిరసప్పడి కట్టడి చేశాడు. తిరుమలలో తిరునిన్ర ఉడయాన్‌కు జరిగే ఏడు ఉత్సవాలలో అన్ని మూడవ రోజులకు ఏడు తిరువోలక్కం నియమనం చేశాడు.

క్రీ. శ. 1508వ సంవత్సరం కోమట్లకు అధికారైన పచ్చైలింగు శెట్టి శాసనం. ఇతడు మలైకునియనిన్ర పూలతోటలో ఉన్న కోమటి మంట పంలో ఒక సంవత్సరంలో నిర్వహింపబడే ఏడు తిరుక్కొడినాళ్‌లో అన్ని ఏడవరోజు ఉత్సవాలకు ఏడు అప్పపడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1511వ సంవత్సరం కారవెట్టిప్పలై ఆళ్వార్ కుమారుడు అప్ప పిళ్ల శాసనం. ఇతడు చంపక తిరువాసల్ మంటపంలో మలైకునియనిన్ర పెరుమాళ్‌కు ఎనపై నాలుగు రోజులకు ఎనపై నాలుగు అతిరసప్పడి కట్టడి చేశాడు, ఒక తిరునాళ్‌కు పన్నెండు పడి వంతున ఏడు తిరుక్కొడినాళ్‌కు, ఏడవరోజు ఉత్సవానికి ఒక పడి వంతున ఏడు ఉత్సవాలకు నియమనం చేశాడు.

క్రీ. శ. 1530 వ సంవత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్ శాసనం. ఇతడు సంవత్సర కాలంలో మలైకునియ నిన్రనపెరుమాళ్‌కు నిర్వహింపబడే తొమ్మిది బ్రహ్మోత్సవాలకు నూట ఎనిమిది అతిరసప్పడి నియమనం చేశాడు. తొమ్మిది బ్రహ్మోత్సవాలలో శ్రీకృష్ణ స్వామికి తొమ్మిది అతిరసప్పడిని అన్ని అయిదవ రోజులకు కట్టడిచేశాడు. తొమ్మిది బ్రహ్మోత్సవాలలో తొమ్మిదిపడిని అన్ని ఏడవరోజు ఉత్సవాలకు ఏర్పాటు చేశాడు.

క్రీ. శ. 1535 వ సంవత్సరం సట్టైయప్ప నాయక్కర్ కొడుకు ఎల్లప్ప నాయక్కర్ శాసనం. ఇతడు తిరుమలలో తొమ్మిది బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజు ఉత్సవాలకు తొమ్మిది ఇడ్డిలిపడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1536 వ సంవత్సరం అంధకాలం తీర్థర్ కమారుడు ఎల్లప్ప పిళ్లై శాసనం. ఇతడు చిత్తిరి మాసంలో నిర్వహింపబడే పది బ్రహ్మోత్స వాలకు అందించాల్సిన వస్తువులను నిర్దేశించాడు.

క్రీ. శ. 1537 వ సంవత్సరం నాగమ నాయకర్ కుమారుడు అద్దైప్పం విశ్వనాథ నాయకర్ శాసనం. ఇతడు అంకురార్పణంతో ప్రారంభమై విద్యాట్రితో అంతమయ్యే పదమూడు రోజులకు పదమూడు అప్పపడి కట్టడి చేశాడు. ఈ విధంగా తొమ్మిది బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేశాడు.

క్రీ. శ. 1537 వ సంవత్సరం చిన్నప్పనాయకర్ కుమారుడు కృష్ణప్ప నాయకర్, శ్రీ రామయ్యంగార్ కుమారుడు బాచ్చరాసయ్యర్. భూతనాసిట్టు భట్టర్ కుమారుడు. రామాభట్టరయ్యన్. అంకురార్పణంతో ప్రారంభమై విద్యాట్రితో అంతమయ్యే పదమూడు రోజులకు పదమూడుఅప్పపడి చొప్పున తొమ్మిది బ్రహోత్సవాలకు కట్టడిచేశారు.

క్రీ. శ. 1537 వ సంవత్సరం తిమ్మణ ఉడయర్ కుమారుడు ఇమ్మడి ఎల్లప్ప ఉడయర్ శాసనం. ఇతడు ఆడి. అవణి, పురట్టాశి. అల్పిశి, కార్తికై తై, మాసి. పంగుని, చిత్తిరై మాసాలలో నిర్వహింపబడే ప్రతి పదమూడు రోజుల బ్రహ్మోత్సవాలకి పదమూడు అప్పపడి నైవేద్య నియమనం చేశాడు.

క్రీ. శ. 1537 వ సంవత్సరం సకలరాజ కుమారుడు సింగరాజ శాసనం. ఇతడు పదమూడు రోజులు జరిగే పది బ్రహ్మోత్సవాలకు పదమూడు అప్ప పడి ఏర్పాటు చేశాడు.

క్రీ. శ. 1538 వ సంవత్సరం తిమ్మప్ప నాయకర్ కుమారుడు అద్దైప్పం బైయప్ప నాయకర్ శాసనం. అంకురార్పణంతో ప్రారంభమై విద్యాట్రిరోజుతో అంతమయ్యే తొమ్మిది బ్రహ్మోత్సవాలలో ప్రతిబ్రహ్మోత్స వానికి పదమూడు అప్పపడి కల్పించాడు. ఆడి, ఆవణి, పురట్టాశి, అల్పిశి, కార్తికై, తై, మాసి, పంగుని, చిత్తిరై తొమ్మిది బ్రహ్మోత్సవాల్లోను అన్ని ఏడవరోజు ఉత్సవాలకు తొమ్మిది అతిరసప్పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1539 వ సంవత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళ పాకం పెరియ తిరుమలయ్యంగారి శాసనం. ఇతడు ఒక బ్రహోత్సవానికి పడితిరుపోనకం చొప్పున పది బ్రహోత్సవాలకి కట్టడిచేశాడు ఆనినెలలో శ్రావణ నక్షత్రంతో అంకురార్పణం ప్రారంభ మవుతుంది. మార్గశీర్ష నక్షత్రంలో విద్యాట్రిరోజుతో అంతమవుతుంది.

క్రీ. శ. 1539 వ సంవత్సరం అనంత పండితర్ కుమారుడు నాగక పండితర్ శాసనం. ఇతడు తిరుమలలో తిరుక్కోనేరివద్ద మంటపంలో ఆని నెలలో జరిగే పన్నెండు రోజుల ఉత్సవానికి పన్నెండు అప్పపడి, పన్నెండు పలం చందనం నైవేద్య వ్యవస్థ చేశాడు. ఈ ఉత్సవం క్రియాసంక్రమణంతో ప్రారంభమై విద్యాట్రిరోజుతో పూర్తౌతుంది.

క్రీ. శ. 1540 వ సంవత్సరం రామరాసయ్యర్ కుమారుడు నోట్టకారర్ నాగప్ప శాసనం. ఇతడు సంవత్సరంలో జరిగే పది బ్రహోత్సవాలలో అన్ని ఏడవరోజు ఉత్సవాలకు పది అతిరసప్పడి నియమనం చేశాడు.

క్రీ. శ. 1545 వ సంవత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళ పాక తిరుమలై అయ్యంగార్ శాసనం. ఇతడు ఆనినెలలో జరిగే పన్నెండు రోజుల బ్రహోత్సవాలకు పన్నెండు తిరుపోనకానికి అరు రేకై పొన్ మూడు పణం నియమనం చేశాడు.

క్రీ. శ. 1547 వ సంవత్సరం తాళ్ళపాక పెరియ తిరుమలయ్యంగారి కుమారుడు తాళ్ళపాక సిరుతిరుమలయ్యంగారి శాసనం. తాళ్ళపాక తిరు వేంకటయ్యన్ తిరుమలలో అయిదవరోజు శ్రీకృష్ణస్వామికి జరిగే బ్రహ్మోత్స వానికి ఒక సుగియన్‌పడి రెండువాళి వెన్న, ఆరుకుండల పానకానికి ఎని మిది రేకై పొన్ కట్టడిచేశాడు.

క్రీ. శ. 1558 వ సంవత్సరం కరణిక్కం కామరానప్పన్ కుమారుడు కరణిక్కం అప్పలయ్యన్ శాసనం. ఇతడు తిరుమలలో శ్రీమలై కునియ నిన్ర పెరుమాళ్ పూలతోట మంటపంలో ఆసీనులై యున్నప్పుడు పదకొండు బ్రహ్మోత్సవాలలో అన్ని ఏడవరోజులకు ఒకరేకై, నాలుగు పణం, పదకొండు కునుక్కుపడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1631 వ సంవత్సరం రామచంద్ర అయ్యన్ శాసనం. ఇతడు తిరుమల పురటాశి బ్రహ్మోత్సవం నాల్గవరోజుకు ఉభయం ఏర్పాటుచేశాడు.

## బ్రహ్మోత్సవాల సంఖ్య:-

తిరుమలకొండమీద జరిగే ఉత్సవాలలో రోజుల సంఖ్యలోగాని, వాహనాల సంఖ్యలోగాని, సంబరంగా జరుపబడే వాటిలోగాని బ్రహ్మోత్సవ మొక్కటే ప్రధానమైంది. ఈలాంటి బ్రహ్మోత్సవం సంవత్సరాని కొకసారి, అదికమాసం వచ్చే సంవత్సరంలో రెండుసార్లు జరుగుతాయి. కాని శాసనా లను పరిశీలిస్తే బ్రహ్మోత్సవాల సంఖ్యలో మార్పు క్రమంగా వచ్చినట్లు తెలుస్తుంది.

క్రీ. శ. 966 వ సంవత్సరం సామవై (1-8) శాసనం, క్రీ. శ. 1445 వ సంవత్సరం పెరియ పెరుమాళ్‌దాసర్ అరుళాళనాధర్ దేవణన్ (II-1) శాసనం. క్రీ శ. 1536 వ సంవత్సరం ఎల్లప్పపిళ్లై (IV-67) శాసనం క్రీ. శ. 1539 వ సంవత్సరం వేంకటత్తురైవర్ (IV-140) శాసనం. క్రీ.శ. 1541 వ సవంత్సరం పెరియకోయిల్ కెళ్వి ఎత్తిరాజ జియ్యర్ (IV-163) శాసనం. క్రీ. శ. 1545 వ సంవత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్ (V-4) శాసనం. క్రీ. శ. 1547 వ సంవత్సరం దేశాంతరై పేరరుళాళయ్యన్ (V-96) శాసనాలలో ఒక్క బ్రహ్మోత్సవ ప్రశంస కనిపిస్తుంది.

క్రీ. శ. 1476 వ సంవత్సరం శ్రీ శఠకోపదాసర్ నరసింహరాయ మొదలియర్ (II-68) శాసనం, క్రీ. శ. 1528 వ సంవత్సరం కుప్పయ్యన్ (III-179) శాసనాలలో రెండు బ్రహ్మోత్సవాల ప్రశంస ఉన్నట్లు కనపడు తున్నాయి.

క్రీ. శ. 1516 వ సంవత్సర దైవతాన్ అరసు (III-113) శాసనం, క్రీ. శ. 1539 వ సంవత్సరం వేంకటత్తురైవర్ (IV-138) శాసనాలలో మూడు బ్రహ్మోత్సవాలసంఖ్య అని తెలుస్తున్నాయి.

క్రీ. శ. 1445 వ సంవత్సరం అనంతశయనర్ (I-213) శాసనం కీ. శ. 1446 వ సంవత్సరం వడమామలైదాసర్ అళగార్ అప్పిళ్లై అనే తిరువనందాళ్వార్ పెరియ పెరుమాళ్ (I-215) శాసనం, క్రీ. శ. 1464 వ సంవత్సరం సాళువ మల్లయదేవ మహారాజ (II-18) శాసనం, క్రీ. శ. 1473 వ సంవత్సరం సాళువ నరసింహరాయ ఉడయర్ (II-50) శాసనం, క్రీ. శ. 1488 వ సంవత్సరం అన్నయార్య చక్రవర్తిగళ్ శ్రీ రంగరాజర్ అళగియ మణవాళదాసర్ (II-89) శాసనం, క్రీ. శ. 1490 వ సంవత్సరం సిరుతిమ్మరాజు ఉడయర్ (II-93) శాసనం, క్రీ శ. 1491 వ సంవత్సరం రామానుజయ్యన్ (II-95) శాసనం, అరవణై పెరుమాళ్ ఇళయ పెరుమాళ్ అప్పయ్యన్ (II—96) శాసనం, క్రీ. శ. 1494 వ సంవత్సరం తిమ్మణ దణాయక్కర్ (II-113) శాసనం, తిరువిన్నడుర్ ఉడయాన్ అనంతప్పన్ నారాయణ (II—114) శాసనం, పెరియ పెరుమాళ్ (II—123) శాసనం, క్రీ. 1540 వ సంవత్సరం తిరుప్పణిపిళ్లై ఎంపెరుమానార్ (II-138) శాసనాలలో ఏడు బ్రహ్మోత్సవాల సంఖ్య —

క్రీ. శ. 1530 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ (IV-3) శాసనం, అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్ (IV-6) శాసనం, క్రీ. శ. 1534 వ సంవత్సరం పెరియ తిరుమలయ్యదేవ మహారాజ రాణి పెరియ కొమ్మన్ (IV-31) శాసనం, 1535 వ సంవత్సరం ఎల్లప్పనాయకర్ (IV-38) శాసనం, క్రీ. శ. 1537 వ సంవత్సరం అద్దైప్పం విశ్వనాథనాయకర్ (IV-81) శాసనం, కృష్ణప్ప నాయకర్ (IV-82) శాసనం, బాచ్చరాసయ్యన్ (IV-83) శాసనం, రామభట్టరయ్యన్ (IV-84) శాసనం, ఇమ్మడి ఎల్లప్ప ఉడయర్ (IV-86) శాసనం,

క్రీ. శ. 1538 వ సంవత్సరం అడైప్పమలైయప్ప నాయకర్ (IV-110) శాసనాలలో తొమ్మిది బ్రహ్మోత్సవాల సంఖ్య—

క్రీ. శ. 1537 వ సంవత్సరం సింగరాజ (IV-88) శాసనం, క్రీ. శ. 1539 వ సంవత్సరం పెరియ తిరుమలయ్యంగారి (IV-129) శాసనం, క్రీ. శ. 1540 వ సంవత్సరం నోట్టకారర్ (V-2) శాసనం, క్రీ.శ. 1544వ సంవత్సరం మట్ల వరదరాజ (V-11) శాసనం, మూర్తినాయకర్ (V-19) శాసనం, క్రీ. శ. 1545 సంవత్సరం నాగసాని (V-46) శాసనం, క్రీ. శ. 1561వ సంవత్సరం తిరుమలయ్యరాజా (V-168) శాసనం, క్రీ.శ. 1594వ సంవత్సరం కోయిల్ కెళ్వి అణ్ణన్ రామానుజయ్యర్ (VI-10) శాసనాలలో పది బ్రహ్మోత్సవాల సంఖ్య —

క్రీ.శ. 1558 సంవత్సరం కరణీకం అప్పలయ్యర్ (V-161) శాసనం క్రీ.శ. 1606వ సంవత్సరం బొక్కసం కృష్ణయ్యన్ (VI-18) శాసనాలలో పదకొండు బ్రహ్మోత్సవాల సంఖ్య అనేది వెల్లడౌతుంది.

తిరుమలలో సంవత్సరానికి ఏ ఒక్క నెలలోనో తప్ప మిగిలిన పదకొండు మాసాలలో బ్రహ్మోత్సవాలు జరుగు తుండెడివని తేటతెల్లమౌతుంది.

## బ్రహ్మోత్సవాలు జరిగే రోజులు:—

కొండమీద జరిగే కొన్ని ఉత్సవాలు ఒకరోజే జరుగుతాయి. రథసప్తమి లాంటివి. కొన్ని మూడురోజులు జరుగుతాయి. వసంతోత్సం లాంటివి. కాని బ్రహ్మోత్సవ కాలం పదిరోజులు. అయితే శాసనాలలో రోజులసంఖ్యలో మార్పు కనపడుతున్నది.

క్రీ. శ. 1445 వ సంవత్సరం పెరియ పెరుమాళదాసర్ అరుళాళనాథర్ దేవణన్ (II-1) శాసనంలో బ్రహ్మోత్సవ దినసంఖ్య తొమ్మిదని; క్రీ.శ. 966 వ సంవత్సరం సామవై (I-8) శాసనంలో దినసంఖ్య పదియని; క్రీ. శ. 1551 వ సంవత్సరం వీరమరాజ తిమ్మయ్యర్ కుమారుడు రాయసం వేంకటాద్రి (V-129) శాసనం, క్రీ. శ. 1594 వ సంవత్సరం కోయిల్ కెళ్వి అణ్ణన్ రామానుజజియ్యర్ (VI-10) శాసనాలలో రోజులుసంఖ్య పదకొండని తెలుస్తున్నాయి. క్రీ. శ. 1504 వ సంవత్సరం తిరుప్పణిపిళ్లై ఎంబెరుమానార్ (II-138) శాసనం; క్రీ.శ. 1511 వ సంవత్సరం అప్పపిళ్ళ (III-18) శాసనం; క్రీ. శ. 1528 వ

సంవత్సరం కుప్పయ్యన్(III-179)శాసనం; క్రీ.శ. 1539వ సంవత్సరం నాగర్ పండితర్ [IV-140) శాసనం; క్రీ. శ. 1545 వ సంవత్సరం అన్నమయ్యం, గారి కుమారుడు తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్ (V-47) శాసనం; క్రీ. శ. 1583వ సంవత్సరం ఎట్టూరు తిరుమలై కుమార తాతాచార్యర్ అయ్యన్ (VI-5) శాసనాలలో ఉనసంఖ్య పన్నెండని; క్రీ.శ. 1537వ సంవత్సరం అదైప్పం విశ్వ నాథ నాయకర్ (IV-81) శాసనం; కృష్ణప్ప నాయకర్ (IV-82) శాసనం దాచ్చరసయ్య (IV-83) శాసనం; రామభట్టరయ్యన్ (IV-84) శాసనం; ఇమ్మడి ఎల్లప్ప ఉడైయర్ (IV-8) శాసనం; సింగరాట (IV-88) శాసనం; అదైప్పం బైయప్ప నాయకర్ (IV-110) శాసనాలలో పదమూడు రోజులని; క్రీ.శ. 1561వ సంవత్సరం తిరుమలయ్యరాజా (V-168) శాసనంలో బ్రహ్మోత్సవ ఉనసంఖ్య పదునాలుగురోజులని స్పష్టమౌతున్నాయి.

## ప్రధాన నైవేద్యాలు:-

బ్రహ్మోత్సవ సమయంలో ప్రధాన నైవేద్యాలుగాను అప్పపడి, సుగియన్ పడి, అతిరసప్పడి, తిరుక్కణామడై, శీడైప్పడి, ఇడ్డిలిపడి, తిరుపోనకం, దధ్యోదనం మొదలైన వాటికి దానంచేశారు.

## అన్నమయ్య సంకీర్తనలలో బ్రహ్మోత్సవ ప్రశంస:

ఆంధ్ర వాగ్గేయకారులలో ప్రసిద్ధుడు అన్నమయ్య. ఇతడు క్రీ. శ. 1424—1503 ప్రాంతంవాడు. కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో స్వామి నందకాంశంలో జన్మించినవాడు. రోజుకు ఒక సంకీర్తన చొప్పున 32 వేల కీర్తనలు వ్రాసిన పదకవితా పితామహుడు. ఆయన సంకీర్తనలు వేదాలు, పౌరాణికవాదాలు, పరతత్త్వ పీఠానాదాలు, సుజనాహ్లాదాలు. వీరశైవ సాహిత్యానికి దీటుగా వైష్ణవ సాహిత్యాన్ని సృష్టించిన ఘనత తాళ్ళపాకవారిదే, అన్నమయ్య సంకీర్తనలలో ఆంధ్రదేశపు పరిస్థితి, ఆచార వ్యవహారాలు, స్వామి వారికి సంబంధించిన సర్వవిషయాలు సాక్షాత్కరిస్తాయి.

ఇంతవరకు ముద్రితమయిన అన్నమయ్య సంకీర్తనలలో 'బ్రహ్మోత్సవం' అనేమాటలేదు. కాని బ్రహ్మోత్సవానికి సంబరంగా తిరుమల చేరుకొనే భక్తబృందాన్ని —

నానాదిక్కుల నరులెల్లా
వాసలలోననే వత్తురు గదలి

సతులు సుతులు బరిసరులు బాంధవులు
హితులు గొలువగా నిందరును
శతసహస్రయోజన వాసులును
వ్రతములు తోడనె వత్తురుగదలి

ముడుపులు జాలెలు ముగిదల మూటలు
కడలేని ధనము గాంతలును
కడుమంచి మణులు కరులు తురగములు
వడిగొని చెలగుచు వత్తురు గదలి

మకుట వర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులు చతురులును
తగు వేంకటపతి దరుశింపగ బహు
వగల సంపదల వత్తురు గదలి (11-3-134)

కీర్తనలో అన్నమయ్య వర్ణించాడు. 'వాసలలోననే వత్తురు' అనే మాటను బట్టి బ్రహ్మోత్సవం వర్షాకాలంలో పురట్టాశి మాసంలో జరిగేదని ఊహించడానికి వీలుంది.

"నానాభూములవారు నమ్మి శ్రీ వేంకటపతి
గానవచ్చి యేటనేట ఘనులయ్యేరు" (9-94)

అని అన్నమయ్య పేర్కొనడాన్నిబట్టి ఈ ఉత్సవం సంవత్సరంలో ఒకే సారి జరిగేదని తెలుస్తుంది.

బ్రహ్మోత్సవ ప్రారంభం ముందురోజున అంకురార్పణం జరుగుతుంది. ఆరోజు సాయంకాలం శ్రీ విష్వక్సేనుల వారికి (సేనాధిపతి వారికి) తిరుమలవీధుల ఊరేగింపు జరుగుతుంది. ఈ ప్రశంసను అన్నమయ్య

అది వచ్చె నిదివచ్చె నచ్యుత సేనాపతి
పది దిక్కులకు నిట్టె పారరో యసురులు (2–79)

కీర్తనలో స్పష్టం చేశాడు.

## వాహనక్రమం:–

బ్రహ్మోత్సవ వాహనాల క్రమం భవిష్యోత్తర పురాణం (14 అధ్యాయం) లోను, వేంకటాచల మాహాత్మ్యం లోను ఒకేలా ఉన్నాయి.

## భవిష్యోత్తర పురాణం:-

బ్రహ్మోత్సవం ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణంతో పూర్తౌవుతుంది,

మొదటిదినం ధ్వజారోహణానికి మనుష్యాందోళికా; రాత్రి శేషవాహనం; రెండవదినం ఉదయం శేషవాహనం; రాత్రి హంసవాహనం; మూడవదినం ఉదయం సింహవాహనం; రాత్రి మౌక్తిక మండపం; నాల్గవదినం ఉదయం కల్పవృక్షం; రాత్రి సర్వభూపాల వాహనం; అయిదవదినం ఉదయం ఆందోళిక (అమృత ప్రధానం చేయు మోహినీ అవతారానికి); రాత్రి గరుడవాహనం; ఆరవదినం ఉదయం హనుమంత వాహనం; సాయంకాలం మంగళగిరి వాహనం; రాత్రి గజ వాహనం; ఏడవదినం ఉదయం సూర్యమండల వాహనం; సాయంకాలం మంగళ గిరి వాహనం; (ఉద్యాన విహారానుధాగంచే) రాత్రి చంద్రమండల వాహనం; ఎనిమిదవదినం రథవాహనం; రాత్రి అశ్వవాహనం; తొమ్మిదవదినం ఆందోళిక; మంగళగిరి వాహనం; (హరిద్రాభిషిక్తుడై అవభృథస్నాన లోలుపుడైన శ్రీవారికి) రాత్రి మంగళగిరి వాహనం; (ధ్వజావరోహణమునకు) పదవదినం పుష్పయాగ మహోత్సవం.

అన్నమయ్య బ్రహ్మోత్సవ దినక్రమ వాహనాలను

తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారములతోడను

తిరుదండెలపై నేగీ దేవుడిదే తొలునాడు
సిరుల రెండవనాడు శేషునిమీద
మురిపేన మూడోనాడు ముత్యాలపందిరిక్రింద
పొరి నాలుగోనాడు పువ్వుగోవిలలోను

గక్కున నయిదవనాడు గరుడిని మీదను
యెక్కెను ఆరవనాడు యేనుగుమీదను
చొక్కపు యేడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువదేరును గుఱ్ఱ మెనిమిదోనాడు

కనకపు టందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
యెనసి శ్రీవేంకటేశుడింత యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను [13-192]కీర్తనలో వర్ణించాడు.

పురాణాలలోను, అన్నమయ్య సంకీర్తనలలోను పేర్కొన్న బ్రహ్మోత్సవ వర్ణనల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే ఈ క్రింది విషయాలు స్పష్టమవు తాయి.

1. వాహనాల పేర్లలో కొన్నింటిలో తేడాలుండడం. అన్నమయ్య వర్ణించిన తిరుదండలు, ముత్యాల పందిరి, పువ్వుగోవిల, కనకపు టందలం వరుసగా నేడు మనుష్యాందోళిక, మౌక్తిక మండపం, కల్ప వృక్షం, పల్లకీ వాహనాల పేర్లుగా కనిపిస్తాయి.

2. శేష, గరుడ, గజ, సూర్యప్రభ, హయ మొదలైన వాహనాలు ఉదయమా రాత్రా అనే కాల నిర్దేశాన్ని అన్నమయ్య స్పష్టం చేయక పోవడం.

3. పురాణాలలో చెప్పబడి, అన్నమయ్యలో చెప్పని వాహనా లుండడం. అవి నాలుగు. హంస, సింహ, సర్వభూపాల, హనుమంత వాహనాలు.

ఇంక ప్రసిద్ధ వాహనాల చరిత్ర పరిశీలిద్దాం. ఈ సందర్భంలో ప్రసిద్ధ చారిత్రకులు శ్రీ టి.కె.ఆర్. వీరరాఘవా చార్యుల వాక్యాలు పరిశీలించ దగ్గవి.

" From the above account we may conclude that there was no agamic authority or injuction for the use of any particular vahanam on any particular day and that the arrangement which we now find

established is really the result of the initiative taken at different periods by pious devotees":

History of Tiruvengadam Temples Page 51.

## శేష వాహనం :-

శాసనాలలో శేషవాహన ప్రశంస క్రీ.శ. 1508వ సంవత్సరం మొట్ట మొదటిసారిగా కనిపిస్తుంది.

క్రీ.శ. 1508వ సంవత్సరం నరసింహరాయ ముదలియర్ రామయ్యన్ తిమ్మయ్యన్ (III-15) శాసనం; క్రీ.శ. 1533వ సంవత్సరం ఎల్లప్పపిళ్ళై (IV-26) శాసనం; క్రీ.శ. 1535వ సంవత్సరం అందకాలం తీర్థర్ ఉలగప్పర్(IV-51)శాసనం; నగర భట్టర్ కుమారుడు రాయసం దీక్షితర్(IV-59) శాసనం; క్రీ శ. 1538వ సంవత్సరం మళైయణ్ణన్ రామయ్యన్ (IV-114) శాసనం; క్రీ.శ. 1540వ సంవత్సరం నోట్టకారర్ నాగప్పన్ (IV-149) శాసనం; క్రీ.శ. 1541వ సంవత్సరం సేట్టలూర్ శ్రీనివాసయ్యన్(IV-157) శాసనం; క్రీ.శ. 1543వ సంవత్సరం ఎల్లప్పపిళ్ళై (V-8) శాసనాలలో శేషవాహన ప్రశంస; క్రీ శ. 1614వ సంవత్సరం నోట్టక్కార కోనప్పయ్యన్ కుమారుడు నోట్టక్కార వేంకటయ్యన్ (VI-18)శాసనంలో మాత్రం వెండిశేష వాహన ప్రశంస కనిపిస్తుంది.

క్రీ.శ. 1614వ సంవత్సరానికి ముందు కాలంలోని శాసనాలు శేష వాహనోత్సవం తొమ్మిదవరోజు నిర్వహింపబడుతుండేదని స్పష్టపరుస్తున్నాయి క్రీ.శ. 1614వ సంవత్సరంలోని శాసనంలోవెండి శేషవాహనోత్సవం బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు రాత్రి జరిగేదని తెలుస్తుంది.

అన్నమయ్య "సిరుల రెండవనాడు శేషుని మీద" (13-192) అని పేర్కొని, శేషవాహనోత్సవం జరిగే తీరును—

వీడుగదే శేషుడు శ్రీవేంకటాద్రిశేషుడు
వేడుక గరుడనితో బెన్నుద్దైన శేషుడు

వేయి పడగలతోడ వెలసిన శేషుడు
చాయమేని తళుకు వజ్రాల శేషుడు
మాయని శిరసులపై మాణిక్యాల శేషుడు
యే యెడ హరికి నీడై యేగేటి శేషుడు

పట్టపు వాహనమైన బంగారు శేషుడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుడు
నట్టుకొన్న రెండువేలు నాలుకల శేషుడు
నెట్టనవారి బొగడ నేరు పరిశేషుడు

కదిసి పనులకెల్ల గాచుకొన్న శేషుడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుడు
అదె శ్రీవేంకటపతి కలుమేలు మంగకును
పదరక యేపొద్దు పానుపైన శేషుడు [9-76] కీర్తనలో వర్ణించాడు.

## గరుడ వాహనం :—

కొండమీద జరిగే బ్రహ్మోత్సవంలో గరుడోత్సవం ప్రసిద్ధమైంది. ఈ ఉత్సవ ప్రశంసఉన్న శాసనాలు రెండు.

మొదటిది క్రీ. శ. 1530 నాటి తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్ (IV-6) శాసనం.

రెండవది క్రీ.శ. 1583 నాటి ఎట్టూర్ తిరుమలై కుమార తాతాచార్యర్ (VI-5) శాసనం.

మొదటి దానిలో గరుడోత్సవం అయిదవరోజు జరిగేదిగా ఉంది. రెండవదానిలో అలంకరణ నియమం ఉంది.

" గక్కున నయిదవనాడు గరుడుని మీదను" (13-192) అని అన్నమయ్య పేర్కొన్నాడు.

అన్నమయ్య ఎన్నో సంకీర్తనలలో గరుడుని కీర్తించాడు. వాటిలో గరుడవాహన ప్రశంస గలవి రెండు.

“ పల్లించి గరుడనిపై నీవుబ్బున నెక్క
బంగారు గరుడనిపై నీవు వీధులేగ” [11-70]

“ ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనము లెక్క
గట్టిగా నిందుకే హరి కడు మెచ్చేమయ్యా

గరుడుని మీదనెక్కి గమనించితివి నాడు
అరుదైన పారిజాత హరణానకు” [26-105]

వాహనారూఢుడైన స్వామి వర్ణనగలది మరొకటి-

వీది వీది వాడె వాడె వీడె వీడె చెలగీని
ఆదిదేవుడు శ్రీవేంకటాద్రి మీదటను

గరుడ ధ్వజంబదె ఘన విష్ణురథమదె
సరి శంఖ చక్రముల శార్ఙమునదె
హరియందు మీదటను ఆయత్తమై యున్నాడదె
అరులనెల్లా గెలిచి అమరులగావను

సారధి యల్లవాడె చాలి రణభేరియదె
అరయ నిటుమేలా బ్రహ్మాదులు వారె
పేరు కొన్న వేదముల బిరుద పద్యములవె
శ్రీరమణుడు మెరసి చిక్కులవాపగను

ఆటలు పాటలునవె అచ్చరలేమలువారె
చాటువ నలమేల్మంగ సంగడినదె
యీటులేని శ్రీవేంకటేశుడేగీ నల్లవాడె
కోటానగోటి దాసుల కోరిక లీడేర్పన [8-274]

ఈ చరణాంశాలను బట్టి గరుడోత్సవ సందర్భంలో వేద పఠనం, స్త్రీల ఆటపాట లుండేవని తెలుస్తుంది.

## గజ వాహనం :—

తిరుమల మీద జరిగే బ్రహ్మోత్సవ వాహనాలలో గజ వాహనం ఒకటి. గజవాహన ప్రశంస ఉన్న శాసనాలు రెండు.

మొదటిది క్రీ.శ. 1583వ సంవత్సరం ఎట్టూర్ తిరుమలై కుమార తాతాచార్యర్ (VI-5) శాసనం. ఇతడు గజవాహన అలంకరణకు పణం కట్టడి చేశాడు.

రెండవది క్రీ.శ. 1628వ సంవత్సరం మట్ల కుమార అనంతరాజా (VI-25) శాసనం. ఇతడు వెండిగజ వాహనాన్ని బహూకరించాడు. అయితే ఈ శాసనం తెలుగు లిపిలో ఉండడం ఒక విశేషం.

"స్వణాన్శ్వ, సింధూర, సమర భూపాల వాహన పద్మపీఠరత్నాఢ్య మకుట నైవేద్య భాజనోన్నతకేళీ మంటప సోపానమాగాన్గ్రగోపురా-ది కైంకర్య సంతుష్ట వేంకటా చలపతి!!

అన్నమయ్య "ఎక్కెను ఆరవనాడు యేనుగు మీదను" (13-192) అనుటను బట్టి గజవాహనం ఆరవరోజు నిర్వహింపబడేదని తెలుస్తుంది.

అన్నమయ్య సంకీర్తనరాశిలో బ్రహ్మోత్సవ కాలంలోని గజారూఢు డయిన స్వామి వర్ణన లేదు. కాని నాయికా నాయక భావంతో అలంకార శాస్త్రానుగుణంగా గజారూఢుడయిన దేవితో కూడిన స్వామి వర్ణన ఉంది.

చొల్లెపు జుట్టుతోడి చుంగుల రాజసముతో
వెల్ల విరిగానేగీ వెలదుల గొలువ

వీపు గుచాలు మోపి వెలది కౌగలించగా
నేపున నేనుగనెక్కి నిదె దేవుడు
చేపట్టి యాపె చేతులు బిగ్గెబట్టుక
పైపై వీధులవెంట బరువుదోలీని [13-58]

## సూర్యప్రభ, చంద్రప్రభ:-

ఈ వాహనాల ప్రసక్తి ప్రాచీన శాసనాలలో కనిపించదు. స్వామికి సూర్యప్రభ వైకుంఠ విమానం వాహనాలు క్రీ.శ. 1564 తరువాతే వ్యాప్తి లోకి వచ్చాయని శ్రీ టి.కె.టి. వీరరాఘవాచార్యులవారు భావించారు చంద్ర ప్రభ వాహన ప్రశంస శాసనాలలో ఉన్నట్లు కానరాదు. కాని 1564 కు పూర్వం వాహన ప్రశంస అన్నమయ్య కీర్తనలో ఉంది.

అన్నమయ్య—

"చొక్కపై యేడవనాడు సూర్యప్రభలోనను" [13-193]

"ఉలిదవదన చంద్రోదయ వేళను
రవియగు సూర్యప్రభ నీవేగగ" [30-197]

"రంగగు సూర్యప్రభ నీవేగగ
రంతుల సూర్యప్రభ నీవేగగ" [30-197]

—పంక్తులలో పేర్కొన్నాడు.

## తురగోత్సవం :—

తురగ వాహన ప్రశంస ఉన్న శాసనాలు మూడు.

క్రీ.శ. 1491వ సంవత్సరం ఆరవత్తై ప్పెరుమాళదాసర్ ఇళయ పెరుమాళ్ అప్పయ్యన్ (II 96) శాసనం, క్రీ.శ. 1536వ సంవత్సరం రామానుజదాసర్ (IV-69) శాసనాలలో తురగోత్సవ ప్రశంస, క్రీ.శ. 1628వ సంవత్సరం మల్ల కుమార అనంతరాజా (VI-25) శాసనంలో మాత్రం బంగారు అశ్వవాహన ప్రశంస ఉంది. క్రీ.శ. 1536వ సంవత్సరం ముందు శాసనాలలో బంగారు తురగమూ, వెండి తురగమూ అని పేర్కొన లేదు.

అన్నమయ్య "ఇక్కువదేరును గుఱ్ఱమెనిమిదోనాడు" అని పేర్కొన్నాడు.

అన్నమయ్య సంకీర్తనరాశిలో తురగోత్సవ ప్రశంస ఉన్న కీర్తనలు రెండు కనిపిస్తాయి. స్వామివారు దేవేరితో తిరువీధులలో ఊరేగే విధానాన్ని వర్ణించిన తీరు గమనించ తగ్గది.

వాగె బలువు దైవపురాయ-నీ
రాగె జతనము పరాకెచ్చరికె

మించుల దురగము మిన్నులమోవగ
నంచల గురుచల నాడగను
కంచు మించుగా గక్కునదోలితి
పంచాస్త్ర గురుడ పాడెచ్చరికె

పెక్కువతేజిటు పేరెము వారగ
తొక్కని చోట్లు దొక్కగను
చుక్కలు మోవగ సొంపుగ దోలితి
తొక్కుల దేవ వెచ్చరికె

అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితో జెలగెడి
లంకెలజాగు భళాయెచ్చరికె [11-2-30]

మరొక కీర్తనలో—

నీవు దురగము మీదనేర్పు మెరయ
వేవేలు రూపములు వెదచల్లితప్పడు [12-210]

అని వర్ణించాడు.

## పల్లకి వాహనం :-

పల్లకీ వాహన ప్రశంస ఉన్న శాసనాలు నాలుగు.

క్రీ.శ. 1544వ సంవత్సరం కట్ల కొండమనాయక్కర్ కుమారుడు మూర్తి నాయకర్ (V-19) శాసనం; క్రీ.శ. 1545వ సంవత్సరం మలైని న్రాన్ భట్టర్ అప్పయ్యన్ కుమారుడు వేంకటత్తురైవర్ (V-60) శాసనం;

క్రీ శ. 1614వ సంవత్సరం నోట్టక్కార కోనప్పయ్యన్ కుమారుడు నోట్ట క్కార వేంకటయ్యన్ (VI-18) శాసనం; క్రీ.శ. 1627వ సంవత్సరం నోట్టక్కార వేంకటయ్యన్ కుమారుడు నోట్టక్కార నారాయణన్ (VI-20) శాసనాలలో పల్లకీ వాహన ప్రశంస కన్పిస్తుంది.

అన్నమయ్య సంకీర్తనంలో "కనకపు టందలము కదిసి తొమ్మిదో నాడు" అని పేర్కొనడాన్ని బట్టి ఈ ఉత్సవం తొమ్మిదవరోజు నిర్వహింప బడు తుండేదని తెలుస్తుంది.

అన్నమయ్య కీర్తనలలో పల్లకీ వాహన ప్రశంస ఉన్న కీర్తనలు రెండు

ఎట్టునేరిచితివయ్య యిన్ని వాహనము లెక్క
గట్టిగా నిందుకే హరికడు మెచ్చేమయ్యా
యెట్టుక శ్రీవేంకటాద్రి మీద బల్లకి యెక్కితి
విట్టె యిందిరగూడ యేగు బెండ్లి యేగను [30-197]

అనడంలో పల్లకి ప్రశంస మాత్రం వర్ణితం.

పల్లకీ వాహనంలో స్వామివారు, దేవేరి ఎదురెదురుగా కూర్చొని వూరేగుతున్న దృశ్యాన్ని—

తనివార దిరువ నందలము సేవ నేడు
అనువుగా సేవించరో అమరులు ఋషులు

యెదురుగా గూచుండి యిద్దరు నందలమెక్కి
కదిసి మీద బన్నాము గట్టించి
ముదమున నొండొరులు మోములు చూచుకొంటూ
యిదివో దేవులు దేవుడేగేరు వీధులు

చదురులు మాటలు సతులాడగా వింటా
వుదుటున దమయంగా లొరయగను

ఆదనెరిని మోవులనంతలో నవ్వులునవ్వి
యెదురెదుర దంపతులేగేరు వీధులా
పొదిగి యలమేల్మంగ పూచి కౌగిలించగాను
కదలక కొడే శ్రీ వేంకటేశ్వరుడు
అదివో యాతడు మెచ్చె నాతనినాపె మెచ్చె
యెదిగినగరిలోనె యేగేరు వీధులా (15–189)

కీర్తనలో వర్ణించాడు.

# రథోత్సవం

*****

దేవాలయాలలో జరిగే ఉత్సవాలలో రథోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. ఉత్సవ విగ్రహానికి సాగే ఉత్సవాలలో పురోహిత వర్గానికి, అధికారవర్గానికి తప్ప సామాన్య ప్రజానీకానికి అంతగా అవకాశంలేదు. అంటే స్వామి దివ్యమంగళ దర్శన భాగ్యం తప్ప మరొకటి లేదని అభిప్రాయం. కాని రథోత్సవంలో మాత్రం సామాన్య ప్రజానీకానికి కూడా బాగం ఉంది. ఆబాలగోపాలం రథానికి కట్టిన తాళ్ళను లాగుతూ తమబలంవల్లనే రథం కదిలిందని భావించుకోవడం సహజ మానవ ప్రవృత్తికి ఒక ఉదాహరణ. అదీగాక దేహానికి రథానికి పోలికలు వేదాంత గ్రంథాలలో సవివరంగా ప్రతిపాదించడం ఉంది, ఉత్సవాలలో చివరిదైన రథోత్స వంలో ఆబాల గోపాలానికి సమాన భాగస్వామ్యం అప్రయత్నపూర్వకంగా లభిస్తుందని ఫలితార్థం.

## రథోత్సవం-ఆధారాలు

బ్రహ్మోత్సవంలో భాగంగా రథోత్సవం తిరుమలలో చాలకాలంనుండి వైభవంగా జరుగుతుంది అనడానికి ప్రధానంగా రెండు ఆధారాలు కనిపిస్తున్నాయి.

1. శాసనాధారం, 2. సంకీర్తనాధాకం.

## శాసనాలలో రథోత్సవం:

తిరుమల తిరుపతి ఆలయ గోడలపై రథోత్సవానికి సంబంధించిన శాస నాలున్నాయి. వాటిని మూడుదశలుగా వర్గీకరించ వచ్చును.

**ప్రథమదశ:-** (క్రీ. శ. 1424 క్రీ. శ. 1503)

ఈదశలో రథోత్సవానికి సంబంధించి తొమ్మిది శాసనాలున్నాయి. క్రీ. శ. 1476వ సంవత్సరం శ్రీ శఠకోపదాసర్ నరసింహరాయ ముదలియార్ శాసనం. ఇతడు తిరుప్పమంటపం ముందు పురట్టాశి పంగుని ఉత్సవాలలో రథోత్సవ ఊరేగింపు సందర్భంలో రెండు సుగియన్ పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1491 వ సంవత్సరం అరవణై ప్పేరు మాళవదాసర్ ఇళయ పెరుమాళ్ అప్పయ్యన్ శాసనం. ఇతడు పురట్టాశి, పంగుని మాసాలలో జరిగే రథోత్సవానికి రెండు అతిరసప్పడి నియమనం చేశాడు.

క్రీ. శ, 1493 వ సంవత్సరం పెరియ పెరుమాళ్ దాసర్. సొత్తై బక్తర్ హస్తగిరి నాథర్ అళగప్పిరానాళ్ శాసనం. వీరు తిరువేంకట ముదయార్‌న్‌కు పురట్టాశి, పంగుని నెలలో రథోత్సవ ఊరేగింపుకు రెండు అతిరసప్పడి కట్టడి చేశారు;

రథోత్సవం పూర్తి అయి రథం యథాస్థలం చేరినపిమ్మట ఉభయానికి రెండు మరకుర్ బియ్యం నాలుగు నాళి, ఒక ఉరి నెయ్యి. ఇన్నూరు పలం బెల్లం ఒక ఉళక్కు మిరియాలు, నూరు పక్కలు రెండుకందల తమలపాకులు, నాలుగు పలం చందనం నియమనం చేశాడు.

క్రీ. శ. 1493 వ సంవత్సరం పెరియ పెరుమాళదాసర్ అరియరాయ ముదలియార్ అప్పయ్యన్ శాసనం. ఇతడు తిరువేంకట ముదయాన్‌కు పురట్టాశి, పంగుని మాసాలలో రథోత్సవ సందర్భంలో తనయింటిముందు రెండు అతిరస ప్పడిని కట్టడి చేశాడు. దీనితోపాటు ఉభయానికి నాలుగు పలం చందనం. నూరు పక్కలు, ఇన్నూరు తమలపాకులు ఏర్పాటు చేశాడు.

క్రీ. శ. 1493వ సంవత్సరం కుమార శ్రీతాతయ్యంగారి శాసనం. ఇతడు ఉదయాన జరిగే రథోత్సవ పూరేగింపుకు రెండు అతిరసప్పడి నియమనంచేశాడు.

క్రీ, శ. 1494 వ సంవత్సరం తిమ్మణ దణాయక్క శాసనం. ఇతడు పురట్టాశి, పంగుని నెలలో జరిగే రెండు రథోత్సవాలకు రెండు అప్పపడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1495 వ సంవత్సరం పల్లవరాయర్ చంద్రపిళ్లైయార్ మల్లై విన్న పెరుమాళ్, మైలేరుం పెరుమాళ్ శాసనం. వీరు పురట్టాశి పంగుని ఉత్సవాలప్పుడు జరిగే రథోత్సవాలకు రెండు సుగియన్ పడి నియమనం చేశారు.

క్రీ. శ. 1495 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ శాసనం. ఇతడు రెండురోజులు రథోత్సవాలకు రెండు అప్పపడి, రెండు సుగియన్ పడి రెండు కుండల పానకం ఏర్పాటు చేశాడు.

## ద్వితీయ దశ : (క్రీ.శ. 1504-క్రీ శ. 1583)

ఈ దశలో రథోత్సవ శాసనాలు ఇరవైమూడు కన్పిస్తున్నాయి.

క్రీ.శ. 1504వ సంవత్సరం అను సంధానం తిరువేంకట జియ్యర్ శాసనం. ఇతడు పురట్టాశి, పంగుని మాసాలలో జరిగే రెండు రథోత్సవాలకు తిరువేంకటనాథన్ మంటపంలో రెండు అతిరసప్పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1597 వ సంవత్సరం తిప్పుశెట్టి శాసనం, ఇతడు పురట్టాశి, పంగుని మాసాలలో జరిగే రెండు రథోత్సవాల రోజులలో ఊరేగింపు తిరుగు ప్రయాణ మప్పుడు తిరుమణి మంటపంలో రెండు అతిరసప్పడి, రెండు అప్పపడి, రెండు వడైప్పడి రెండు గోధిపడి, రెండు ఇడ్డిలిపడి, రెండు సుగియన్ పడి నూరు పలం చెక్కెర, రెండు కుండల చెక్కెరనీళ్ళు ఏర్పాటు చేశాడు.

క్రీ. శ. 1508 వ సంవత్సరం నరసింహరాయ ముదలియార్, రామయ్యన్, తిమ్మయ్యన్ శాసనం. వీరు వైకాశి, ఆణిమాసాలలో నిర్వహింపబడే రెండు రథోత్సవాలకు రెండు అప్పపడి, పానకానికి నూరు పలం దక్కెర కట్టడి చేశారు.

క్రీ. శ. 1516 వ సంత్సరం దైవతాన్ అరసు శాసనం. ఇతడు బ్రహ్మోత్సవాలలో మూడు ఎనిమిదవ రోజు రథోత్సవాలకు మూడు సీడైప్పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1520 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ శాసనం ఇతడు రెండు అప్పపడి, రెండు సుగీయన్‌పడి, నాలుగు కుండల పానకం, ఏడవరోజు రథోత్సవానికి నియమనం చేశాడు.

క్రీ. శ. 1530 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ శాసనం. ఇతడు ఆడి, ఆవణి, ఐప్పశి, చిత్తి మాసాలు బ్రహ్మోత్సవాలప్పుడు రామానుజ కూటానికి ముందు నైవేద్యానికి ఆరు అప్పపడి, ఆరు కుండల పానకానికి మున్నూరు పలం చక్కెర, రామానుజ వీధిలో రామానుజ ఇంటిముందు వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహానికి ఆరు సుగియన్ పడి, ఆరుకుండల పానకానికి, మున్నూరు పలం నైవేద్యంగా ఆరు రథోత్సవాలప్పుడు ఏర్పాటు

## పై శాసనాల పరిశీలన వల్ల తెలిసే విషయాలు :-

పైన పేర్కొన్న శాసన కర్తలు రథోత్సవాల ప్రారంభ దశలోను, మజిలీలలోను, ఊరేగింపు పూర్తయి రథం యథాస్థలం చేరిన తర్వాత నైవేద్య వ్యవస్థ కల్పించారు, వీరిని రెండు వర్గాలుగా విభజించవచ్చును.

1. ఆలయ పరిచారక వర్గం
2. పరిచార కేతరులు

## 1. ఆలయ పరిచారక వర్గం :-

ఆలయ గణాధికార్లు, జియ్యంగార్లు, గురువులు మొదలైనవారు ఆలయ పరిచారక వర్గంలో చేరతారు.

క్రీ. శ. 1495 వ సంవత్సరం ఆలయ గణాధికారులైన వల్లవ రాయర్ చంద్ర పిళ్లైయార్, మల్లైస్విన పెరుమాళ్, మైలేరుం పెరుమాళ్ (II-132) శాసనం క్రీ. శ. 1542 వ సంవత్సరం కోయిల్ కెళ్విజియ్యర్ (V-2) శాసనం. క్రీ.శ. 1493 వ సంవంత్సరం గురువులైన (ఆచార్య పురుషులైన) కుమార తాతయ్యంగార్ (II-104) శాసనం. క్రీ. శ. 1495. 1520. 1530 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగారి (II-134. III-142. IV-3) శాసనాలు. 1583 వ సంవత్సరం ఎట్టూరు తిరుమలై కుమార్ తాతాచార్యర్ (V-5) శాసనం. ఈ కోవలో చేరుతారు.

## 2. పరిచారకేతరులు:

వ్యాపారస్తులు, వాగ్గేయ కారులు. మొదలైనవారు పరిచార కేతరుల వర్గంలోకి వస్తారు.

క్రీ. శ. 1491 వ సంవత్సరం అరవణెప్పెరుమాళదాసర్(II-96) శాసనం. క్రీ. శ. 1493 వ సంవత్సరం పెరియ పెరుమాళదాసర్ సొత్తైబత్తర్ హాస్తగిరి నాథర్ అళగప్పిర్‌గార్ (II-105) శాసనం. 1543 వ సంవత్సరం ఎల్లప్పపిళ్లై (V-8) శాసనం..

క్రీ. శ. 1476 వ సంవత్సరం శ్రీ శఠకోపదాసర్ నరసింహరాయ ముదలియార్ (II-68) శాసనం. 1493 వ సంవత్సరం పెరియ పెరుమాళదాసర్

అరియరాయ ముదలియార్ అప్పయ్యన్(II-108)శాసనం. 1507 వ సంవత్సరం తిప్పుశెట్టి (III-11) శాసనం, 1533 వ సంవత్సరం నాగుశెట్టియార్ కుమారుడు నారాయణశెట్టియార్ (IV-27) శాసనం. 1537 వ సంవత్సరం కృష్ణపశెట్టి (IV-87) శాసనం.

క్రీ. శ. 1530 వ సంవత్సరం తాళ్ళపాక తిరుమల అయ్యంగార్ (IV--6) శాసనం. 1539 వ సంవత్సరం పెరియ తిరుమల అయ్యంగార్ (IV-129) శాసనం. 1547 వ సంవత్సరం తాళ్లపాక సిరు తిరుమల అయ్యంగార్ (V-98) శాసనం.

క్రీ శ. 1494 వ సంవత్సరం తిమ్మణదణాయక్కర్ (II-113) శాసనం. 1504 వ సంవత్సరం అనుసంధానం తిరువేంకట జీయ్యర్ (III-?) శాసనం. 1508 వ సంవత్సరం నరసింహరాయ ముదలియార్ రామయ్యన్ తిమ్మయ్యన్ (III-14) శాసనం. 1537 వ సంవత్సరం అద్వైప్పం విశ్వనాథ నాయకర్ (IV-81) శాసనం. కృష్ణప్పనాయకర్ (IV-82) శాసనం. దాచ్చ రాసయ్యర్ (IV-83) శాసనం. రామాభట్ట అయ్యర్ (IV-84) శాసనం. క్రీ. శ. 1538 వ సంవత్సరం అద్వైప్పం బైయప్ప నాయకర్ శాసనం. (IV-110) 1545 వ సంవత్సరం వేంకటత్తురైవర్ (V-60) శాసనం. 1547 వ సంవత్సరం తిమ్మరాజ (V-96) శాసనం.

క్రీ. శ. 1479 వ సంవత్సరం కుమార తాతాయ్యంగార్ (II-109) మొదటి శాసనంలో రథోత్సవం సంఖ్య ఒకటని క్రీ.శ. 1476వ సంవత్సరం శ్రీ శఠకోప దాసర్ నరసింహరాయ ముదలియార్ (II-68) మొదటి శాసనంలో రథోత్సవాల సంఖ్య రెండని, క్రీ. శ. 1516 వ సంవత్సరం దైవతాన్ అరసు (III-113) మొదటి శాసనంలో మూడు రథోత్సవాలని క్రీ.శ.1530 వ సంవత్సరంలో తాళ్ళపాక తిరుమల అయ్యంగార్ (IV-6) మొదటి శాసనాంలో నాలుగు రథోత్సవాలని క్రీ. శ. 1542 వ సంవత్సరం కోయిల్ కెళ్వి జియ్యర్ (V-2) శాసనంలో. అయిదు రథోత్సవాలని క్రీ. శ. 1530 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ (IV-3) శాసనంలో ఆరు రథోత్సవాలని తెలుస్తున్నాయి.

క్రీ. శ. 1520 వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ (III-142) శాసనంలో రథోత్సవం ఏడవ రోజని, క్రీ. శ, 1516 వ సంవత్సరం దైవతాన్

చేశాడు పురట్టాశి, తై బ్రహోత్సవాలప్పుడు జరిగే రెండురథోత్సవాలకు ఇది వరకు ఏర్పాటుచేసిన నైవేద్య వ్యవస్థ ఏర్పాటుచేయాలి.

క్రీ. శ. 1530 వ సంత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళపాక తిరుమల అయ్యంగార్ శాసనం. ఇతడు తొమ్మిది బ్రహ్మోత్సవాలలో నాలుగు రథోత్సవాలకు నాలుగు పడిని కట్టడి చేశాడు.

క్రీ. శ. 1533 వ సంవత్సరం నాగుశెట్టియార్ కుమారుడు నారాయణ శెట్టియార్ శాసనం. ఇతడు కార్తికై బ్రహ్మోత్సవం ఎనిమిదవ రోజు రథోత్సవానికి పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1537 వ సంత్సరం అదైప్పం విశ్వనాథ నాయకుని (V-81) శాసనం. కృష్ణప్పనాయకర్ (V-82) శాసనం, బాచ్చ రాసయ్యర్ (IV-83) శాసనం, రామభట్టరయ్యర్ (V-84) శాసనం. 1538 వ సంవత్సరం అదైప్పం బైయప్ప నాయకర్ (IV-110) శాసనం. వీరందరు పురట్టాశి, కార్తికై, తై, పంగుని, బ్రహ్మోత్సవాలలో నిర్వహింపబడే నాలుగు రథోత్స వాలకు నాలుగు అప్పపడి వంతున కట్టడి చేశారు.

క్రీ. శ. 1537 వ సంవత్సరం కృష్ణపశెట్టి శాసనం. ఇతడు పురట్టాశి. కార్తికై, తై, పంగుని మాసాలలో నిర్వహింపబడే నాలుగు రథోత్సవాలకు నాలుగు దోసైప్పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1539 వ సంవత్సరం అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళ పాకం పెరియ తిరుమలయ్యంగార్ శాసనం. ఇతడు ఊరేగింపు రథం బాగు చేయడానికి ఇరవై అయిదు పణం పురట్టాశి బ్రహ్మోత్సవంలో మూడు రథా లకు (బ్రహ్మదేవ, విష్వక్సేన, వేంకటేశ్వరస్వామి విగ్రహం) మూడు సుగియన్‌పడి, నాలుగున్నర వీశై చక్కెర కలిపిన మూడు నాళివెన్న కట్టడి చేశాడు. ఈవిధంగా మూడు సుగియన్‌పడి, నాలుగు వీశై చక్కెర కలిపిన మూడునాళి వెన్న కార్తికై, తై, పంగుని బ్రహోత్సవాలలో మూడురోజుల రథోత్సవాలకు కట్టడి చేశాడు.

క్రీ. శ.1542 వ సంవత్సరం కోయిల్ కెళ్వి జియ్యర్ శాసనం. ఇతడు పది బ్రహ్మోత్సవాలలో అయిదు రథోత్సవాలకు, అయిదు ఇడ్డిలి పడికి ఇరవై అయిదు పణం కట్టడి చేశాడు.

క్రీ. శ. 1543 వ సంవత్సరం ఎల్లప్పపిళ్లై శాసనం. ఇతడు పురట్టాశి బ్రహ్మోత్సవంలో మలై కునియ నిన్ర పెరుమాళ్ రథాన్ని అలంకరించినప్పుడు ఒక అప్పపడికి అయిదు పణం కట్టడి చేశాడు.

క్రీ. శ. 1945 వ సంవత్సరానికి తాళ్లపాక తిరుమలై అయ్యంగార్ శాసనం ఇతడు మూడు రథోత్సవాల సందర్భంలోనే దేవాలయ రథాలను బాగుచేయడానికి రెండు రేకై పొన్, అయిదు పణం కట్టడిచేశాడు.

క్రీ. శ, 1545 వ సంవత్సరం వేంకటత్తురైవర్ శాసనం. ఇతడు వేంకటే శ్వర స్వామికి శ్రీనివాసన్ ఉభయంగా పురట్టాశి బ్రహ్మోత్సవంలో రథం ఇతని ఇంటిముందు నిలిచినపుడు ఒక మనోహర పడి కట్టడి చేశాడు.

క్రీ. శ. 1547 వ సంవత్సరం శ్రీనివాసయ్యంగార్ శాసనం. ఇతడు తిరుమలలో ప్రతి బ్రహ్మోత్సవం ఎనిమిదవ రోజు రథోత్సవానికి ఒక అతిరసప్పడి ఇతని యింటిముందు బహూకరించాడు.

క్రీ. శ. 1547 వ సంవత్సరం తిమ్మరాజు శాసనం. ఇతని మఠంముందు పురట్టాశి బ్రహ్మోత్సవంలో జరిగే రథోత్సవానికి ఒక అప్పపడి ఏడు రేకై పోన్ నియమనం చేశాడు.

క్రీ.శ. 1547 వ సంవత్సరం తాళ్లపాక సిరు తిరుమలయ్యంగార్ శాసనం. ఇతని పేరుమీదుగా ఆని బ్రహ్మోత్సవంలో ఎనిమిదవరోజు రథోత్సవానికి ఎర్ర తిమ్మరాజు ఏడు రేకై పోన్ విలువగల ఒక సుగియన్ పడి రెండునాళి వెన్న, ఆరు కుండల పాసకం కట్టడి చేశాడు.

క్రీ. శ. 1583 వ సంవత్సరం ఎట్టూరు తిరుమలై కుమార తాతాచార్యర్ శాసనం. ఇతడు బ్రహ్మోత్సవ సందర్భంలో మూడు రథాల అలంకరణార్థం ఒక రేకై పొన్, రెండు పణం కట్టడిచేశాడు.

అరసు (III-113) శాసనంలో రథోత్సవం ఎనిమిదవ రోజు నిర్వహింపబడ లేదని కనిపిస్తున్నాయి.

## ప్రధాన నైవేద్యాలు:

రథోత్సవానికి ప్రధాన నైవేద్యంగా అప్పపడి, అతిరసప్పడి, సుగియన్‌పడి, వడైప్పడి, గోధిప్పడి, ఇడ్డిలిపడి, శీడైపడి మొదలైనవి. సమర్పించారు.

## సంకీర్తనలలో రథోత్సవం:

తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తన రాశిలో రథకీర్తనలెన్నో వున్నాయి వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. రథ ప్రసక్తి మాత్రం వున్నవి.
2. రథోత్సవమని స్పష్టంగా తెలిసేవి.

## రథ ప్రసక్తి కలవి:

అన్నమయ్య శ్రీ మహావిష్ణువు పురుషోత్తమత్వాన్ని నిరూపించడానికిన్ని, శ్రీ వేంకటేశ్వరుడు శ్రీమన్నారాయణుని అర్చావతారమని స్పష్టం చేయడానికిన్ని పౌరాణిక వృత్తాంతాల్ని సంకీర్తనల్లో స్పష్టం చేసినవన్నీ ఈ విభాగంలో చేరతాయి. వీటిలో ప్రధానంగా రావణ విజయం, అయోధ్యాపయనం, నరకాసుర వధ, సాందీప పుత్ర రక్షణ, రుక్మిణీ రక్షణం పౌండ్రిక వాసుదేవ నిగ్రహణం, జరాసంధ, హంసడిభకుల విజయం మొదలైనవి పేర్కొనదగినవి.

## రావణ విజయం:

మిగుల గోపగించి మెరయు రావణమీద
తెగ మెక్కి తోలెనదె దేవేంద్రరథము. (1-400)

## అయోధ్యాపయనం:

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకు
జక్కన మరలిచెలుప్పక రథము. (1-400)

## నరకాసుర వధ:

నిక్కి నరకాసురుపై నింగి మోవనెక్కితోలె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము (1-400)

## సాందీప పుత్రరక్షణ:

జగతి బాలులకై జలధుల వేరజేసి
పగటున తోలె నదె పైడిరథము (1-400)

## రుక్మిణీ రక్షణ

బలిమి రుక్మిణిదెచ్చి పరులగెలిచి మెక్కి
అలయేగు బెండ్లి కళ్యాణ రథము (1-400)

## పౌండ్రక వాసుదేవుల నిగర్హణం:

ఘుట్టగా దోలెడు పౌండ్రకునిపై దేరు (2-110)

## జరాసంధ విజయం:

జట్టిగొన తోలె జరాసంధునిపై తేరు (2-110)

## హంసడిభక విజయం:

కొట్టితోలె హంసడిభకులపై తేరు (2-110)

## రథోత్సవమని స్పష్టంగా తెలిసేవి:

రమన్తేzత్రరథః రమాక్రీడాయాం అని వ్యుత్పత్తి. దీనియందు క్రీడింతురు అని వివరణ. రథం సంస్కృత శబ్దం. దీని వికృతి అరథం, ఈ రెండు పదాలకు దీటుగా 'తేరు' అను పదమున్నది. ఇది ద్రావిడభాష లన్నిట కనిపించు మాట.

అన్నమయ్య తన సంకీర్తన రాశిలో అనేక రథాలను పేర్కొన్నాడు. స్వరూపం బట్టి రథం ఒక్కటే అయినా నిర్మాణం బట్టి ఆధీనంబట్టి, పేర్లు మారవచ్చును. అన్నమయ్య పేర్కొన్న. కళ్యాణ, ఘన, దివ్య. పుడి, పుష్పక రథాలు నిర్మాణానికి సంబంధించినవి.

అలమేగు బెండ్లి కళ్యాణ రథము (1-400)
కనకపు గొండ వంటి ఘనమైన రథముపై (8-122)
దేవ దేవు డెక్కె నదె దివ్యరథము (1-400)
పగటున దోలెనదె పైడి రథము (1-400)
జక్కన మరలిచె బుష్పక రథము (1-400)

ఇంద్ర, దేవేంద్ర, విష్ణు, వేంకటేశ, హరిరథాలు వ్యక్తుల పేర్లతో ప్రఖ్యాతి చెందిన రథాలు.

ఇందుడదివో యింద్రరథముపై (10-26)
తెగ యెక్కె తోలెనదె దేవేంద్ర రథము (1-400)
వెక్కసపు రెక్కలతో విష్ణురథము (1-400)
గరుడ వేగాన శ్రీ వేంకటేశు రథము వచ్చె (9-223)
హరిరథమిదె ముందరి నాగలివిగో (18-402)

## తేరు:-

అన్నమయ్య పేర్కొన్న కనకమయం, గొణిగెల, తిరు, పైడి, బండి కండ్లు, ముత్తెల మేటి, మేలుకట్లు, శిఖరపు, శింగారపు తేరులు నిర్మాణానికి సంబంధించినవి.

గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు (2-366)
మెరుగుల మేఘముల మించు గొణిగెల తేరు (11-24)
రణముల గెలిచి మరలెనదె తిరుతేరు (18-145)
పరంజ్యోతి స్వరూపపు పైడి కుందతేరు (2-366)
పన్నిద్దరు సూరియుల బండి కండ్ల తేరు (2-239)
కొలదిలేని చుక్కల కుచ్చుల ముత్తెం తేరు (2-366)
మిన్నునేలా నొక్కటైన మేటితేరు (2-227)
మించు నానామేఘముల మేలుకట్లతేరు (2-239)
సిరుల ధ్రువ లోకపు శిఖరపు తేరు (10-55)
చెచ్చెర దోలె దిక్కుల సింగారపు తేరు (2-110)

దేవ దేవుని, పరమాత్ముని, దైవశిఖామణి, శ్రీకాంతుని, శ్రీహరి శ్రీపతి, శ్రీశౌరి మొదలైన వ్యక్తుల పేర్లతో ప్రఖ్యాతి చెందిన రథాలు.

తిరిగె తిరిగె నదె దేవదేవుని తేరు (10-55)
పట్టి మేలుచు నెక్కిన పరమాత్మ తేరు (2-227)
దగ్గరె దగ్గరె నదె దైవ శిఖామణి తేరు (10-55)
కన్నుల పండువైన శ్రీ కాంతుని తేరు (2-227)
పరువు-లిడె నదె పట్టపు శ్రీపతి తేరు (10-55)
చెలగె దిగ్విజయపు శ్రీ హరి తేరు (2-227)
అమరుల వెనుబలమగు శౌరి తేరు (2-227)

## అరదం:

అలమేల్మంగ తొనటు శ్రీ వేంకట
నిలయు డరదమున నెగడీని (10-26)
వాయు వేగమున తచ్చె వనజాక్షున రథము
వేయిసూర్యుల ప్రతాప విభవముతో (9-223)
అరదము మీదనెక్కి అమరుల గొలువ
సరితో వీధుల నేగే శ్రీ విభుండు (19-385)

## రథ సంఖ్య

బ్రహ్మోత్సవ సంఖ్యలో వ్యత్యాసం కనిపించినట్లే రథోత్సవాల సంఖ్యలో కూడ మార్పు కనిస్తుంది. అన్నమయ్య కాలం శాసనాలలో రెండు రథోత్సవాల ప్రసక్తి స్పష్టంగా వుంది. అయితే అన్నమయ్య రథసంకీర్తన లలో ఈ వివరాలు స్పష్టంగా లేవు. తేరులసంఖ్య ఉన్నదిగాని ఉత్సవాల సంఖ్యలేదు.

## ఎదురు తేరులు:

ఇద్దరు దేవుళ్ళు దాము నెదురు తేరులమీద
వెనకా ముందరాను వేడుకతో దేరులు (24-138)

## జంట తేరులు:-

జంటతేరుల మీద సతులు నీవును నెక్కి
యింటింట వీదివీది నేగిరాగాను (24-73)

## మూడు తేరులు:-

కోనేటి దరుల గనుగొనరొ మూడు దేరులు
నానా దేవతలార నరులార మీరు (9-228)

## రథంలో ఊరేగేవారు :-

అన్నమయ్య తన రథోత్సవ సంకీర్తనలలో వివిధ రథాలలో ఊరేగే వారిని స్పష్టంగా పేర్కొన్నాడు.

## శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరుడు, దేవేరులు:-

తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుడు
వేంకటేశు డెక్కెనదె వేరొక్క తేరు
లంకలై శ్రీభూసతులు లిలినొక్క తేరెక్కిరి (9-228)

## వేంకటేశ్వరుడు - దేవేరులు :-

పొంది శ్రీవేంకటేశ్వరుడు భూదేవీ నలమేల్మంగా (24-138)
జంట తేరుల మీద సతులు నీవును నెక్కి (24-73)

## స్వామి అలమేలు మంగ:-

అట్టె శ్రీవేంకటేశుడు అలమేలు మంగగూడి
పట్ట మేలుచు నెక్కిన పరమాత్ము తేరు (2-227)

రథోత్సవ ఊరేగింపు సందర్భంలో ఆటలు పాటలుండేవని "ఆటలు బాటలు వింటా నలమేల్మంగము దాను" (8-122)

"ఆదేరు పాదేరు అచ్చెర లెల్ల" (17-304) అనే వాక్యాలను బట్టి తెలుస్తుంది.

సేనాపతి తిరు వీధులలో రథోత్సవ సందర్భంలో వూరేగే వారని (26-558) కీర్తనవల్ల తెలుస్తుంది.

## అలంకరణ:-

వైష్ణవాలయాలలో అలంకారాలకు ప్రాధాన్యం ఎక్కువ " అలంకార ప్రియో విష్ణుః " కనుక ఉత్సవాలలో అలంకారాలకు ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుంది.

తిరుమలలో అన్నమయ్య పేర్కొన్న రథోత్సవ అలంకరణాన్ని మూడు విధాలుగా వర్గీకరించ వచ్చును.

1. సౌందర్య భావన
2. ఆధ్యాత్మిక భావన
3. మధుర భక్తి భావన

## సౌందర్య భావన:-

సామాన్య మానవుల ప్రాకృతిక నేత్రాలకు కనిపించే రూపం యథాతథంగా వర్ణించడం సౌందర్య భావనలో చేరుతుంది. ఇది రెండు రకాలు· మొదటిది ఉన్నది ఉన్నట్లు చెప్పడం, రెండవ దానిలో కాసంత అతిశయోక్తి జత చేయడం.

బండికండ్లు, పడగలు, పూదండలు (10-128) నొగలు, ఘంటలు, తెల్ల గొడుగులు, తోరణములు (18-402) పట్టునూలు, పగ్గాలు, పగడపు నొగలు, సింగారపు పూదండలు (9-221) అలంకరణతో కూడిన రథ వర్ణన వున్నది.

కొండ వంటిది (2-487) కనక మయం కలది. (2-366) వైడూర్యపు ఇరుసులు (9-221) మొదలైన అతిశయోక్తులతో కూడిన రథ వర్ణన వుంది.

## ఆధ్యాత్మిక భావన:-

వేద పురాణ ఇతిహాస ఆగమాలు మొదలైనవి హిందూ మతానికి మూలా ధారాలు. ఆయా గ్రంధాలోని తత్వాన్ని రథ వర్ణనలో జత చేయడం అన్నమయ్యలో పేర్కొదగింది.

ఇందిరయు దానుగూడి యిట్టె వరాలొసగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీనిదివో

వేదములే గుఱ్ఱములు విష్ణుని రథమునకు
వాదపు శాస్త్రములే తీవ్రపు పగ్గాలు
పాదగు పంచ భూతాలే పరగు బండికండ్లు
ఆదిగొని మనో వీధులందు నేగీనిదివో

జీవులెల్లా సారధులు శ్రీవిభుని తేరునకు
కావించు నెక్షాలు వడిగల గుంపులు
భావించ దన ప్రకృతి పట్టపు సింహాసనము
వేవేలు సంపదలతో వెలసీ నేడిదివో

చందురుడు రవియును చరున బైడి కుండలు
చెందిన పుణ్యము లెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశుడల మేలు మంగదాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో (8-146)

## మధుర భక్తి భావన:-

భక్తి తొమ్మిది రకాలు. నాయికా నాయక భావంతో భగవంతుని ఆరాధించడం మధుర భక్తి అనిపించు కుంటుంది ఈ భక్తిగల వారికి ప్రపంచ మంతా నాయక పరంగానే ఉంటుంది.

భక్తి పారవశ్యమైన అన్నమయ్య రథ అలంకరణము :

అలమేలు మంగ యింకె అనుకవ వర్ద నుండడి
చెలరేగి కందుము చిత్తగించవయ్యా

తరుణి దేహమే నీకు తగు దివ్య రథము
గరుడ ధ్వజం బాపె కప్పు పయ్యెద
తురగములు రతుల దోలెడు కోరికలు
సరినెక్కి వలపుల జయించవయ్యా

దిండుకల పిఱుదులు తేరు బండి కండ్లు
అండనే షువ్వుల గుత్తు లాపె చన్నులు
కొండవంటి శృంగారము కోపు నగల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా

వెలది కంఠము నీకు విజయ శంఖ మదిగో
నిలువెల్లా సాధనాలు నీకు నాపై
యెలమి శ్రీవేంకటేశ యిద్దరును గూడితిరి
పలు జయములు నిట్టి పరగవయ్యా (14-90)

## సంగీత విశేషాలు:—

అన్నమయ్య రథోత్సవ సంకీర్తనలు ఎక్కువగ సాళంగ నాటలోను మిగిలినవి, దేసాళం, మాళవి, గౌళ, బౌళి, ఆందోళి, సాడి, శంకరాభరణం, శుద్ధ వసంతం, కాశి, నాదరామక్రియ, సౌరాష్ట్రం, దేవ గాంధారి, మొదలైన రాగాలలో వ్రాయ బడ్డాయి.

రథోత్సవ సంకీర్తనలన్నీ మూడు చరణాలు కలవే. తేరు అనేమాట (2-366, 11,24) కీర్తనల్లో ప్రతి చరణాంతంలోను ఆవృత్తి అవుతుంది. ఆదేరు పాదేరు అచ్చరలెల్ల (17-304) అనే వాక్యాన్ని బట్టి రథోత్సవ సందర్భంలో నృత్య భంగిమలతో కూడిన ఆటలు పాటలుండేవని తెల్పుస్తున్నది.

## తిరుమలలో రథోత్సవం:-

తిరుమలలో వెలసిన అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవం జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవం కన్యా మాసంలో శుక్ల పక్ష శ్రవణ నక్షత్రంలో ప్రారంభమయి, నానా లంకార భూషితమైన రథోత్సవం ఎనిమిదవ రోజు దేదీప్యం మానంగా నిర్వ హిస్తారు.

అయితే మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం వస్తుంది, ఆ సంవత్సరం మాత్రం తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటి బ్రహ్మోత్సవం మామూలు ప్రకారం, రెండవ బ్రహ్మోత్సవం ఆశ్వయుజ మాసంలో శ్రవణ నక్షత్రంలో అవభృథంతో నవాహ్నికంగా జరుగుతుంది. ఈ ఉత్సవంలో రథోత్సవ స్థానంలో రజతరథోత్సవం నిర్వహింపబడుట విశేషం.

# డోలోత్సవం

******

దోల అంటే ఊయల. దోలలో స్వామిని దేవేరులను ఉంచి ఊపుతూ జరిపే ఉత్సవం. దీనికే తమిళంలో ఊంజల్ సేవ అని, తెలుగులో ఉయ్యాలసేవ అంటారు.

ఉయ్యాల పాటల ప్రసక్తి నన్నెచోడుని కుమార సంభవంలో "ఉవిద లంపు మిగుల నూయల పాటలు పాట మధు మదమున బాడెనలులు" (4-89) అని ఉంది.

కల్లూరి వీరభద్రశాస్త్రి గారు త్యాగరాజ కీర్తనలు విశేష వివరణం ప్రథమ సంపుటంలో పరమ భాగవతుల దాస భక్తి సంప్రదాయములో "దోలోత్సవము" మిక్కిలి రమ్యమైనది. ఈ ఉత్సవము లందు బ్రహ్మాది దేవతలు, దేవ మునులు, నారదాదులు, పరమ భాగవతులు, వేద పండితులు సామగానములు, స్తుతులు సంకీర్తనములు చేయు చున్నట్లు దివ్య సన్నివేశ మును భావించినారు. అని తెలియ జేశారు.

## డోలోత్సవం ఆధారాలు:-

ఈ డోలోత్సవం తిరుమలలో చాలా కాలం నుండి జరుగుతుందన దానికి ప్రధానంగా రెండు ఆధారాలు కనిపిస్తున్నాయి.

1. శాసనాధారం
2. సంకీర్తనాధారం

## శాసనాలలో డోలోత్సవం:-

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధిపత్యంలో వున్న ఆలయ గోడలపై అనేక శాసనాలు చెక్కబడి వున్నాయి. వానిలో ఎక్కువ భాగం తమిళం

లోను, కొన్ని తెలుగు, కన్నడం, హిందీ, సంస్కృతంలో ఉన్నాయి. ఈ శాసనాలలో డోలోత్సవ ప్రశంస వున్న వాటిని మూడు దశలుగా వర్గీకరించ వచ్చును.

ప్రథమ దశ :- [1424కు పూర్వం]

క్రీ శ. 1230వ సంవత్సరం నాటి శాసనం. ఈ శాసనం తిరుమల దేవాలయ మొదటి ప్రాకారం వంటశాలకు వెలుపలి తట్టు దక్షిణ భాగంలో వుంది. ఆ శాసనంలో "చిత్తరై మాదముమ్ అణ్ణ................." అని వుంది. "అణ్ణ" తర్వాత ఒక పదం వుంది. ఆ పదం ఊంజల్ అయి వుండ వచ్చునని తిరుపతి చరిత్రలో టి.కె.టి. రాఘవచార్యుల వారు భావించారు.

ద్వితీయ దశ :- [1424—1503]

ద్వితీయ దశ దోలోత్సవ ప్రశంస వున్న శాసనాలు మూడు కనిపిస్తాయి.

మొదటిది క్రీ. శ. 1473 సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర మేదినీ మిశ్రగండ కత్తారి సాళువ, సాళువ నరసింహరాయ ఉదయర్ శాసనం. ఇది దోలోత్సవ ప్రశంస స్పష్టంగా కనబడే శాసనం. ఈ శాసన కర్త పడయ వీడు రాజ్యంలోని కలవై పర్రు ఉప విభాగంలో వున్న పొమ్మరి పట్టి గ్రామానికి, ఊంజల్ తిరునాళుకు, మరియు ఇతర ఉత్సవాల నిర్వహణకు దానం చేశాడు. ఈ శాసనంలో తిరునాళుకు సరఫరా చేయాల్సిన వస్తువుల జాబితా విషయం విపులంగా సూచించాడు. ఈ ఉత్సవం చాంద్రమాన నెలలో సప్తమి నుండి ఏకాదశి వరకు అయిదు రోజుల పాటు జరుగుతుంది. బ్రహ్మోత్సవం వలెనే ఈ ఉత్సవానికి ధ్వజారోహణం, తీర్థవారి లేదు. అయితే ఏ నెలలో ఈ ఉత్సవం నిర్వహింప బడేదో పేర్కొనలేదు.

ఊంజల్ తిరునాళ్ తో బాటు చిత్తిరై బ్రహ్మోత్సవంలో మొదట ఏడు రోజులకు, కొడై తిరునాళ్ పదవ రోజుకు, మకర సంక్రమణానికి కలిసి తొమ్మిది రోజులకు స్వామి వారు అణ్ణా వూంజల్లో ఆసీనులై ఉన్నపుడు తొమ్మిది అప్పపడి, తొమ్మిది అతిరసపడి, తొమ్మిది గోధిపడి, తొమ్మిది

పడైపడి, తొమ్మిది సుగియన్ పడి, తొమ్మిది తిరుక్కణామడై నియమనం చేశాడు.

దానకర్త ఊంజల్ తిరునాళ్ అన్ని రోజులకు కలిసి సరఫరా చేసిన పస్తువుల జాబితా క్రింది విధంగా వుంది. 67 మరక్కాల్ ధాన్యం, 153 మరక్కాల్ బియ్యం, 506 నళి నెయ్యి, 12660 పలం బెల్లం, 14 నళి మిరియాలు, 24 మరక్కాల్ పెసలు, 84 మరక్కాల్ నూకపప్పు, 80 మరక్కాల్ ఉద్దులు, 30 మరక్కాల్ గోధుమలు, 100 నళిపాలు, 5 నళి తేనె, 640 పలం చందనం 896 1/4 పణం.

రెండవది క్రీ.శ. 1494వ సంవత్సరం కరటిక్క అణ్ణ దేవగళ్ కుమారుడు తిమ్మణ దణా యక్కర్ శాసనం. ఇతడు దోలా మహోత్సవ ప్రారంభోత్సవానికి ఒక అప్పపడిని నియమనం చేశాడు.

మూడవది క్రీ.శ. 1495వ సంవత్సరం కందాడై రామానుజయ్యంగార్ శాసనం. ఇతడు తిరువేంకట ముడయాన్‌కు సంవత్సరానికి 92 అప్పపడి, 4 సుగియన్ పడి కట్టడి చేశాడు. అందులో అయిదు రోజుల ఊంజల్ తిరునాళ్‌కు అయిదు అప్పపడి ఏర్పాటు చేశాడు.

## తృతీయ దశ :- (1504—1562)

ఈ దశలో డోలోత్సవ ప్రశంస వున్న శాసనాలు పదహారు.

క్రీ.శ. 1504వ సంవత్సరం తిరువేంకట చ్చిరుక్కన్, తిరుప్పణి పిళ్లై ఎంబెరు మానార్ శాసనం. క్రీ.శ. 1511వ శాసనం కారవట్టి ప్పులై ఆళ్వారు కుమారుడు అప్పాపిళ్లై, క్రీ.శ. 1524వ సంవత్సరం వైశ్య తీర్థ శ్రీపాద తీర్థ ఉడయర్ శాసనాలు. వీరు అయిదు రోజుల ఊంజల్ తిరునాళకు అయిదు అప్పపడి, పడి, కట్టడి చేశారు.

క్రీ.శ. 1530వ సంవత్సరం కందాడ రామానుజయ్యంగార్ (IV-3) శాసనం, అన్నమయ్యంగార్ కుమారుడు తాళ్ళపాక తిరుమలై అయ్యంగార్

(IV-6) శాసనం. క్రీ.శ. 1537వ సంవత్సరం నాగమ నాయకర్ కుమారుడు అద్వైప్పం విశ్వనాథ నాయకర్ (IV-81) శాసనం, చిన్నప్ప నాయకర్ కుమారుడు కృష్ణప్ప నాయకర్ (IV-82) శాసనం, శ్రీరామయ్యం గార్ కుమారుడు బాచ్చరాసయ్యర్ శాసనం, భూత శిట్ట భట్టర్ కుమారుడు రామాభట్టరయ్యన్ (IV-84) శాసనం, తిమ్మణ ఉదయార్ కొడుకు ఎల్లప్ప ఉదయార్ (IV-86) శాసనం. క్రీ.శ. 1540వ సంవత్సరం బసవ నాయకర్ కుమారులు పెరియ తిమ్మప్పన్ చిన్న తిమ్మన్(IV-152)శాసనం. ప్రధాని సోమరాసయ్యర్ కుమారుడు అచ్యుత రాయని యొక్క దళవాయ్ తిమ్మరాసయ్యర్ (IV-153) శాసనం. అంగరాజ నాగప్పయ్యన్ (IV-159) శాసనం. ఈ శాసన దాన కర్త లందరు అయిదు రోజులు ఊంజల్ తిరునాళుకు అయిదు అప్పపడి, పడి కట్టడి చేశారు.

క్రీ.శ. 1541వ సంవత్సరం అచ్చారయ్యన్ కుమారుడు సేట్టలూర్ శ్రీనివాసన్ శాసనం, ఇతడు ఊంజల్ ఉత్సవం అంత్య రోజుకు ఒక దోసైప్పడి నియమనం చేశాడు.

క్రీ.శ. 1561వ సంవత్సరం శ్రీమాన్ మహామండలేశ్వర శ్రీరంగ రాజ కుమారుడు తిరుమలయ్యరాజా శాసనం. ఇతడు అణ్ణా వూంజల్ మండపాన్ని నిర్మించాడు. సాళువ నరసింహరాయని చేత ఏర్పాటు చేయబడిన అయిదు రోజుల ఊంజల్ తిరునాళుకు అయిదు అతిరసపడి కట్టడి చేశాడు.

క్రీ.శ. 1562వ సంవత్సరం సొట్టై ఎట్టూర్ తిరుమలై నంబి కుమార్ తాతయ్యంగార్ కుమారుడు సొట్టై ఎట్టూర్ తిరుమలై నంబి శ్రీనివాసయ్యంగార్ శాసనం. ఇతడు అయిదు రోజుల అణ్ణా వూంజల్ తిరునాళుకు అయిదు అతిరసప్పడి ఏర్పాటు చేశాడు.

## పై శాసన పరిశీలన వల్ల తేలిన విషయాలు:-

1. డోలోత్సవ ప్రశంస క్రీ.శ. 1473 నుండే కన్పిస్తుంది. ఈ ఉత్సవం ప్రారంభకుడు సాళువ నరసింహరాయ ఉదయర్

2. ఈ ఉత్సవం సప్తమినుండి ఏకాదశి వరకు అయిదు రోజులు, చిత్తిరై బ్రహ్మోత్సవంలో మొదటి ఏడు రోజులు కొడై తిరునాళ్ పదవరోజు మకర సంక్రమణం రోజు జరిగే ఉత్సవం.

3. అయిదు రోజులు ఊంజల్ ఉత్సవానికి మాన నిర్దేశం లేదు.

4. క్రీ.శ. 1537వ సంవత్సరంలో వెలువడ్డ అయిదు దోలోత్సవ ప్రశంస శాసనాలను బట్టి దీని ప్రాముఖ్యం హెచ్చిందనవచ్చును.

## సంకీర్తనలలో డోలోత్సవం:-

అన్నమయ్య సంకీర్తనలలో డోలోత్సవానికి సంబంధించిన కీర్తనలు రెండు కనిపిస్తాయి.

1. సంస్కృత కీర్తన
2. తెలుగు కీర్తన

ఈ కీర్తనలలో స్థల నిర్దేశం కాని, సమయ నిర్దేశం కాని కనబడదు.

## సంస్కృత కీర్తన:-

దోలోత్సవ కీర్తనలో అన్నమయ్య దశావతార కీర్తన చేశాడు.

దోలా యాంచల దోలాయాం హరే దోలాయాం
మీన కూర్మ వరహా మృగ పతి అవతారా
దానావారే గుణ శౌరేధరణి ధరమరు జనక
వామన రామ రామ వర కృష్ణ అవతారా

శ్యామలాంగా రంగ రంగ సామజవరద ముర హరణ
దారుణ బుద్ధ కలికి దశ విధ అవతారా
శీరపాపే గోసమాపే శ్రీవేంకటగిరి కూట నిలయ (7-140)

## తెలుగు కీర్తన:–

అన్నమయ్య తెలుగు ఊయల కీర్తనలో పరిమిత మయిన ప్రాకృతిక మయిన ఊయలను కాక వ్యాప్తము ఆధ్యాత్మికము, అలౌకికము, అయిన డోలోత్సవాన్ని చెప్పాడు.

అలర జంచలమైన ఆత్మలందుండనీ
యలవాటు సేసె నీవుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవన మందుండనీ
భావంబు దెలిపె నీ వుయ్యాల

ఉదయాస్త శైలంబు లొనర గంభములైన
వుడు మండలం మోచె వుయ్యాల
అదన నాకాశ పద మడ్డ దూలంబైన
అఖిలంబు నిండె నీ వుయ్యాల

పదిలముగ వేదములు బంగారు చేరుపై
పట్టు తెరపై తోచె నుయ్యాల
వదల కిటు ధర్మ దేవత పీఠమై మిగుల
వర్ణింప దరునాయ నుయ్యాల

మేలు కట్లయి మీకు మేఘ మండల మెల్ల
మెఋగునకు మెఋగాయ నుయ్యాల
నీలశైలము వంటి నీ మేని కాంతికి
నిజమైన తొడవాయ నుయ్యాల (1–67)

## సంగీత విశేషాలు:-

అన్నమయ్య డోలోత్సవ కీర్తనలు వరాళి ఆహిరి రాగాలలో వ్రాయబడ్డాయి. ఈ కీర్తనలలో జానపద గేయ ధర్మాలు కనిపిస్తాయి. 7-40 కీర్తన పల్లవిలో డోలయాం, ప్రశంస, 1-67 కీర్తన ప్రతి చరణాం

తంలో ఉయ్యాల అనే మాట ఆవృత్తి అవుతుంది. డోలోత్సవ సమయంలో పాడే పాటల్ని డొల్లరీ గీతాలని శార్ఙ దేవుడు పేర్కొన్నాడు.

## తిరుమలలో డోలోత్సవం:-

తిరుమల శ్రీ స్వామివారికి డోలోత్సవం. రెండు విధాలుగా జరుగు తుంది.

1. దర్పణ భవనంలో డోలోత్సవం
2. బ్రహ్మోత్సవంలో డోలోత్సవం

## దర్పణ భవనంలో డోలోత్సవం:-

శ్రీస్వామి వారికి దర్పణ భవనంలో డోలోత్సవం 1000 రూపాయల ఆర్జితోత్సవం. ప్రతి దినం జరిగే ఈ వుత్సవం నూతనంగా ఏర్పాటు చేయబడింది.

ప్రతి దినం సాయంత్రం శ్రీమలయప్ప స్వామి వారు పట్ట మహిషులతో విలాసంగా డోలా విహారం చేయడానికి రంగ మండపం నుండి బంగారు తిరుచ్చిలో ఆద్దాల్ మహల్‌కు వేంచేసి అచ్చట సిద్ధమై ఉన్న బంగారుడోల అధిష్టిస్తారు. అచట డోలా విహారం పూర్తి అయిన పిమ్మట మహారాజ మర్యాదలతో సన్నిధికి వేంచేస్తారు.

ఈ ఉత్సవం చేయించే వారికి శ్రీ శ్రీనివాస సువర్ణ ప్రతిమా సన్మానం చేసి తమ వారైన ఆరు మందికి శ్రీవారి దర్శనం కలుగ జేస్తారు.

## బ్రహ్మోత్సవంలో డోలోత్సవం:-

ఈ ఉత్సవం ప్రతి సంవత్సరం కన్యామాసంలో గాని, ఆశ్వయుజ మాసంలో నవరాత్రులలో గాని జరిగే బ్రహ్మోత్సవాలలో ప్రతిదినం జరుగు తుంది. ప్రతిదినం రాత్రులందు వాహనోత్సవం జరిగేదానికి ముందుగా శ్రీవారి ఆలయానికి ముందు తూర్పువీధిలోని డోలామండపంలో శ్రీమలయప్ప స్వామివారు పట్ట మహిషులతో డోలా విహారం చేస్తారు.

# కల్యాణోత్సవం

******

" శ్వశ్శ్రేయసం శివం భద్రం
కళ్యాణం మంగళం శుభమ్ " అని అమరం.

"కల్యం సుఖం అణయతి ప్రాపయతి ఇతి కల్యాణం
అణగతౌ సుఖమును పొందించునది అని గురుబాల ప్రబోధకములోని
వివరణ.

వ్యక్తుల కల్యాణం ఆయా వ్యక్తులకి, కుటుంబాలకి మంగళకర మయితే స్వామివారి కల్యాణం లోకాల కంతా మంగళకరమయింది. అందు వల్లనే దేవాలయాల్లో ఇతర ఉత్సవాలతోబాటు కల్యాణోత్సవాలకు ప్రాముఖ్యం హెచ్చింది. విశేషించి వైష్ణవాలయాలలో కల్యాణోత్సవం చేయించడం శుభ ప్రదంగా ప్రజలు భావిస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగే ఉత్సవాలలో కల్యాణోత్సవానికి ఉన్న ప్రాముఖ్యం ఇతర ఉత్సవాలకు లేదనడం అతిశయోక్తి కాదు.

## కల్యాణోత్సవం ఆధారాలు:-

తిరుమలలో కల్యాణోత్సం చాలాకాలం నుండి జరుగుతుందనడానికి ప్రధానంగా మూడు ఆధారాలు కనిపిస్తున్నాయి.

1. శాసనాధారం
2. గ్రంధాధారం
3. సంకీర్తనాధారం

## శాసనాలలో కల్యాణోత్సవం:-

టి.టి.డి. శాసన సంపుటాలలో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి అన్నమయ్యకు తరువాతే (1503 క్రీ. శ.) రెండు శాసనాలు మాత్రం కన్పిస్తాయి. అయినా ఈ శాసన కర్తలు తాళ్ళపాక వంశస్థులు.

మొదటిది క్రీ.శ. 1546వ సంవత్సరంలో పెద తిరుమలాచార్యుని తనయుడగు తిరువేంగళనాథుని శాసనం. ఇతడు చెందలూరు, మల్లవరం గ్రామాలను తిరుమల స్వామివారి వివాహోత్సవానికి అర్పించారు.

రెండవది క్రీ.శ. 1554వ సంవత్సరం సిరు తిరుమలై అయ్యంగార్ కుమారుడు తాళ్ళపాక తిరువేందయ్యర్ శాసనం. ఇతడు స్వామి పెండ్లి తిరునాళకు మల్లవరం గ్రామం 140 బంగారు రేక ఆదాయాన్ని నిలుపుదల చేసి, 470 బంగారురేక ఆదాయం వచ్చే దేవరాయపల్లి గ్రామాన్ని ఏర్పాటు చేశాడు.

ఈ రెండు శాసనాలలోను కల్యాణోత్సవం జరిగే రోజుల గురించి, విధానం గురించి విశేష వివరణలున్నాయి.

## మొదటి శాసనం వల్ల తెలిసే విషయాలు:-

కల్యాణోత్సవం మొదటి రోజు అంకురార్పణ. మొదట సోమ బ్రహ్మ మూర్తుల అనుగ్రహానికి పూజ. పెండ్లిరోజున మలైకు నియన్ర పెరుమాళ్ మరియు నాచ్చియార్లు తిరుమణి మంటపంలో ఆసీనులై యున్నపుడు తిరుమంజనం, కస్తూరి చందనాదులతో ఊర్ధ్వ పుండ్రాలంకరణ, ఊరేగింపు తర్వాత స్వామివారు ఉయ్యాలలో ఉన్నప్పుడు నైవేద్య సమర్పణ; ఆపై పాదాభిషేకం, శ్రీదేవీ భూదేవులతో హంస, చాతక వాహనాలలో వుండగా స్వామివారితో పూలదండల మార్పిడి, పంచవర్ణ పీఠంలో ఉన్నప్పుడు కర్పూర హారతి, ఊరేగింపు పూర్తయి తిరుమల దేవాలయ బంగారు వాకిలి సమీపాన వుండే తిరుమణి మండపంలో అభిజిన ముహూర్తానికి హోమం, వివిధ

భక్షిణులకు నియమనం. రాత్రి ఊరేగింపు తర్వాత తిరుమణైకు (Wedding Chamber) వేంచేయటం మొదటి రోజు కార్యాలన్నీ విషయ్య వివరణ ఉన్నది.

రెండవరోజు కల్యాణోత్సవంలో స్వామి వారికి దేవేరులకు చందన వసంతోత్సవం జరగాలి. ఈ సందర్భంలో చందనాల్అంకరణ, చంద్రోత్సవ ఊరేగింపు సందర్భంలో భక్తులకు చందన సమర్పణ. వసంత తిరుమంట పానికి, చందన తయారీకి, చందనం పంచువారికి కావలసిన ఏర్పాటు చేయాలి. స్వామివారు శ్రీదేవీ భూదేవులతో రెండవరోజు శేషవాహనంలో ఊరేగుతారనే నియమనం చేయబడింది.

మూడవరోజు హోమ కైంకర్యాలకు కావలసిన చందన తాంబూల సమర్పణలు చేయాలి. స్వామి, దేవేరులతో వైకుంఠ విమానంలో ఊరేగడం మొదలైనవి నిర్దేశింపబడ్డాయి.

నాల్గవరోజు తిరుమంజనం. సుమంగలులకు చందన తాంబూల సమర్పణ. రాత్రి స్వామివారు హంస వాహనంలో, శ్రీదేవీ భూదేవులు పల్లకీ వాహనంలో ఊరేగడానికి నియమనం చెప్పబడింది.

అయిదవరోజు రాత్రి స్వామివారు గజవాహనంలో ఆయన దేవేరులు పల్లకీలో ఊరేగే పద్ధతి చెప్పబడింది.

తిరుమల వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవ సందర్భంలో తిరువేంకటాచల మాహాత్మ్యాన్ని, నాచ్చియార్ (గోదాదేవి) తిరుమొళిని పఠించుట విధిగా జరగాలి.

## రెండవ శాసనం వల్ల తెలిసే విషయాలు:-

మొదటి రోజు పెండ్లి ఉత్సవానికి మలైకునియ నిన్ఱ పెరుమాళ్‌కు ఒక ప్రాయసం, తిరుక్కణామదై తళిగై తయారీకి ఒక రేక్కై పొన్ (బంగారు,) రెండు పణం ఏర్పాటు. కల్యాణోత్సవం రెండవరోజు ప్రారంభం నుండి అయిదవ రోజు పూర్తయ్యే వరకు మధ్యవుండే నాల్గు దినాలకు కావలసిన వస్తువులను

సరఫరా చేయడం; పెండ్లి ఉత్సవం అయిదు రోజులలోను ఊరేగింపు సమయంలో తిరువేందయ్యార్ యింటి ముందు అయిదు మనోహరి పడి నియమనం మొదలయిన విశేషాలున్నాయి. బ్రహ్మోత్సవాలవలె రథోత్సవాన్ని పెండ్లి తిరునాళ్లలో చేయాలనే కట్టడి ఉంది.

## గ్రంథాలలో కల్యాణోత్సవం:—

తిరుమల శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి అన్నమయ్య కాలం నాటిదాకా శాసన దాఖలాలులేవు. అన్నమాచార్యుని దౌహిత్రుడయిన రేవణూరి వేంకటాచార్యుడు (క్రీ. శ 16వ శతాబ్దం) కల్యాణోత్సవానికి సంబంధించి కొన్ని వివరణ లిచ్చాడు.

శ్రీపాదరేణు మాహాత్మ్యంలో

"శ్రీలల రంగ మంగమను శ్రీహరికెన్నడు ధారవోయుచో
దాళులపాక యన్నమయ దాగడి గెంగదముల్ ధరిత్రిమా
తాళులపాక చిన్నన పదంబులు పాడిననాడె సర్వరాట్
శైలవిభుండు తత్సవ రజంబును మాకు నొసంగ జెల్లదే" అని,

శకుంతలా పరిణయంలో

"అమ్మహా దేవుండు మదీయ మాతా మహవంశ
శిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామా
తరుండనిపించుకొని భవదీయ సంకీర్తనంబు లాలించిన
కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించె"
నని పేర్కొన్నాడు.

ఈ రెండు గ్రంథాధారాల బట్టి తాళ్ళపాక వంశజులే కల్యాణోత్సవానికి ఆద్యులని స్పష్టమవుతుంది.

## సంకీర్తనలలో కల్యాణోత్సవం:-

అన్నమయ్య సంకీర్తన రాశిలో కల్యాణోత్సవానికి సంబంధించి ఎన్నో కీర్తనలున్నాయి. ఈ కీర్తనల వల్ల తెలిసే ప్రధానాంశాలను మూడు రకాలుగా వర్గీకరించ వచ్చును.

1. అనాటికి ఆచరణలో ఉన్న ఆగమ విధానం
2. భక్తి భావన
3. దేశీయాచారాలు

## ఆనాటికి ఆచరణలోఉన్న ఆగమ విధానం:

ఆపస్తంబుడు కృష్ణ యజుర్వేద గృహ్య సూత్రంలో వివాహానికి చైత్ర వైశాఖ మాసాలు శ్రేష్ఠమని శాసించాడు

"పసిడి యక్షంతలివె పట్టరో వేగమే రారో
దెసల బేరటాండ్లు దేవుని పెండ్లికిని
అదె శ్రీ వేంకటపతి కలుమేలు మంగకును
మొదలి తిరునాళ్లకు మొక్కేము నేడు (18-194)
మొక్కిన నీ మొక్కు లెల్లమొదలి పెండ్లి విడేలు (17-40)
వొలసీనొల్లములను వొడబాటు బాగులను
పొలసి యవమాసవోయ పున్నమివచ్చె (26-818)"

అనే వాక్యాలను బట్టి మొదలి తిరునాళ్ల అనగా సంవత్సర ప్రారంభంలో జరిగే ఉత్సవమని ఊహిస్తే తిరుమలలో కల్యాణోత్సవం చైత్రమాసంలో పున్నమి రోజుతో అంతమయ్యేదని తెలుస్తుంది.

## వివాహదిన సంఖ్య:

క్రీ. శ. 1561 వ సంవత్సరం తిరుమలయ్య రాజా (V-168) శాసనంలో బ్రహ్మోత్సవ దినసంఖ్య 14 రోజులు అనివుంది.

"పెనచి పదోనాడు పెండ్లిపీటమీద". అని అన్నమయ్య పేర్కొనడాన్నిబట్టి ఈకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం తర్వాత నాల్గురోజులు నిర్వహింపబడుతుందని ఊహించవచ్చును. [నాల్గోదినము నేడు నాగవల్లవేళ 26-182]

## వివాహస్థలం:

"వేళవేళ బొత్తులకు విందు లారగించు కొంటా
వాలి కొలువుండీ దిరువాముడి మంటపాన" (20-368)

అనే వాక్యాలనుబట్టి తిరుమలలో స్వామివారి కల్యాణోత్సవం 'తిరువాముడి మంటపం'లో నిర్వహింపబడు తుండేదని తెలుస్తుంది.

## జ రి గే ప ద్ధ తి:

అంకురార్పణంతో స్వామివారి పెండ్లిఉత్సవం ప్రారంభమవుతుందనడానికి

''వెలయగ లక్ష్మి విభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో'' (28-90) కీర్తన నిదర్శనం.

గరుడధ్వజం ఎగరడం (28-96) వైష్ణవులు గంధాక్షతలు ఇవ్వడం (28-96) ఎత్తిరి గరుడధ్వజ మిందిరాపతి పెండ్లికి, సేనాపతి కప్పురవిదేలివ్వడం సుదర్శనం రక్షగా చుట్టి చుట్టిరావడం, వైష్ణవులు తిరువాముడి పాడడం. భాష్య కారులు విందుకు చెప్పడం (18-4) మొదలైనవి ఆగమ విధానానికి సంబధించినవి.

స్వామివారికి బంగారు కొప్పెరల పన్నీరు. రంగుతో గూడిన పచ్చ కప్పురంధూళి, కస్తూరిధూళి, తట్టుపునుంగు, గంధం (3-325) మొదలైనవి మజ్జనం విశేషాల్ని తెలియజేస్తుంది

పెండ్లిరోజులలో స్వామివారు. దేవేరులు, శేష, వైకుంఠ విమానం. హంస, పల్లకి, గజవాహనాలలో ఊరేగే వారని (V-71) శాసన ప్రమాణం ఉంది. అయితే అన్నమయ్య సంకీర్తనలలో వివాహోత్సవానికి సంబంధించిన శేష, వైకుంఠ విమానం. హంస, పల్లకీ, గజవాహనాల ప్రశంస కానరాదు. పెండ్లికి సబంధించిన రెండు రథకీర్తనలు మాత్రమే కనిపిస్తున్నాయి.

''కనకపు గొండవంటి ఘనమైన రథముపై
ధనుజమర్దను డెక్కెదరుణులతో (18-122)
బెరసి మనోరథముపై పెండ్లిపీటమీద
మరిగినిన్ను గూడె మగువ (20-475) అనే

వాక్యాలనుబట్టి స్వామివారు తిరువీధులలో రథంలో ఊరేగే వారని వ్యక్త మవుతుంది.

## భక్తిభావన:

'భజసేవాయం' అని భక్తి వ్యుత్పత్తి చెప్పబడుతుంది సేవించడం యిందులో ప్రధానాంశం. వైష్ణవంలో సేవకు (బంటుతనానికి) అగ్రస్థానంవుంది. 'బంటు బంటుకు బంటుదై వుండుట వైష్ణవం వేనోళ్ళ కొనియాడేధర్మం. స్వామివారికి జరిగే జరుపబోయే అన్ని కైంకర్యాలలోను భక్తునికి ప్రధానస్థానం ఉంటుంది. అటువంటప్పుడు భక్తుడు రెండురకాలైన భావనలు పొందిఉంటాడు.

మొదటిది అలౌకిక భావన

రెండవది లౌకిక భావన

## అలౌకిక భావన:

భక్తుడైన వాగ్గేయకారునికి భగవంతుడు ప్రత్యక్ష స్వరూపంలో దర్శన మిస్తుంటాడు. భగవంతుడు తన యెదుట ఉన్నాడనే భావన భక్తునికి ఎప్పుడూ ఉంటుంది. భగవంతుని దివ్యమంగళాకారం దివ్యలీలలు అతని కళ్లఎదుట తిరుగు తుంటాయి. అట్టివానిని అన్నమయ్య తాదాత్మ్యంతో వర్ణించాడు. వీటిని అలౌకిక భావనగా చెప్పుకొనవచ్చును.

దివ్య దుందుభులు మ్రోసె [18-4] చంద్ర సూర్యులు బండి కండ్లతోడ. వేదరాసులే పగ్గాలు (8-122) పాడిరి సోబానవదె భారతియు గిరిజయు, ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల, కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీ వేంకటాద్రి (8-21) మొదలైనవన్నీ ఈ భాగంలో చేరతాయి.

## లౌకిక భావన:

సాధారణంగా నిత్యజీవితంలో మానవులు చేసుకొనే పెండ్లి తతంగమంతా కూడ భగవంతునికి గూడా అదేవిధంగా జరిగినట్లు భావించి వర్ణించడం లౌకిక భావనలో చేరుతుంది. బాసికాలు కట్టడం, చేతులకు సేసపాలు అందించడం, కంకణధారాలు కట్టడం, సుంకుల పెండ్లిపీటపై గూర్చొండబెట్టడం (20-365), పూలదండలు మార్చడం, కట్నాలు చదవడం (20-110) మొదలైనవి లౌకిక భావనలో చేరతాయి.

అన్నమయ్య సంకీర్తనలలో లౌకిక భావన మూడురకాలుగా కవిపిస్తుంది.

1. తాను మంగమ్మ పక్షంగా నిరూపించడం
2. తాను స్వామి పక్షంగా చెప్పడం
3. తాను ప్రేక్షకుడుగా, పాల్గొనడం

## తాను మంగమ్మ పక్షంగా నిరూపించడం:

సాధారణంగా వివాహాలలో మగపెళ్ళివారని, ఆడపెళ్ళివారని చెప్పడం అలనాటు. మగపెళ్ళివారికి గౌరవ సత్కారాలలో లోటు ఉండదు. లోకంలో పెళ్ళి నిశ్చయం చేసినవారు అమ్మాయితో తాము నిర్ణయించిన అబ్బాయి అంద చందాల్ని విశదీకరించి అమ్మాయి మనస్సు యిష్టపడేలా చేయడం ఉంది. అందరికి పెట్టని కోటవంటివాడు, నరులకు బొమ్మ పెట్టేవాడు, పెల్లగించి భూమిఎత్తేవాడు, పిల్లగోవి రాగాలవాడు, పిల్లైన యావులవాడు పిల్లదీపు పెన్నుడివాడు, పెంచపు సిరిసుపాగవాడు, పెంచక పెరిగినవాడు, వలపించె జక్కన సిరివాడు, పెంట పెరుగుల దొంగవాడు (12-186), నిన్ను పెండ్లియాడినవాడు సింగరాయడు చిత్తగురుడు; కాంచనపు దట్టివాడు, కౌస్తుభపుమణివాడు. మగడయినాడు (30-395) అని అన్నమయ్య మంగమ్మతో పెండ్లికొడుకు గుణగణాలను వర్ణించాడు.

అట్లే తన అమ్మాయి రూపతి అని, గుణవతి అని స్వామికి అన్నివిధాలా తగింది అని చెప్పడంకూడ చేరుతుంది.

ఎట్టుగూడె బెండ్లి యాగమిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మీ నారాయణ యోగము
నెలత కమలవాసి నీవు కమలాక్షుడవు
పొలతికి నీకు గూడె పొంతనాలు
వలుదు చక్రవాకాలు వనితకు చాలు
యెలమి జక్రాయుదుడ విద్దరికి దగును
తరుణి నీలకుంతలి (లు?) తగునీల వర్ణడవు
సరుస మీకే తగు సమ్మంధము
విరతి హేమ వర్ణాకె నీవు పీతాంబరుడవు
సరలి విద్దరి కొక్క జాతియ్యము

పాలవెల్లి బుట్టినాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలు మేలు యిద్దరికి మేనవాలి
యీ లీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సోలిమాకు బెట్టరాదా సోబన విడేలు [26-201]

## తాను స్వామి పక్షంగా చెప్పడం:-

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో తన్ను చెలికత్తెగా, ప్రేయసిగా దాసిగా, సాక్షాత్తు దేవేరిగా భావించుకొని వ్రాశాడు. చెలికత్తెగా భావించు కొన్న కీర్తనలలో కొన్ని అమ్మవారికి సంబంధించినవి. కొన్ని అయ్యవారికి సంబంధించినవి.

ఇట్టే నిన్ను రమ్మనెనేమమ్మ
నెట్టుకొన్న తమ మేలనే జూడవలెనా

కప్పుర మీద కోవమ్మ కాంతుడు నీకు బెట్టించె
అప్పుడే పెండ్లి దనకాయ నటరే
ముప్పిరి పువ్వులు నీకు ముడుచు కోనంపెనమ్మ
చెప్పరేయా పెయుదాను జేకొని మిగిలెనా

గందము నీకు బెట్టింపె గైకొన గదవమ్మ
అందులోనే సోబనపు టక్షతలివా
చందన కాపులు నీకు సరిగట్టు నంపెనమ్మ
యింద నాగవెల్లి కట్నాలింతలోనే వచ్చెనా

పైపై నీకి దివో పల్లకి వెట్టించెనమ్మ
యీ పొద్దే తమకు నేరగు తెండ్లా
చేపట్టి నిన్నిదె కూడె శ్రీవేంకటేశుడోయమ్మ
కోపుల దోడ బెండి కూతుర నా నేమ [13-55]
కీర్తనను కీర్తించాడు.

## తాను ప్రేక్షకుడుగా పాల్గొనడం:-

స్వామికి మంగమ్మపై ఎనలేని అనురాగం. అలాగే మంగమ్మకు కూడ కాని ఏవో కారణాలవల్ల తాను ప్రేక్షకుడిగా (15-129) పాల్గొంటాడు.

కాంతకును నీకును కనురెప్పలె తెర
దంతపు నవ్వులె మీకు తలబాలు
రంతుల వూరుపులె రవళి సోబనాలు
చెంతల మీకీ పెండ్లి చెల్లెగా నేడు

ముదితకు నీకును మోవులె బువ్వములు
కదియు సిగ్గులె మంచి కమ్మ గంధాలు
సదరపు సరసాలె చల్లువేద పీదేలు
యెదురెదురనే పెండ్లి యెసెగెగానేడు

వుంచపు గోలితాకులె వుంకువ సొమ్ములు
ముంచిన పలుసోకులె ముయికిముయి
యెంచపు శ్రీ వేంకటేశ యిందిర నీకూటముల
కంచపు బెండ్లిమీకు గలిగెగానేడు (15-129)

తలబాలు నారాయణుని పోయమనుట (26-152), పొద్దుకాక కొత్తలుగా భోగించమనుట, సరసము లాడమనుట, సేవలు చేయించు కోమనుట (128-538) మొదలైనవి ఈ భాగంలో చేరతాయి.

## దేశీయాచారాలు:

సంస్కృతంలో వ్రాయబడ్డ గ్రంథాన్ని అనువదించే కవికిగాని, అనుసరించి వ్రాసే కవికిగాని, వస్తువు విషయంలోగాని, వర్ణన విషయంలో గాని స్వాతంత్ర్యం వుండదు. కాని జానపద ధర్మంవైపు మొగ్గిన కవికి జానపదుల ఆచార వ్యవహారాలను వర్ణించాలనే తపన ఉంటుంది. విశేషించి ప్రజలలో భక్తిభావన పెంపొందిచాలనే వాగ్గేయ కారునికి ఈఆచారాల వర్ణన

లలో పట్టుదల ఉండడం అనివార్యం. అన్నమయ్య ఈ భావనతోనే స్వామి కల్యాణోత్సవాన్ని ఆంధ్రుల వివాహ పద్ధతుల కనుగుణంగా వర్ణించాడు. దీనివల్ల రెండు ప్రయోజనాలు సమకూరాయి.

మొదటిది వస్తువుపట్ల, వర్ణనపట్ల పాఠకునికి, గాయకునికి సన్నిహిత సంబంధం ఏర్పరడం రెండవది వైష్ణవం తమిళులకి మాత్రం గాకుండా ఆంధ్ర వైష్ణవంగా భాసించడం. వీటిలో బాసికం, పెండ్లిపీట, తెర, మంగళాష్ట కాలు, ముహూర్తం, అక్షంతలు, తలబాలు, కొంగుముళ్లు, సేసలు, విడెము కట్నం, ఆరతులు, శోభనపు అక్షంతలు, శోభనం మొదలైనవి కనిపిస్తాయి.

## బాసికం కట్టడం:

బాసికములు గట్టరో పై పై దంపతులకును
సేస పాలందియ్యరో చేతలకును (20-365)
తరలి యంతటా దేవ దుందుభులు మెరయగ
గరిమ బాసికములు గట్టుకొనేరదివో (20-110)
బాసికము గట్టుకొని పదరగ నేటికి
సేసలు చల్లే అప్పుడు సిగ్గులింకానా (18-153)

## పెండ్లిపీట:

సుంకుల బెండ్లిపీట గూచుండబెట్టరో (20-365)
ఒనరి పెండ్లిపీటపై నున్నారదివో (20-110)

## తెర:

తొలితటి సిగ్గులె బొడ్డతెర మలుగాయ
వలిపపు తెరమాటు వది నింకానా (25-411)
పెలుచు సిగ్గులే మీకు పెండ్లితెర (26-412)
దినమునదె దోమతెర మంచము (22-439)

### మంగళాష్టకాలు:

గక్కున మంగళాష్టకములు చదువరో (20–365)
మునులు మంగళాష్టకములు చదువు చుండగ (20-110)
పలుకుల సరసాలు బలు మంగళాష్టకాలు (20-439)

### కంకణధారణ

కంకణ దారములను కట్టురో యిద్దరికిని (20-365)
కంకణ దారాలు గట్టెగలికి (20-457)

### ముహూర్తం:

మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు
చంచుల బూవుదండలుచాతుకొనేరదివో (20-110)

చిత్తజు తల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించేరిదె ముహూర్తపు వేళ (26-182)
మోసపోక యిట్టె ముహూర్త మడగరో (20-365)

### అక్షింతలు:

పసిడి యక్షంతలి వెపట్టరో వేగమే రారో (8-194)
కలగొన నిచ్చేరు గంధాక్షతలివె (28-96)
తాచిన గంధాక్షతలు తలపోతలు (17-40)

### తలబాలు:

అడరిన తలబాలందెనిదె (28–96)
పందిలి లోపల తలబాలు నేడు (8-194)
పొత్తున దలబాలు వోసెనటా (18-2
తలగనలు గడ దలబాలాయ (25-18)

### కొంగుముళ్లు: (111-89)

వొక్కపైరి కొంగుముళ్లు వోనకగట్టేయరో (20-365)
కొంకులేని మనసుల కొంగుముళ్లు వేసెను (20-457)
కొంతగొంత లేత సిగ్గు కొంగులు వేసినముడి (15-198)

## సేసలు :-

పెనగుచు సేసలు పెట్టేరదే (20-110)
సేసపాలు సిగ్గున దోసిట నీపై నించెను (20-457)
రెండు చేతుల శాసలు రెట్టించి చల్లదొడగె (19-100)

## విడెము :-

హత్తి సేనాపతి యిచ్చెనదె కప్పుర విడేలు (18-4)
నీవు వెట్టిన విడెమె నిశ్చయ తాంబూలమాయ (22-549)

## కట్నం చదివించడం :-

ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువగ (20-110)

## ఆరతులు :-

అమరాంగన లెల్లాను ఆరతులియ్య గాను (20-110)
అంగన లీరే యారతులు
అంగజగురునకు నారతులూ (25-246)

## శోభనపు టక్షంతలు :-

అందుతోనే సోబనపు టక్షంతలివా (13-55)
సుదతి నీకు నొసగె సోబన పక్షంతలు (14-19)

## శోభనం :-

శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి (3-18)
నెల మూడు శోభనాలు నీకు నతనికి దగు (3-280)
నిండు శోభనము నేడు నెయ్యపు దంపతులకు (15-55)

## తిరుమలలో కల్యాణోత్సవం :-

కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవ, పవిత్రోత్సవ దినాలలో కాక ఇతర సాధారణ దినాలలో జరుపుతారు. ఈ ఉత్సవం ఆర్జిత సేవగా జరుప బడు తున్నారు. ఇది రెండు రకాలు.

మొదటిది రెండువేల రూపాయల కట్టడితో చేసే ఉత్సవం. ఇందులో మార్పేమీలేదు.

రెండవది అయిదు వందల రూపాయల కట్టడితో నిర్వహించే ఉత్స వం. ఈ ఉత్సవ నిర్వాహకులకు ప్రసాదాల పంపకం ఉండదు. మిగిలిన అంశాలన్నీ మామూలుగానే ఉంటాయి.

కల్యాణోత్సవ భక్త నిర్వాహకులు, బంధుమిత్ర కుటుంబ సమేతంతో శ్రీస్వామి వారి రంగ మండపంలో చేరుతారు. శ్రీ స్వామివారు ఉదయం, మధ్యాహ్న ఆరాధనలు పూర్తి చేసుకొని శ్రీ భూదేవులతో సువర్ణ తిరుచ్చిలో రంగ మండపం వేంచేస్తారు అచ్చట స్వామి వారిని ఒక సువర్ణ పీఠలో భూదేవులను వేరొక సువర్ణ పీఠలో అలంకరింపచేస్తారు. ఆచార్యుడు శాస్త్రో క్తంగా పెండ్లి తతంగాన్ని పూర్తి కావించి స్వామి వారికి ప్రసాద నివేదనం జరుపుతారు. ఆపై యజమానులకు వస్త్ర, ప్రసాద బహుమానాలు జరుగు తాయి.

## పై పరిశీలన వల్ల తేలిన అంశాలు:—


1. అన్నమయ్య కాలంకు పూర్వం (1424) కల్యాణోత్సవానికి సంబం ధించిన శాసనాలు లేవు.

2. అన్నమయ్య తర్వాత (1503) వెలసిన కల్యాణోత్సవ శాసనకర్తలు తాళ్ళపాక వంశస్థులు కావడం, పైగా అన్నమయ్య వంశస్థులైన రేవ ణూరి శ్రీ పాదరేణు మాహాత్మ్యంలో, శకుంతలా పరిణయంలో కల్యాణోత్సవ ప్రశంస ఉండడం.

౩. ఈ ఉత్సవం బ్రహ్మోత్సవంలో భాగమై తర్వాత పదవరోజు నుండి 14వ రోజు వరకు జరుగు తుండడం.

4. కల్యాణోత్సవ సేవాదులలో శాసనాలకున్న, అన్నమయ్య సంకీర్తన లకున్న తేడాలు కన్పిస్తున్నాయి.

5. కాల చక్రంలో కల్యాణోత్సవం బ్రహ్మోత్సవానికి అను బంధంగా కాక విడిగా జరపడం మొదలైన విషయాలు తెలుస్తాయి.



# ధనుర్మాసోత్సవం

*******

మతాలెన్నయినా మాసాలు మొత్తం పన్నెండే. అయితే మాసాల పేర్లలో మార్పు లుండవచ్చు.

ముప్పై రోజుల కాలాన్ని మాసం అంటారు ఈ మాసాన్ని లెక్కించ డంలో నాల్గు పద్ధతులున్నాయి.

1. నక్షత్ర మాసం
2. సావన మాసం
3. సౌర మాసం
4. చాంద్రమాసం

## నక్షత్ర మాసం :—

ఖగోళంలో ఎన్ని తారలున్నా వాటిలో పరిగణించే నక్షత్రాలు అశ్విని మొదలయిన 27 నక్షత్రాలే, చంద్రుడు ఒక్కొక్క నక్షత్రంతో చేరుతూ క్రమంగా 27 నక్షత్రాలతోను పరిభ్రమణం పూర్తి చేసే కాలాన్ని నక్షత్ర మాస మంటారు.

## సావన మాసం :—

రాత్రి పగలు కలిసి 24 గంటలు లేదా 60 ఘడియలు. అలాంటి ముప్పై సౌర దినములు కల్గిన నెల సావన మాసం.

## సౌర మాసం :—

సౌర మాసం సూర్యునికి సంబంధించింది. అనగా సూర్య సంక్రమణా నికి సంబంధించింది. మేషం, వృషభం మొదలయినవి రాశులు.

ఇట్టి రాశుల సంఖ్య 12. సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో సంచరించే కాలాన్ని సౌరమాస మంటారు. ఇది సుమారు ౬0 రోజులు 10 గంటల కాలపరిమితి గలిగి వుంటుంది

## చాంద్ర మాసం:-

చాంద్ర మాసం చంద్రునికి సంబంధించింది. చంద్రునికి వృద్ధిక్షయా లున్నాయి. అందువలన చాంద్రామాసపరిగణనలో రెండు పద్ధతులు ఏర్పడ్డాయి.

మొదటిది శుక్ల పాడ్యమి మొదలు అమావాస్య వరకు గల కాలం.

రెండవది కృష్ణ పాడ్యమి నుండి పౌర్ణమి వరకు గల కాలం.

సాధారణంగా ఈ మాస పరిమితి 29 దినాలు 22 గంటల కాలం ఉంటుంది చైత్రం మొదలుకొని ఫాల్గుణం వరకు గల మాసాలు చాంద్ర మాసాలు.

## మార్గశీర్ష మాసం:-

తెలుగులో మార్గశీర్షము; వ్యవహారంలో మార్గశిరమని, తమిళంలో మార్గళి అని అంటారు. సాధారణంగా దీనిని ధనుర్మాసంగా పరిగణించే అల వాటుంది.

పౌర్ణమి రోజున చంద్రుడు మృగశిరా నక్షత్రంలో సంచరించడాన్ని బట్టి మార్గశిరమైంది. నక్షత్రాలలో మృగశిరమృదువైన నక్షత్రం. 27 నక్షత్రాల్లో 8 నక్షత్రాలు సర్వదిగ్ద్వారి నక్షత్రాలు. అంటే తిథి, వార, దిక్కాలల అపేక్షలేక తీర్థ యాత్రలు వ్యవహారాది కార్యాలు చేయడానికి అనువైనకాలం.

## మార్గశిర ప్రాధాన్యం:-

మార్గశీర్ష ప్రాధాన్యాన్ని మూడు విధాలుగా నిరూపించ వచ్చు

మొదటిది - జ్యోతి శ్శాస్త్ర ప్రమాణం

రెండవది - పురాణ ప్రమాణం

మూడవది - ఆగమాది ప్రమాణం

## జ్యోతి శ్శాస్త్ర ప్రమాణం:-

ఆకాశంలోని అనంత నక్షత్ర గ్రహాలకు జీవరాశులకు ఉన్న సంబంధాన్ని తెలియజేసే శాస్త్రం జ్యోతి శాస్త్రం. జీవరాసుల జననకాలం బట్టి అప్పటి గ్రహ నక్షత్ర సంచారం బట్టి భవిష్యత్తు నిర్ణీతమై ఉంటుంది. జ్యోతి శ్శాస్త్ర రీత్యా గ్రహాలలో రవి ఆత్మ కారకుడు. చంద్రుడు మన: కారకుడు. ధనుస్సుకు అధిపతి యైన బృహస్పతి బుద్ధి కారకుడు. ఈ నెలలో ఈ మూడూ కలవడం వల్లనూ మార్గశీర్ష మాసం ఆత్మమనో బుద్ధి సంయోగకాలమైంది.

## పురాణ ప్రమాణం:-

మార్గశీర్ష ప్రాధాన్యం బ్రహ్మాండపురాణం, ఆదిత్య పురాణాలలోను భాగవతం, నారాయణ సంహిత, భాస్కరీయం, వాశిష్ఠ ప్రవచనంలో ధనుర్మాస పూజా విధుల్ని విపులంగా చెప్పబడ్డాయి.

## ఆగమ ప్రమాణం:-

స్వామికి జరుపవలసిన పూజా విధానాలను శాస్త్రీయంగా శాసించె శాస్త్రం ఆగమం. ఆగమాలు మూడు:- 1. వైష్ణవ ఆగమం, 2. శైవఆగమం 3. శాక్త ఆగమం.

ఇవి హిందూ ధర్మానికి మూడు శాఖలుగా రూపొందాయి. వీటినే వైష్ణవ శైవ, శాక్తేయ మతములని అంటారు. మార్గశి మాసంలో ఒక రోజు శ్రియః పతిని పూజించి పొంగలిని వేదిస్తే వెయ్యి సంవత్సరాలు ఆరాధించిన ఫలంతో సమానం అని ఈ ఆగమాలలో చెప్పబడింది.

## ఆలయాలలో ధనుర్మాసం:-

సాధారణంగా ఆలయాల్ని శైవ ఆలయాలు, వైష్ణవ ఆలయాలని విభజించడం పరిపాటి. శైవ ఆలయాల్లో ధనుర్మాస సమయంలో మాణిక్య వాచకర్ తిరువెంబావై పారాయణంచేయడం అలవాటు. అలాగె వైష్ణవాలయాలలో

ఆళ్వారులలో ఒకరైన ఆండాళ్ పాడిన తిరుప్పావైలోని ఒక్కొక్క పాశురాన్ని పాడడంఅలవాటు.

తిరుమలలో నెలకొన్న స్వామి వేంకటేశ్వరుడు. ఆ స్వామి విష్ణువని విష్ణుమూర్తి అని వైష్ణవులు భావిస్తారు. ఆండాళ్ తమ తిరు మొషిలో "వెయ్యదోర్ తష నిషళక్కరక్కై వేంగడవర్కెన్నె విదికిత్తియే" అని ప్రార్థించింది. అందువల్లనే వేంకటేశ్వరాలయంలో తిరుప్పావై పాశుర పఠనం ఆమోదింపబడింది. ఆ దృష్టితోనే వైష్ణవ ఆలయాలలో జరుపబడే పూజా కైంకర్యాలు తిరుమలలోకూడా యథాతథంగా జరిపేట్టు రామానుజులుం గారు కట్టడి చేశారు. అందులో భాగంగానే ధనుర్మాస పూజా సమయంలో తిరుప్పావె పఠనం చేస్తారు.

రోజుకు ఒక్క పాశురం వంతున పాడుతారు. ఈ నెలరోజులలో మాత్రం తిరుమలలో మామూలుగా చదివే సుప్రభాత పఠనంలేదు.

## ధనుర్మాసం ఆధారాలు:—

తిరుమలలో ధనుర్మాస పూజా విధానం చాలా కాలంగా సంబరంగా జరుపబడు తుందేది అనవానికి రెండు ఆధారాలున్నాయి.

మొదటిది శాసనాధారం.

రెండవది సంకీర్తనాధారం.

## శాసనాలలో ధనుర్మాసం:-

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధిపత్యంలో ఉన్న దేవాలయాల గోడలపై ఎన్నో శాసనాలు చెక్కబడి ఉన్నాయి. వానిలో ఎక్కువభాగం తమిళంలోను, కొన్ని కన్నడం, కొన్ని తెలుగులో కన్పిస్తున్నాయి. ఈ శాసనాలలో ధనుర్మాసానికి సంబంధించిన శాసనాలున్నాయి. వీటిని రెండు దశలుగా వర్గీకరించవచ్చును.

## ప్రథమదశ 1424 – 1503:-

ఈ మధ్యకాలంలో ధనుర్మాస ప్రశంస అయిదు శాసనాల్లో ఉన్నాయి.

మొదటిది సాళువ నరసింహుని పరిపాలనా కాలంలో తిరువిధసాని ఆనైమది కుమార్తె వళంది 1486 సంవత్సరం శాసనం. ఈమె మార్గళి నెలలో జరగాల్సిన ధనుర్మాస పూజకు 30 తిరుక్కణామదై శ్రీభాండారానికి సమర్పించింది. రోజుకు ఒక తిరుక్కణామదై చొప్పున వస్తువులను సరఫరా చేయాలని నిర్దేశించింది. 1 మరక్కాల్ బియ్యం, 60 పలం బెల్లం, 1 నాళి, 1 దీపం, 1 అళాకు నెయ్యి.

రెండవది సాళువ నరసింహుని యాజమాన్యంలో తిమ్మణన్ 1492 సంవత్సర శాసనం. ఇతడు ధనుర్మాసంలో జరగాల్సిన పూజా నైవేద్య నిర్వహణకు 30 పరుపుపీయల్ [కడలై సుండల్] తిరుప్పోనకం వ్యవస్థ ఏర్పాటు చేశాడు. రోజువారి నైవేద్యానికి 1 మరకల్ బియ్యం. 1 అళాకు పెసలపప్పు, 1 అళాకు నెయ్యి, ఖండ చక్కెర మొదలగునవి ఏర్పాటు చేశాడు.

మూడవది సొత్తై తిరుమల నంబి తిరువేంకటయ్యంగారి కుమారుడు కుమార తాతయ్యంగారి 1493 సంవత్సరం శాసనం. ఇతడు 30 రోజుల తిరుప్పళ్లి ఎఘచ్చికి రోజుకు ఒక పరుపు పీయల్, తిరుప్పోనకం ఏర్పాటు చేశాడు. 1 పట్టి, 3 ఉళక్కు నెయ్యి, 15 దబ్బపప్పు, 76 పలం బెల్లం ఉప్పు, మిరియాలు, పెరుగు ఏర్పాటు చేశాడు.

నాల్గవది వ్యాపారస్థులలో ఒకడైన కులత్తుళార్ పూదోళ్వార్ వెంకటశెట్టి 1494 సంవత్సరం శాసనం. ఇతడు 30 రోజుల ధనుర్మాసపూజా నిర్వహణకు 30 తిరుప్పోనకం కట్టడి చేశాడు. రోజువారి నిర్వహణకు 1 మరకల్ బియ్యం, 1 ఉరి దబ్బపప్పు 1 అళాకు నెయ్యి, కాయగూరలు, పెరుగు, ఉప్పు, మిరియాలు ఏర్పాటు చేశాడు.

అయిదవది తిరుమలై శెట్టి షరణు 1494 సంవత్సరం శాసనం. ఇతడు 30 రోజుల ధనుర్మాస పూజకు 30 తిరుప్పోనకం వ్యవస్థ కల్పించాడు.

## ద్వితీయ దశ:— 1504 – 1547

ఈ మధ్య కాలంలో ధనుర్మాస ప్రశంస కన్పించే శాసనాలు పదహారు.

వెంకట తురైవన్ కుమారుడు పండితర్ పురుషోత్తమయ్యార్ 1536 సంవత్సరం శాసనం. ఇతడు మార్గళి మాసంలో జరిగే 30 రోజుల ధనుర్మాస పూజా నిర్వాహణానికి 30 తిరుప్పోనకం ఏర్పాటు చేశాడు. ధనుర్మాస పూజా ప్రారంభోత్సవానికి దోసపడి వ్యవస్థ కల్పించాడు.

అనంత పండితర్ కుమారుడు నాగర్ పండితర్ 1538 సంవత్సరం శాసనం. ఇతడు మార్గళి మాసంలో ధనుర్మాస పూజా ఉభయానికి 1 తిరుప్పావడి, 100 తిరుపోనకం, 2 తిరుక్కాణామడై, 1 అప్పావడి, 1 అతిరసప్పడి, 1 వడైప్పడి, 1 గోధిప్పడి, 1 సుగియన్‌ప్పడి, ఇడ్లిప్పడి వ్యవస్థ కల్పించాడు.

సేట్టలూర్ పొన్నాంబలందర్ కుమారుడు ఉలగప్పన్ 1540 సంవత్సరం శాసనం. ఇతడు ప్రతి సంవత్సరం మార్గళి మాసంలో జరిగే 30 రోజుల ధనుర్మాస పూజకు 60 తిరుపోనకం ఏర్పాటు చేశాడు.

అంధకాలతీర్థర్ కుమారుడు ఎల్లప్పపిళ్లై 1543 సంవత్సరం శాసనం. ఇతడు ధనుర్మాస పూజకు 1 రైకుపొన్, 5 పణమ్, 30 తిరుపోనకం వెంకటయ్యన్ ఉభయానికి కట్టడి చేశాడు.

కొండార్ దాసరి కుమార్తె గోవింది 1545 సంవత్సరం శాసనం. ఈమె ప్రతి సంవత్సరం జరిగే 30 రోజుల ధనుర్మాస పూజా వ్యవస్థకు 11 ఇడ్డిలిపడి, 30 తిరుపోనకం ఏర్పాటు చేసింది.

కామరాసయ్యన్ కుమార్తె తిరుమలై అమ్మన్ 1547 సంవత్సరం శాసనం. ఈమె 30 రోజుల ధనుర్మాస పూజా నిర్వహణకు 60 తిరుపోనక తళిగై ఏర్పాటు చేసింది.

చేదిరాయర్ మహారాయర్ తమ్మయ్యన్ (V-108) శాసనం. ఇతడు 3 రుపోనకతళిగై మార్గళి తిరుద్వాదశిన ధనుర్మాస పూజకు ఏర్పాటు చేశాడు.

ఉదయర్ దేవి శెట్టి కుమారుడు తిప్పు శెట్టి 1507 సంవత్సరం సోమై అప్పర్ కుమారుడు తిరువేంకట ముదయాన్ 1521 సంవత్సరం కనక పిళ్లై కుమారుడు ఆనై సాందనార్ 1533 సంవత్సరం కోవై కుమార్తె యల్లమ్మన్ 1538 సంవత్సరం, అన్నమయ్యంగారి కుమారుడు తాళ్లపాక పెరియ తిరుమలయ్యం గారు 1539 సంవత్సరం తిరువేంకట చక్రవర్తి కుమార్తె తిరువేంకటత్తార్ 1541 సంవత్సరం తాళ్ళపాక పెరియ తిరుమలయ్యంగార్ 1541 సంవత్సరం సెట్టా అప్పల్ కుమారుడు సెత్తాయిర్ కుప్పయ్యన్ 1547 సంవత్సరం శాసనాల్లోను, వెన్నుమాలై ఇట్టూర్ పల్లికొండన్ [V-234] శాసనం

లోను 30రోజుల ధనుర్మాస పూజకు 30 తిరుపోనకం నైవేద్యం కల్పించినట్లు ఆధారాలున్నాయి.

-శైశాసనాల వల్ల మనకు వ్యక్తమయ్యే విషయాలు-

మొదటిది ధనుర్మాసోత్సవం 30 రోజులకాలం జరిగే ఉత్సవం. రెండవది రోజువారి ఉత్సవ నైవేద్య నిర్వహణకు పొంగలి, అప్పప్పడి, గోధిప్పడి సుగియస్పడి మొదలగునవి సమకూర్చే సంప్రదాయం. మూడవది ఈ ఉత్సవంలో తమ భాగంగా రాజులు, వ్యాపారస్తులు, స్త్రీలు మొదలైనవారు కైంకర్యానికి తగిన వ్యవస్థ చేయడం.

## సంకీర్తనలలోధనుర్మాసం

అన్నమయ్య సంకీర్తనల్లో ధనుర్మాస పూజలకు సంబంధించి మూడు కీర్తనలు కన్పిస్తాయి. వాటిలో రెంటిలో స్పష్టంగా ధనుర్మాస నిర్దేశం ఉంది. ఒకదానిలో ధనుర్మాస మని లేక పోయినా ధనుర్మాస సుప్రభాతమయిన "తిరుపళచ్చి" ఉల్లేఖనం ఉంది.

అన్నమయ్య తన ధనుర్మాస సంకీర్తనల్లో మూడు విశేషాల్ని వ్యక్తం చేయదలచినట్లు స్పష్టమవుతుంది.

1. ధనుర్మాస పూజా విధానం చెప్పడం, 2. ధనుర్మాసకాలంలో జరిగినవిగా తాను భావించిన స్వామి దివ్యలీలల్ని జతచేసి వివరించడం, 3. స్వామి ఆరగింపులలో మానవ నైజాన్ని సమన్వయం చేయడం.

## ధనుర్మాస పూజావిధానం చెప్పడం

భక్తుడు ఉదయకాలం నాలుగు ఘడియలకు ముందుగా లేవాలని ఆగమ శాస్త్రంలో చెప్పినట్లు స్నాన సంధ్యాదుల్ని పూర్తి చేసి, ఆపై స్వామి పూజకు తరలి వెళ్లాలని

ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయ మలర భజింపరోమీ
రిటు ధనుర్మాసముల విభులన్ ఘనులు

వేగ నాలుగు ఘడియలనగా వేదవేద్యులు లేచి సరగున
నాగమోక్త విధులను తమ దేహాను గుణములుగా
వేగమున సంధ్యాదులొగి గావించి విమలాంబోధిశయనుని
బాగుగా బూజించరో యెడపక ధనుర్మాసముల విధులన్ ఘనులు

[11-2-45] పంక్తులలో స్పష్టం చేశాడు.

ఏ మాసం వ్రతం ఆచరించక పోయినా ధనుర్మాస పూజా విధానాలను పాటించాల్సిన అవసరాన్ని, చేయదగిన కాలాన్ని, క్రమాన్ని ఈ పంక్తులలో స్పష్టం చేశాడు. అలాగే స్వామికి పీతాంబరం తొడగడం పువ్వుల్ని సమర్పించడం, ధూపదీపాదుల్ని నివేదించడం మొదలయిన విషయాల్ని

" పరగు చీనాంబరములను నతి పరిమళమ్ముల బుష్పములకడు
వెరవుగా వేంకటపతికి నైవేద్య సంగతుల
అరుదుగా ధూపముల బహు దీపాదులను తాంబూల విధులను
పరగ బూజింపుడు సమస్త ప్రభు ధనుర్మాసమున విధులన్ ఘనులు
[11-2-45]

తొడనే గంధాక్షతలు ధూప దీపాలివిగో
కూడిన విప్రుల వేద ఘోషణలివే
వాడుదేర బూజించవలె గమ్మబువ్వులివే
వీడెమిదెకొలువుకు విచ్చేయవయ్యా [9-195]

పంక్తులలో నిర్దేశించాడు.

అన్నిటికన్న ధనుర్మాస కాలంలో తిరువాముడికి, సంకీర్తపఠనానికి అవకాశం ఉందేదని ఈ క్రింది పంక్తులవల్ల తెలుస్తుంది.

"చదివేరు వైష్ణవులు సారెదిరువాముడిదె
బలసి సంకీర్తనపరులు పాడిరివే" [9-195]

బహుశ : అన్నమయ్య తాను వ్రాసిన ధనుర్మాసం పాటలు ఈ ఉత్సవ కాలంలో పాడి స్వామిని మెప్పించే వాడని ఊహించడానికి వీలుంది.

2. ధనుర్మాస కాలంలో జరిగినవిగా తాను భావించిన స్వామి దివ్య లీలల్ని జత చేసి వివరించడం.

దుష్టశిక్షణార్థం స్వామి అవతరిస్తుంటారు వాటినే అవతారాలంటారు. ఆయా అవతారాలలో స్వామి లోకోత్తరమయిన లీలలు సంవత్సరంలో ఏ కాలంలో నయినా జరగవచ్చు. కాని కొన్నిటికి దీపావళి లాంటి వాటికి కాలాన్ని నిర్దిష్టంగా చెప్పడానికి వీలుంది. కొన్నిటికి చెప్పలేము. కాని అన్నమయ్య ధనుర్మాస కాలంలో స్వామి యోగ నిద్ర నుండి మేల్కొవడం, గోవర్ధనగిరి ఎత్తడం, గోపికా విహారం మొదలయినవి జరిగినవిగా భావించినట్లు స్పష్ట మవుతుంది.

అతి బ్రహ్మాండాలు గుఱినటు ధరించినయట్టి
అతనికి జేయరో ఆరగింపులు
ప్రతిలేని క్షీరాబ్ధిబవళించిలేచినట్టి
చతురునికి జేయరో చలినారగింపులు
యేడు దినములు దాకా నెత్తెను గోవర్ధనము
ఆడిపచ్చె బాలునుకి ఆరగింపులు
మేదెప గోపికలతో మిక్కిలి పెనగినట్టి
వేడుకకానికి దేరో విందులారగింపులు [9-9]

3. స్వామి ఆరగింపులలో మానవనైజాన్ని సమన్వయం చేయడం:

ఆకలి మానవ సహజం. చాలాలు తన కోసం కాకపోయినా కడుపులో ఉన్న బిడ్డకోసమయినా ఆరగిస్తుంది. అలాగే చాలారోజులు నిదురపోయిన వాడు నిద్రలేవగానే ఆకలికి అవురుమంటారు. అదే మోస్తరు బరువు ఎత్తిన పడుగాని ఆకలికి లోనవుతాడు. ఈ మానవ నైజాన్ని స్వామికి అన్వయించి ఆకలి కొన్నారని ఆరగింపులు చేయమని, అనడంలో ఔచిత్యంపుంది.

## ధనుర్మాసంలో కోలాటం:-

ప్రతి యింటిలో గొబ్బి పెట్టడం ధనుర్మాసం రోజునే ప్రారంభమవుతుంది. "గొబ్బిళ్ల" అంటే వేడుక, క్రీడా విశేషం. నమస్కారభేధం అనే అర్థాలు సూర్యరాయని ఘంటువులో చెప్పబడ్డాయి. తమిళంలో 'కుమ్బుడు' అంటే మ్రొక్కు. గొబ్బి అర్థాలు కనిపిస్తాయి.

## అన్నమయ్య గొబ్బిపాట :-

సంక్రాంతి సమయంలో పాడే పాటలు గొబ్బిపాటలు. ఇప్పటికి వెలువడ్డ అన్నమయ్య సంకీర్తన రాశిలో ఒక గొబ్బిపాట కనిపిస్తుంది.

కొలని దోపరికి గొబ్బిళ్లో యదు
కులస్వామికిని గొబ్బిళ్లో

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యులకెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్లో

పాపవిధుల శిశుపాలునికిట్ల
కోపగానికిని గొబ్బిళ్లో
యేపున గంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో

దండివైరులను తఱిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్లో
వెండిబైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్లో [12-98]

ధనుర్మాస సమయాలలో స్త్రీలు గుంపులు చేరి బాలకృష్ణుని లీలా విలాసాదుల్ని కీర్తిస్తూ పాడేవారని తెలుస్తుంది.

## సంగీత విశేషాలు :-

అన్నమయ్య ధనుర్మాస సంకీర్తనలు మూడూ భూపాళంలోనే పాడబడ్డాయి. ప్రొఫెసర్ సాంబమూర్తిగారు ఆ రాగాన్ని "ఇది ఇప్పటి 8వ మేళమైన తోడిరాగ జననం. ఈ రాగాన్ని ఔత్తరాహులు భూపాలతోడి అని, దాక్షిణాత్యులు భూపాలమని అంటారు. ఇది ఉదయకాలంలో పాడతగిన రాగం. ఇది పురుషరాగం సూర్య అంశంతో పుట్టడం వల్ల దీన్ని పూర్వాయామంలోనే పాడాలని నియమం" అని పేర్కొన్నారు.

"ఏమినిద్దిరించేవు యెందాకాను
కామించి బ్రహ్మాదులెల్లగాచుకున్నారిదివో" [9-196]

అనే పంక్తుల్లో స్వామికి మేలుకొలుపు పాడటం స్పష్టంగా కాన వస్తుంది.

"వేకువ దిరుపళచ్చి విష్ణువికి జేయరో
అకటి కొదగినట్టి ఆరగింపులు [9-9]
ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయ మలర భజియింపరో మీ
రిటు ధనుర్మాసముల విధులన్ ఘనులు [11-2-45]


ఈ రెండు కీర్తనల్లోను భక్తుడైనవాడు ఉదయమే మేల్కొని స్వామి సేవకు సంసిద్ధుడు కావలసిన అవసరాన్ని స్పష్టం చేయడం వల్ల ఈ రాగం లాక్షణికంగా ప్రయోగింపబడిందని స్పష్టమవుతుంది.

అలాగే గొబ్బిపాటల్లో 2-4 పాదాంతాలలో గొబ్బిళ్లో అనే మాట అవృత్తి అవుతుంది. ఇది పూర్తిగా స్త్రీలపాట. అడుగులు వేస్తూ పాడుకోవడానికి అనువయిన పద్ధతిలో దేశాళం సాగిన రచన. ఇది

తిరుమలలో వేంచేసిన అర్చామూర్తి వేంకటేశ్వరుడు. ఇక్కడ వైఖానస ఆగమం ప్రకారం పూజావిధానాలు సాగుతాయి వాటిలో ధనుర్మాప పూజావిధానం ఒకటి. ధనుర్మాస పూజాకాలంలోనే ముక్కోటి ఏకాదశి పర్వదినం కూడా వస్తుంది.

ఈ ధనుర్మాస పూజా జ్ఞాపకాత్మంగా స్వామి వక్షస్థలంలోని శ్రీదేవి పార్శ్వంలో సువర్ణ శుక ప్రతిమారాజాన్ని అర్చకులు అలంకరిస్తారు. సుప్రభాతమునకు బదులుగా, ఆండాళ్, తిరుప్పావై పాశురాలను రోజుకు ఒకటి వంతున పఠిస్తారు.

శ్రీగోదాదేవి ప్రియుడయిన శ్రీకృష్ణస్వామికి వేడినీటితో అభిషేకం చేసి అలంకరించి ఏకాంతసేవా భాగ్యాన్ని కలుగచేస్తారు. ధనుర్మాసం ముప్పై దినాలు అన్ని ప్రధానపూజలన్నీ శ్రీకృష్ణస్వామి వారికి జరుపుతారు.



# పుష్పయాగోత్సవం

****

ఒక మూర్తి ప్రత్యేకతను రెండు రకాలుగా గుర్తించవచ్చు. మొదటిది విగ్రహ నిర్మాణం. రెండవది అలంకార వైభవం.

విగ్రహాల నిర్మాణంలో అవయవాల పొందిక, వివిధ భంగిమలు ప్రధానము అవుతాయి. ఇక రెండవది అలంకరణ వైభవం. అలంకరణలు అనేక రకాలు.

1. వేషాలంకరణ.
2. భూషణాలంకరణ.
3. పుష్పాలంకరణ.
4. వాహనాలంకరణ.

## వేషాలంకరణ :-

స్వామి మూల విగ్రహానికి గాని, ఉత్సవ విగ్రహానికి గాని తొడిగే వస్త్రాదికం వేషాలంకరణ. మూల విగ్రహానికి అభిషేక సమయంలో గోణం పెట్టడం 'ఉల్‌సట్టు' తొడగడం, 24మూరల పొడవున్న చాపువస్త్రాన్ని, 11 మూరల పొడవున్న ఉత్తరీయాన్ని స్వామికి తొడగడం మొదలయినవి. అలాగే ఉత్సవ విగ్రహానికి మోహినీవేషం, వేటవేషం వేయడం లాంటివి.

## భూషణాలంకరణ :-

స్వామి పాదాలనుండి శిరసుదాకా వివిధ ఆభరణాలు తొడగడం భూషణాలంకార మవుతుంది. మూల విగ్రహానికైతే పద్మపీఠం, చిన్న కంటె, మకర కంటె (ఇది మూడు అంతస్తులది. ప్రతి అంతస్తుకు గండబేరుండం ప్రతిమవుంది), కటిహస్తం, వైకుంఠహస్తం, రత్నబంధం, వలయం, రవ్వలవడ్డాణం, రవ్వల యజ్ఞోపవీతం, వంకీలు, భుజకీర్తులు, శంఖచక్రాలు, సూర్యకటారి, మకర

కుండలాలు, కలికితురాయి మొదలైనవి. ప్రత్యేకించి బ్రహ్మోత్సవాలలోను, వైకుంఠ ఏకాదశి పర్వదినాలలోను వజ్రకిరీటం, నవరత్నఖచిత అభయహస్తం మొదలైనవి తొడుగుతారు. ఉత్సవ విగ్రహానికైతే ప్రధానంగా వజ్రకవచం, మకర కంఠి, లక్ష్మీహారం మొదలైనవి తొడగడం.

## పుష్పాలంకరణ :-

స్వామికి వివిధరకాల పుష్పాలతో జరిగే అలంకరణ పుష్పాలంకరణ మూల విగ్రహానికి గురువారంనాడు జరిగే తోమాలసేవ, పూలంగిసేవ మొదలైనవి ప్రధాన పుష్పాలంకరణలు. అలాగే స్వామి తిరువీధులలో ఊరేగేటప్పుడు దివ్యమోహనంగా కనిపించడానికోసం పూల అలంకరణ చేయడం కూడ ఈ కోవలో చేరుతుంది.

## వాహనాలంకరణ :-

స్వామిని ఆయా వాహనాల మీద ఆసీనుని చేసి తిరుమల వీధులలోనో లేదా దేవాలయ ప్రాకారాలలోనో త్రిప్పడం వాహనాలంకరణ. శేషవాహనం, చిన్న శేష వాహనం, హంసవాహనం, సింహవాహనం, కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, అశ్వవాహనం మొదలయినవి స్వామి వాహనాలలో పేర్కొనదగినవి. ఆయా వాహనాలను బట్టి విగ్రహ వాహనాలలో ఉదాత్తగాంభీర్యాలు ఉట్టిపడతాయి.

## పుష్పయాగం :-

ప్రాచీనకాలంలో దేవాలయాలలో జంతుబలులుండేవి. బౌద్ధమతానంతరం జంతుబలి స్థానంలో మట్టితోను, పిండితోను చేసిన జంతువులను బలిచ్చే సంప్రదాయం వచ్చింది. ఈ పద్ధతి క్రమంగా మారి బలుల స్థానంలో స్వామి పూజకుపత్ర పుష్పఫల తోయాలు ప్రాధాన్యమియ్యబడ్డాయి. ఆ పద్ధతుల్లో వివిధ ఉత్సవాలు వాడుకలోకి వచ్చాయి, వాటిలో స్వామికి వివిధరకాలైన పుష్పజాతులతో జరిగే యాగం పుష్ప యాగం. ఈ యాగ నిర్వహణకు సంబంధించిన విశేషాలు చెప్పబడును.

పుష్పయాగం ప్రతిష్ఠాంతంలోను, ఉత్సాహాంతంలోను, మేషతులా సంక్ర మణాలలోను, సూర్యోపరాగంలోను, చంద్రోపరాగంలోను, యుగాంతంలోను, సంక్రాంతినాడును, వేంకటేశ్వరుని జన్మనక్షత్రంలోను చేయదగిందని ఉద్దేశం.

దేశాధిపతులు, గ్రామాధిపతులు లేదా కుటుంబ యజమానులు తమ తమ జన్మ నక్షత్రాలలో కూడ స్వామివారికి ఈ ఉత్సవం చేయడానికి అర్హులు. అతివృష్టి, అనావృష్టి, దుర్భిక్ష, దుస్వప్న, రాష్ట్ర విభ్రమ, మహావ్యాధి పీడన, సర్వోపద్రవము లలో గాని శ్రీస్వామి వారికి పుష్పయాగం చేయదగిందని నిర్దేశం.

## పూజలు – పుష్పాలు :-

తమిళంలో పూజను ' పూసై , అంటారు. పూలతో చేసెడి పవిత్రకర్మ అని పై మాటకు అర్థం.

భారతీయ సంస్కృతి పూలతో ముడిపడింది. పుట్టిన లగాయతు మరణాంతం దాకా మానవజీవితంలో పుష్పాలకు ప్రత్యేక స్థానం ఉంది. అటువంటప్పుడు పురుషోత్తముని కైంకర్యంలో పూల ప్రాధాన్యం చెప్పపనిలేదు.

ఏ దేవాలయాలలోను లేనంతగా కొండమీద పువ్వుల వాడకం వుంది. అందుకనే కొండమీద ఇతరులు పువ్వులు వాడకూడదనే నియమం చాలాకాలం దాకా ఉండేది స్వామి కైంకర్యం కోసం పూలవనాలు నిర్మించడం అనాదిగా జరుగుతూ వచ్చినట్లు తెలుస్తున్నది. వీటిని రెండు ఆధారాలతో పరిశీలించవచ్చును.

## గ్రంథాధారాలు :-

కొండమీద ఉద్యానవనాల నిర్మాణాలకు సంబంధించిన విశేషాలు "శ్రీ వేంక టేశ్వర ఇతిహాసమాలలో" కనిపిస్తుంది. ఇది వేంకటాచలమునకు చెందిన చారిత్రక కథమాల. ఈ ఇతిహాసమాలను వ్రాసినవాడు వేంకటాచార్యుడు. ఈ ఇతిహాసమాల క్రీ.శ. 1050 - 1150 నాటిదని చెప్పవచ్చును, ఇందులో ఏడుస్తబకాలున్నాయి. నాల్గవ స్తభకంలో పూలతోటకు సంబంధించిన వృత్తాంతం వుంధి.

స్వామికై పూలతోటలు పెంచినవారిలో మొదటివాడు తిరుమలనంబి. అతడు కొండమీదనే కాపురముండేవాడు. పూలులేని పూజలు ఎందుకని తోటలు పెంచాడు. ఆ తర్వాత అతని మేనల్లుడైన రామానుజుడు నూతన సంప్రదాయాలను ప్రారం భించాడు, వారిరువురి స్మృతి చిహ్నంగా 16వ శతాబ్దందాకా కొండమీద రామానుజ తిరునందవనం, అనంతాళ్వారుల తిరునందవనమని పూదోటలు వెలిశాయి.

శ్రీరామానుజుల కాలంలో (క్రీ.శ. 1135) పంపగా వచ్చిన అనందాళ్వారు తన పూదోటకు మంచినీటి సరఫరాకు అళ్వారుచెరువు త్రవ్వడం ప్రారంభించాడు. భార్యసహాయం తప్ప ఇతరుల సహాయం కోరకుండా చెరువు త్రవ్వాలని అతని ప్రతిజ్ఞ, నిండుచూలాలు చెరువు త్రవ్వడంలో పడేపాట్లను చూడలేని తిరుమల స్వామి బాలకుని రూపంలో వచ్చి సహాయం చేశాడు. స్వామి సేవలో అంత సత్వం కూడదని భార్యను రాయితో అనంతాచారి కొడితాడు. అయితేరాయి బాలునికి తగిలింది. గడ్డం పగిలింది బాలకుడు అదృశ్యమయినాడు. అదే సమయాన తిరుమల ఆలయంలో శ్రీ వారి గడ్డం నుంచి రక్తం స్రవించింది. ఎప్పటిలాగ అనంతసూరి పూజకు కదిలి స్వామిని చూచి నివ్వెరపడ్డాడు. తాను రాయితో కొట్టింది శ్రీనివాసునే అని అర్థం చేసికొని శరణాగతి పొందాడు. అనంతసూరి శ్రీవారి గడ్డానికి రసకర్పూరం అంటించి రక్తాన్ని నిలిపి ఎంతో నొచ్చుకుంటాడు. ఆ రోజుటి నుండి శ్రీవారి గడ్డానికి కర్పూర చుక్క పెట్టడం ఆచారమయింది.

## శాసనాధారాలు :-

తిరుమల దేవాలయం మీద పూలతోటలకు సంబంధించిన శాసనాలు కొన్ని కన్పిస్తున్నాయి.

స్వామివారి పూల కైంకర్యాలు చేసేవాళ్లంతా సాతాని వైష్ణవులు. ఇప్పుడు వాళ్ళను దాసనంబి అంటారు. వారి సేవల వుల్లేఖనం 13, 14 శతాబ్దం శాసనాల్లో కన్పిస్తుంది.

1487 సంవత్సరం శాసనంలో సాళువ నరసింహుని సేనాపతి ముఖప్పాళమ్ నాయికర్ శ్రీవేంకటేశ్వరస్వామి అలంకరణార్థం పూలతోటను ఏర్పాటుచేశాడు.

నాగమనాయకుడు [242] శాసనంలో తన అధీనంలో ఉన్న తిరదంపాడి గ్రామాన్ని 'తిరువిడైఆట్టమ్' తిరుప్పణిప్పురం పేరుతో శ్రీభాండారానికి సమర్పించాడు. తిరుప్పణిపిళ్లై నాగమనాయకుని తరపున స్వామికి పూలు సరఫరా చేసేవాడు.

## పుష్పయాగం ఆధారాలు :-

తిరుమలలో పుష్పయాగం అత్యంత వైభవంగా జరుపబడేది-అనడానికి రెండు ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.
మొదటిది - శాసనాధారం.
రెండవది - సంకీర్తనాధారం.

## శాసనాలలో పుష్పయాగోత్సవం:-

తిరుమల ఆలయంలో వెలసిన శాసనాలు 807. అందు తెలుగు 47. కన్నడం 24. సంస్కృతం 15. హింది 1 శాసనాలు ఉండగా తమిళంలో 720 వున్నాయి. పుష్పయాగం ప్రశంస ఉన్న 9 శాసనాలను రెండు దశలుగా వర్గీకరించవచ్చు.

## ప్రథమదశ [1424 - 1503] :-

ఈ మధ్యకాలంలో పుష్పయాగం ప్రశంస ఉన్న శాసనాలు మూడు కన్పిస్తాయి.

మొదటిది కోయిల్‌కేళ్వి ఎంపెరుమానర్ జియ్యర్ 1446 సంవత్సరం శాసనం. ఇతడు తిరుమల తిరునందవనం పూలతోటకు యజమాని. ఇతడు 1000 నార్పణాన్ని శ్రీభాండారంలో జమచేశాడు. అందుకు వచ్చే వడ్డీలో ఒక తిరువోలక్కం పుష్పయాగానికి కట్టడిచేశాడు.

రెండవది కందాడై రామానుజయ్యంగార్ 1495 సం॥ శాసనం. ఇతడు ఏడురోజులు కొనసాగే పుష్పయాగానికి 7 అప్పప్పడి వ్యవస్థ కల్పించాడు.

మూడవది కందాడై రామానుజయ్యంగార్ 1496 సంవత్సరం శాసనం, ఇతడు 10 రోజుల ఉత్సవంలో భాగమైన కడపటి రోజు పుష్పయాగానికి 5 వట్టి బియ్యం, 5 రకాలపడి తయారీకి 140 పణం వ్యవస్థ కల్పించాడు:

## ద్వితీయదశ [1504 - 1545] :-

ఈ మధ్యకాలంలో పుష్పయాగం ప్రశంస ఉన్న శాసనాలు ఆరు కన్పిస్తాయి.

మొదటిది ఉరయూర్ శెట్టి కుమారుడు తిప్పు శెట్టి 1507 సంవత్సరం శాసనం. ఇతడు పంగుని, పురటాశినెలలో జరిగే పుష్పయాగానికి 70 అతిరసప్పడి వ్యవస్థ చేశాడు. రోజువారి పుష్పయాగానికి 10 అతిరసప్పడి యాగానంతరం జరిగే ఊరేగింపుకు ఒక తిరువారాధనాన్ని కట్టడి చేశాడు.

రెండవది నగరభట్టర్ కుమారుడు రాయసంరామచంద్ర దీక్షితర్ 1535 సంవత్సరం శాసనం. ఇతడు పురటాశి నెలలో జరిగే బ్రహ్మోత్సవ సందర్భంలో పుష్పయాగానికి 1 అప్పపడి వ్యవస్థ చేశాడు.

మూడవది పెరియ పెరుమాళ్ కుమారుడు రామయ్యన్ 1536 సంవత్సరం శాసనం. ఇతడు ప్రతి పుష్పయాగం రోజున 1 పొరి విళాంగాయి **(A Kind of Sweet - Cake)** తయారీకి 1 మరకల్ పెసలు ఏర్పాటు చేశాడు.

నాల్గవది ముమ్మడిశెట్టి కుమారుడు పెరియసాముశెట్టియార్ 1538వ సంవత్సరం శాసనం. ఇతడు ఉత్తమనల్లూర్ ఆదాయంలో 2 పెళ్లై తిరుప్పావకాన్ని తిరువేంకట ముదయాన్‌కు. 9 బ్రహ్మోత్సవాలప్పుడు జరిగే అన్ని పుష్పయాగాలకు 9 అప్పపడిని మళైనిన్ర పెరిమాళ్‌కు వ్యవస్థ కల్పించాడు.

అయిదవది మలయణ్ణన్ మరియు రామయ్యన్ 1538వ సంవత్సరం శాసనం. వీరు వైకాశి, ఆని నెలలో జరిగే బ్రహ్మోత్సవాలప్పుడు రెండురోజుల పుష్పయాగాని 20 తిరువారాధనం వ్యవస్థ కల్పించారు.

ఆరవది అన్నమయ్యంగారి కుమారుడు తాళ్ళపాకం తిరుమలై అయ్యంగార్ 1545వ సంవత్సరం శాసనం. ఇతడు ఆని బ్రహ్మోత్సవ సందర్భంలో పుష్పయాగోత్సవానికి 10 అతిరసప్పడికి 8 రేకై పొన్ కట్టడి చేశాడు.

పై శాసనాలవల్ల మనకు తెలిసే విషయాలు :—

మొదటిది పుష్పయాగంకు, ఇతర ఉత్సవాలకు నియతకాలంగాని, నియత స్థలం గాని ఉన్నట్లు లేదు.

రెండవది పుష్పయాగం తమిళమాసాలైన వైకాశి, ఆని, పంగుని, పురటాశి మాసాలలో నిర్వహింపబడుతుండేది.

మూడవది పుష్పయాగం ఏడురోజులు జరుగుతుండేది.

నాల్గవది పుష్పయాగాంతరం స్వామికి ఊరేగింపు నియతం.

అయిదవది పుష్పయాగ సమయంలో అప్పడి, అతిరసప్పడి, పోరి విళాంగాయి ప్రసాదాలకు నియమనం ఉండేది.

## సంకీర్తనలలో పుష్ప యాగోత్సవం :-

అన్నమయ్య 1424 - 1503 ప్రాంతంలో నివసించిన ప్రసిద్ధ వాగ్గేయ కారుడు. ఇతడు కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామ నివాసి. పదకవితా పితామహుడని పేరొందిన అన్నయ్య 32 వేల కీర్తనలను రోజుకు ఒకటి వంతున రచించాడు. అన్నమయ్య ఈ కీర్తనలలో పుష్పయాగానికి సంబంధించినవి, ఆనాడాస్వామికి జరిగే పూజా విధానాన్ని తెలియజేస్తాయి.

అన్నమయ్య సంకీర్తనలలో రకరకాల పుష్పాల ప్రస్తావన కనిపిస్తుంది.

"బొరెకగా పూజ కందువపూజ" (12-95) అనే సంకీర్తనలో విరవాది కలువరేకులు, మొల్లలు, కమలాలు, కరపల్లవం, జాజననలు, దొండరపూలు, మల్లెమొగ్గలు, చిగురేగులు, పూవుగుత్తులు, మంకెనపూల తడిపూజలను అన్నమయ్య ప్రస్తావించాడు.

అన్నమయ్య సంకీర్తనలలో పుష్పయాగానికి సంబంధించి రెండు కీర్తనలు కన్పిస్తాయి. వాటి రెంటిలోను స్పష్టంగా పుష్పయాగం నిర్దేశం వుంది.

" సకలలోకేశ్వరుడు సరుసజే కొనువాడు
అకలంకముగ బుష్పయాగంబు " (30-209)

ఇది శృంగార కీర్తన సంపుటంలో వుంది. ఇందులో విషయమంతా ఆధ్యాత్మిక కోవకు చెందింది.

"పూవుబోణుల కొలువే పుష్పయాగము " (19-60)

అను కీర్తనలో పుష్పయాగ ప్రశంస నామమాత్రం, ఇందులో మధుర భక్తికి ప్రాధాన్యం ఇవ్వబడింది.

" వివిధ పుష్పములతో వేదఘోషములతో
ఆవల దిరువాముడియు నంగనల యాటతో
కవివందినుతులతో కమ్మబూబులతోడ
నవధరించీ బుష్పయాగంబు

కప్పురపు టారతుల ఘనచందనము తోడ
తెప్పల ధూముల తిరువంది కాప్పుతో
వొప్పుగ బణ్యారములు వొగి బెక్కువ గలతో
అప్పడందీ బుష్పయాగంబు " (30-209)

అను చరణాలలో తిరువాముడి, తిరువందికాప్పు మొదలయిన ప్రయోగాలను బట్టి ఈ యాగంలో నాలాయిర దివ్యప్రబంధ ప్రాముఖ్యం తెలుస్తుంది. అంగనలయాటతో, కవివందినుతులతో అనే రెండుమాటలను బట్టి ఈ యాగ సమయంలో దేవదాసీల నాట్యాలు, సంకీర్తనాచార్యుల కీర్తనల గానం ప్రధానములని తెలుస్తున్నది. వివిధ పుష్పములు అనే మాటను బట్టి ఆనాటి శాసనాధారాలను బట్టి కూడా రకరకాల పువ్వుల వాడకం సత్యమని స్పష్టమవుతుంది. 'ఒప్పుగ బణ్యారములు' అనే మాట శాసనాలలో అప్పప్పడి మొదలైన నివేదనాలతో ఏకీభవిస్తుంది.

" కలువరేకుల వంటి ఘనమైన కన్నుల
వొలతుల చూపులె నీ పుష్పయాగము
తలచి తలచి విన్నుదమమేనుల బొడమే
పులక జొంపములె నీ పుష్పయాగం

కరకమలములను కందువ గోపికలెల్లా
పొరసి నిను జూపుచే పుష్పయాగము
సరసపు మాటలే సారెనాడి తమనవ్వు
పొరినీపై జల్లుచే పుష్పయాగము

గాటపుగొలని దండ గాంతల సిగ్గుస నిన్ను
బూటకానకు దిట్టుచే పుష్పయాగము
యీటున శ్రీవేంకటేశ యిట్టె యలమేలుమంగ
పూట పూట రతులవి పుష్పయాగము [13-60]

సృష్టిలో పరమాత్ముడొక్కడే పురుషుడు. అతడే పురుషోత్తముడు. జీవులందరూ స్త్రీలు. ఆకారం చేత పురుషుడైనవాడు స్వభావం చేత ఆధ్యాత్మిక దృష్టిలో స్త్రీలే అవుతారు. ఆ తపన చూపుల్లో చేతల్లో స్పష్టంగా గోచరమవుతూంటుంది. సంయోగానికి సంబంధించిన పూర్వావస్థలు అనవరత సేవనం, వీక్షణం, భావనపల్లగగుర్పాటు, చేతులు జోడించి శరణాగతి పొందడం ఆ తరువాత పరిచయంతో కలవడం, పరవశంతో నవ్వడం వంటి సన్నివేశాలు భక్తిపరంగా పుష్పయాగానికి అన్వయించి సమ్మిళితంగా చెప్పడ ప్రత్యేకత.

### - తిరుమలలో పుష్పయాగం :—

చాలా కాలం క్రితం కొనసాగుచుండెకి పుష్పయాగం మధ్యాంతరంగా ఆగిపోయింది. మరుగు పడిపోయిన పుష్పయాగాన్ని 14 - 11 - 1980 తేది కార్యనిర్వహణాధికారి శ్రీ. పి. వి. ఆర్. కె. ప్రసాదుగారు పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ ఉత్సవం ఆర్జితసేవగా కూడా జరుపబడుతున్నది.